


# స్థానిక పాలన

ఆగష్టు, 2010

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 7 పేజీలు: 64 వెల: రూ. 20/-


## స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు



దేశ గర్వము దీప్తి చెందగ... దేశ చరితము తేజరిల్లగ
దేశమరసిన ధీరపురుషులు... తెలిసి పాడర తమ్ముడా !



# దీపావళి కథల పోటీ
## (గ్రామీణ కథలు, హాస్య కథలు)

సాహిత్య ప్రక్రియల్లో కథ స్థానం కథదే. అయితే, రాను రాను హృదయాన్ని తాకే మంచి కథలు కరువయిపోతున్నాయి. అందువల్ల మంచి కథకి పట్టం కట్టాలని 'స్థానిక పాలన' పత్రిక నిర్ణయించింది.

ఈ దీపావళి సందర్భంగా గ్రామీణ కథలు, హాస్య కథలు అనే రెండు విభాగాల్లో పోటీ నిర్వహిస్తున్నాం. గ్రామీణ నేపథ్యం ఉండి, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే కథలు ఒక విభాగంలోను, హాస్య కథలను మరొక విభాగంలోను పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.

### బహుమతుల వివరాలు

*రెండు విభాగాలకు విడివిడిగా ఈ కింద పేర్కొన్న బహుమతులుంటాయి.*

| | | |
|---|---|---|
| **ఉత్తమ గ్రామీణ కథ** | **రూ.** | **15,000** |
| **ఉత్తమ హాస్య కథ** | **రూ.** | **15,000** |
| **ద్వితీయ ఉత్తమ గ్రామీణ కథ** | **రూ.** | **10,000** |
| **ద్వితీయ ఉత్తమ హాస్య కథ** | **రూ.** | **10,000** |
| **తృతీయ ఉత్తమ గ్రామీణ కథ** | **రూ.** | **8,000** |
| **తృతీమ ఉత్తమ హాస్య కథ** | **రూ.** | **8,000** |
| **ప్రతి విభాగంలో మూడు కన్సోలేషన్ బహుమతులు (ఒక్కొక్క కథకి)** | **రూ.** | **5,000** |
| **సాధారణ ప్రచురణకు ఎంపికైన గ్రామీణ, హాస్య కథలకు** | **రూ.** | **2,000** |

### గ్రామీణ, హాస్య కథల పోటీకి కథలు పంపే రచయిత(త్రు)లు ఈ కింది సూచనలను గమనించాలి:

☆ కథలు కింద పేర్కొన్న చిరునామాకు అక్టోబర్ 1వ తేదీ లోగా అందే విధంగా పంపాలి.

☆ ఒక్కొక్కరు ఎన్ని కథలయినా పంపవచ్చు ☆ రెండు విభాగాల పోటీలలోను పాల్గొనవచ్చు.

☆ కథ రాతప్రతి మీద కథ పేరు మాత్రమే ఉండాలి. రచయిత పేరు కథకి జతపరిచే హామీ పత్రంలో వుంటే చాలు.

☆ కథ నిడివి చేతి రాతలో A4 సైజు కాగితాల్లో 6 పేజీలు మించకూడదు. సైజుకు మించిన కథలను పరిశీలించటం సాధ్యపడదు.

☆ పేజీకి ఒక పక్క మాత్రమే, దస్తూరీ అర్థమయ్యే విధంగా, స్పష్టంగా రాయాలి.

☆ సామాజిక అంశాలతో పాటు అన్ని అంశాలపై కథలు పంపవచ్చు. అశ్లీలత, అసభ్యత, కులమతాలను రెచ్చగొట్టే ధోరణులు, రాజకీయాలు, వ్యక్తిగత దూషణ, వెకిలితనం లేకుండా ఉండే కథలు పంపాలి.

☆ పోటీకి పంపే కథలు తెలుగు సంస్కృతికి దగ్గరగా ఉండాలి. అరువు తెచ్చుకున్న కథాంశాలు, విదేశీ సంస్కృతీ కథలో ప్రతిఫలించకూడదు. అనుకరణ పాత్రలతో కూడిన కథాంశాలకు దూరంగా ఉండాలి.

☆ ఎంపిక కాని కథలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండవు. ఎంపికకాని పక్షంలో తమ కథలను త్రిప్పి పంపాలని కోరుకునేవారు అందుకు అవసరమైన స్టాంపులు అంటించిన కవర్లను కూడా తప్పక జత చేయాలి.

☆ న్యాయనిర్ణేతల కమిటీ మాత్రమే బహుమతి పొందే కథలను నిర్ణయిస్తుంది.

☆ ఎంపికైన కథలు 'స్థానిక పాలన' పత్రికలో ప్రచురితమవుతాయి.

☆ ఫలితాలను నవంబర్ 2009 'స్థానిక పాలన' పత్రికలో చూడవచ్చు.


చిరునామా:

**ఎడిటర్, 'స్థానిక పాలన'**

ఎ.ఎం.ఆర్. అపార్డ్, రాజేంద్రనగర్,
హైదరాబాద్-500 030. ఆంధ్రప్రదేశ్, ఇండియా.
ఫోన్: 040-24018656, ఫ్యాక్స్: 040-24017005
E-mail: phanikumar@ap.gov.in

స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 7

ఆగష్టు, 2010

ఎడిటర్

**డా॥ ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఏ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఇ.వి. స్వర్ణలత**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**డాక్టర్ పి. రఘునాధరెడ్డి**

**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID : phanikumar@ap.gov.in
phaniapard@gmail.com

# విషయ సూచిక

సంపాదకీయం ........ 2

స్థానిక సంస్థలకు అధికారాల బదిలీపై మరో ముందడుగు ........ 3

పోచమ్మ తల్లికి బోనాలు ........ 7

గ్రామీణాభివృద్ధికి మెట్లు - క్రమబద్ధమైన లేఅవుట్లు ........ 9

పచ్చి బాలెంతరాలు మా భరత మాత (వెంటాడే వాక్యం) ........ 15

పంచాయితీల నాయకత్వం మరింత బలోపేతం కావాలి ........ 16

ధాన్యాన్ని సంరక్షిస్తే, మానవాళి సురక్షితం ........ 19

మహనీయుల చతురోక్తులు ........ 22

మన టీవీ కార్యక్రమాలు, అపార్డు వార్తలు ........ 23

ఎందరో మహానుభావుల త్యాగఫలం ........ 25

ఆంధ్ర దేశంలో మూడు ముఖ్య పోరాటాలు ........ 27

పర్యావరణ స్నేహితం-పగిడిపల్లి గ్రామం ........ 31

పాము పడవ పందాలు - ఓ గొప్ప కన్నుల పండుగ ........ 32

శిఖరాగ్రానికి చేరువైన సైనా - శరత్ కమల్ ........ 36

కొల్లేరు సరస్సు పునరుద్ధరణ-ప్రత్యామ్నాయ జీవనోపాధుల కల్పన ..... 40

రాజస్థాన్‌లో పంచాయతీ ఎన్నికల్లో సరికొత్త 'సంఘటన్' ........ 42

వరద యాజమాన్యంలో గ్రామ పంచాయితీల పాత్ర ........ 50

ఆముక్తమాల్యద-రాయల గుండెచప్పుడు ........ 53

తొలి తెలుగు గణిత శాస్త్రవేత్త 'పావులూరి మల్లన' ........ 54

ఈత (కథ) ........ 57

ఆగష్టు నెలలో చేయాల్సిన పొలం పనులు ........ 59

అమ్మ (కథ) ........ 62

## సంపాదకీయం..

# స్వేచ్ఛా భారతానికి అప్పుడే పరమార్థం

స్వేచ్ఛా భారతం ఆవిర్భవించి ఇప్పటికి సరిగ్గా 63 సంవత్సరాలైంది. దాదాపు 200 సంవత్సరాల పాటు ఆంగ్లేయుల పాలనలో మగ్గి, ఉక్కిరిబిక్కిరయిన భారతీయులు 1947, ఆగష్టు 15వ తేదీన స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. రెండు శతాబ్దాల బానిసజీవితానికి స్వస్తి పలికారు. ఈ స్వాతంత్ర్య సముపార్జనకు ఎందరో మహానుభావులు తమ ధన, మాన, ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. విరామమెరుగక కృషి చేసి మహోద్యమాలను నిర్మించారు. సంవత్సరాల తరబడి ఆ ఉద్యమాలే ధ్యాసగా, శ్వాసగా బతికారు. వారి నిరంతర కృషి వల్లనే, అనుపమాన త్యాగాల వల్లనే మనకు స్వేచ్ఛా, స్వాతంత్ర్య ఫలాలు అందుబాటులోకి వచ్చాయి. ఆ మహానుభావులందరికీ ఈ స్వాతంత్ర్యదినాన శిరస్సు వంచి వందనం, అభివందనం.

1751 నుంచి ఎడతెగకుండా రెండు శతాబ్దాల పాటు సాగిన పోరాటాల్లో ఒక మంగల్ పాండే, ఒక ఝాన్సీ లక్ష్మీబాయి, ఒక తాంతియాతోపే, ఒక సిరాజుద్దౌలా, ఒక హైదర్ అలీ, ఒక టిప్పు సుల్తాను, ఒక వేలు తంబి, ఒక బాజీరావు పీష్వా, ఒక శ్యామ్ సింగ్ అటారీవాలా, ఒక బహదూర్‌షా, ఒక మహారాజా కున్వర్ సింగ్, ఒక నానాసాహెబ్, ఒక మదన్ మోహన్ మాలవ్య, ఒక బిపిన్ చంద్రపాల్, ఒక సురేంద్రనాథ బెనర్జీ, ఒక బాలగంగాధర్ తిలక్, ఒక మేడమ్ కామా, ఒక సావర్కార్, ఒక భగత్ సింగ్, ఒక మోతీలాల్ నెహ్రూ, ఒక జవహర్‌లాల్ నెహ్రూ, ఒక నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఒక మహాదేవ దేశాయ్, ఒక వల్లభాయ్ పటేల్... ఒక్కొక్క వ్యక్తిగా కాక ఒక శక్తిగా పాల్గొన్నారు. తమ వెంట వందలు, వేలాది మందిని నడిపించారు. ఇక గాంధీ మహాత్ముడయితే ఒక మహాశక్తిగా విజృంభించి, లక్షలాది, కోట్లాది మందిని స్వాతంత్ర్య సమరంలో దూకించారు.

ఇక మన రాష్ట్రంలో దుగ్గిరాల గోపాల కృష్ణయ్య, 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం, కన్నెగంటి హనుమంతు, పర్వతనేని వీరయ్య చౌదరి, 'దేశభక్త' కొండా వెంకటప్పయ్య, 'దేశోద్ధారక' కాశీనాథుని నాగేశ్వరరావు, డాక్టర్ పట్టాభి, పింగళి వెంకయ్య, 'మహర్షి' బులుసు సాంబమూర్తి, తెన్నేటి విశ్వనాధం, గొట్టిపాటి బ్రహ్మయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు, ఆచార్య ఎన్‌జి రంగా, అల్లూరి సత్యనారాయణ రాజు, వావిలాల గోపాల కృష్ణయ్య, కల్లూరి చంద్రమౌళి వంటి మహానుభావులు ఎందరో త్యాగాలు చేసి జైళ్లలో మగ్గారు. ప్రాణాలు అర్పించారు. పేరు పేరునా పేర్కొనకపోయినా ఇలాంటి మహాశయులు వేలల్లో ఉన్నారు. తత్ఫలితమే నేటి స్వతంత్ర భారతం.

స్వాతంత్రం సిద్ధించాక మన దేశం ఎన్నో విజయాలు సాధించి, అభివృద్ధి మూట కట్టుకుంది. అయితే, మౌలిక సమస్యలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. నిరక్షరాస్యత, అధిక జనాభా, అనారోగ్యం, పేదరికం, మౌలిక సదుపాయల కొరత వంటి సమస్యలు స్వతంత్ర భారతాన్ని పట్టి పీడిస్తున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి మనలో ప్రతి ఒక్కరం స్వాతంత్ర్య సమరం నాటి దేశ భక్తి స్ఫూర్తితో ముందడుగు వేసినప్పుడే, ఆ సమస్యలను పరిష్కరించుకున్నప్పుడే మన స్వాతంత్ర్య సాధనకు అర్థం... పరమార్థం.









# స్థానిక సంస్థలకు అధికారాల బదిలీపై మరో ముందడుగు

## ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ప్రజా ప్రతినిధుల సమ్మేళనం

**వెయ్యి మైళ్ళ ప్రయాణమైనా, ఒక్క అడుగుతో ప్రారంభించవలసినదే! విధులు, నిధులు, సిబ్బంది, అధికారాలకోసం గత దశాబ్దంన్నరగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై చేస్తున్న ఒత్తిడికి, పరిష్కారం దిశగా మరో అడుగు పడింది. పంచాయతీరాజ్ శాఖామాత్యులు, గౌరవనీయులు శ్రీ బొత్స సత్యనారాయణగారి ఆకుంఠిత దీక్ష వలన, జూన్ 16, 17 తేదీలలో రాజేంద్రనగర్‌లోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రెండు రోజులు సాగిన ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ప్రజాప్రతినిధుల సమ్మేళనం నిజంగా అటువంటి గొప్ప అడుగేనని చెప్పవచ్చును.**

ఇంతవరకు వారు తమ హక్కుల కోసం యూనియన్‌లుగా ఏర్పడి పోరాటాలు చేయటమే కానీ, వారిని పిలిచి మీ సమస్యలు ఏమిటి? అని ప్రశ్నించి, సమస్యలను తెలుసుకొని, పరిష్కారాలను కూడా వారి నుండి సలహాల రూపంలో తీసుకున్న సందర్భాలు గతంలో ఎన్నడూ లేవు.

ముఖ్యంగా స్థానిక ప్రభుత్వాలలో భాగస్వాములుగా వున్న అన్ని వర్గాలను, అనగా జిల్లా పరిషత్ ఛైర్మన్‌లు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, సర్పంచ్‌ల వరకు, ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి సెక్రటరీలు, కమీషనర్‌లు, ముఖ్య కార్యానిర్వహణాధికారులు, జిల్లా పంచాయితీ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా డిప్యూటీ

# పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధుల సమ్మేళనంలో మారుమ్రోగిన 'అపార్డ్' పేరు





**ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధుల సమ్మేళనం జూన్ 16, 17 తేదీల్లో ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రెండురోజుల పాటు అత్యంత వైభవంగా జరిగినది.**

ఈ సమ్మేళనానికి రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుండి జిల్లాపరిషత్ అధ్యక్షులు, 5 గురు జిల్లాపరిషత్ ప్రాదేశిక సభ్యులు, ఐదుగురు మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, 15 మంది గ్రామపంచాయతీ అధ్యక్షులు, ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు, జిల్లాపరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి, జిల్లా పంచాయతీ అధికారి, ఇద్దరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఇద్దరు ఇంజనీరులు హాజరయ్యారు.

ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, మంత్రుల మధ్య ముఖాముఖి చర్చలు జరిగాయి. గ్రామసభ, అధికారాల బదలాయింపు, ఉపాధిహామీ పథకం, మహిళా సాధికారత, 13 వ ఆర్థిక సంఘం మొదలగు వాటిపై పంచాయతీరాజ్ కమీషనర్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్, పవర్‌పాయింట్ ప్రజంటేషన్లు ఇచ్చారు. తదుపరి ప్రజాప్రతినిధులు, మంత్రుల మధ్య ముఖాముఖి చర్చలు జరిపి, అందులోని ముఖ్యమైన వాటిని స్వీకరించారు.

గ్రామ స్వరాజ్యం కావాలని కలలుకన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల సమర్పించి, తదనంతరం జ్యోతి వెలిగించి రాష్ట్ర ముఖ్యమంత్రి రెండురోజుల ప్రజా ప్రతినిధుల సమ్మేళనాన్ని ప్రారంభించారు. ఈ సమావేశానికి శ్రీ బొత్స సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, "తొలుత నేను కూడా 1956 లో గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడుగా ఎన్నికవ్వటం ద్వారా నా రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. అప్పట్లో జిల్లా పరిషత్ ఛైర్మన్ రాష్ట్ర మంత్రి కంటే ఎక్కువ అధికారం కలిగి ఉండేవారు" అని వ్యాఖ్యానించారు.

గ్రామాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడినపుడే దేశం అభివృద్ధి చెందినట్లుగా భావించాలని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధి తరచూ అనేవారంటూ శ్రీ రోశయ్య గుర్తు చేసుకున్నారు. రాజీవ్ కృషి ఫలితంగా 73, 74 రాజ్యాంగ సవరణలను మాజీ ప్రధానమంత్రి శ్రీ పి.వి.నరసింహారావు పదవీకాలంలో పార్లమెంట్ అమోదించింది అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

తొలుత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినపుడు మంత్రివర్గంలోకి ఎవరెవరిని తీసుకోవాలన్న అంశంపై అప్పటి ముఖ్యమంత్రి నేరుగా జిల్లా పరిషత్ అధ్యక్షులను అడిగిన విషయాన్ని శ్రీ రోశయ్య సభాముఖంగా గుర్తు చేసుకున్నారు. "త్రాగునీరు పరిశుభ్రంగా లేకపోతే దాని ద్వారానే రోగాలు వ్యాప్తి చెందుతాయి. సురక్షిత మంచినీటి అవశ్యకతపై ప్రజల్లో చైతన్యం బాగా కలిగించాలి. అందుకే గ్రామసర్పంచ్ తమ పరిధిలో రక్షిత మంచినీటి సరఫరాను ప్రజలకు అందించాలి" అని కూడా ముఖ్యమంత్రి అన్నారు.

మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, "వచ్చే 5 సంవత్సరాలలో ఐదారు వేల కోట్ల రూపాయలు గ్రామీణాభివృద్ధిశాఖ పథకాలకు అందుతాయి" అని చెప్పారు.

ప్రారంభోత్సవ అనంతరం శ్రీ బొత్స సత్యనారాయణ అధ్వర్యంలో ప్రజాప్రతినిధుల ముఖాముఖి చర్చలు జరిగాయి. అందులో పాల్గొన్న జిల్లా పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, సర్పంచ్‌లు పలుమార్లు 'అపార్డ్' పేరు ఉచ్ఛరించారు. వారి మాటల్లో చెప్పాలంటే, "మాకు అపార్డ్ వారు అన్ని విషయాలపైన పలుమార్లు శిక్షణ నిర్వహించి, కావలసిన సమాచారాన్ని పుస్తకరూపంలో ఇచ్చారు. మా పరిధి, అధికారం, సమావేశాలు ఎలా నిర్వహించాలి. ఎలా వుండాలి అనే విషయాలపై చాలా చక్కగా శిక్షణ ఇచ్చారు . . . రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్నట్లుగా మాకు ఇంతవరకూ అధికారాల బదలాయింపు జరగలేదు. కావున త్వరగా అధికారాల బదలాయింపు, నిధులు, నిధుల కేటాయింపు జరగాలి" అని ప్రజాప్రతినిధులంతా ముక్తకంఠంతో పేర్కొన్నారు.

కడప జిల్లా నుండి జిల్లాపరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి డి.జ్యోతి రెడ్డి, ముఖ్య కార్యనిర్వహణాధికారి, శ్రీ ఎ.యస్. వెంకటస్వామి, జిల్లా పంచాయతీ అధికారిణి, శ్రీమతి శోభా స్వరూపరాణి, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, మండల పరిషత్ ప్రాదేశక సభ్యులు, గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, మండల పరిషత్ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు సమ్మేళనంలో పాల్గొన్నారు.

*– ఏ.వి. సురేష్ కుమార్,*

*జిల్లా పరిషత్ శిక్షణా అధికారి, జిల్లాప్రజాపరిషత్ : కడప*

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయితీ కార్యదర్శుల వరకు గల అందరు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులతో జరిగిన ఈ ప్రత్యేక సమ్మేళనం అపూర్వమైనది. అందువల్లనే 73వ రాజ్యాంగ సవరణ ద్వారా సంక్రమించవలసిన 29 అంశాలపై సుదీర్ఘమైన, సుహృద్భావ పూర్వకమైన చర్చ జరిగింది.

ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, గౌరవనీయులు శ్రీ రోశయ్య ఈ సమ్మేళనం ప్రారంభిస్తూ, తన ప్రారంభపు ఉపన్యాసంలో గతంలో జిల్లా పరిషత్ అధ్యక్షులకు ఎనలేని గౌరవ మర్యాదలు ఉండేవని, యం.ఎల్.ఎ.లు కూడా వారిని గౌరవ భావంతో చూసేవారని, వారితో విభేదించడానికి భయపడేవారని, అదే విధంగా సర్పంచ్‌లకు కూడా చాలా గౌరవ మర్యాదలు ఉండేవని, జిల్లా అభివృద్ధి బోర్డులు, పంచాయితీ సమితులు, గ్రామ పంచాయతీలలో పరిపాలన చాలా సమర్థవంతంగా ఉండేదని, ప్రజల అవసరాలు తీరేవని, మరలా అటువంటి పూర్వ వైభవం రావాలని ఆకాంక్షించారు.



పంచాయతీరాజ్ శాఖా మాత్యులు, గౌరవనీయులు శ్రీ బొత్స సత్యనారాయణ, గ్రామీణాభివృద్ధి మంత్రి; గౌరవనీయులు శ్రీ వట్టి వసంతకుమార్, గ్రామీణ నీటి సరఫరా మంత్రి; గౌరవనీయులు శ్రీ పినిపే విశ్వరూప్ మొదలైనవారు పంచాయితీ రాజ్ సంస్థలు బలోపేతం కావాలని కోరారు.

మొదటి రోజు కార్యక్రమంలో గ్రామసభల నిర్వహణ, వాటి అవశ్యకతలతో పాటు గ్రామ సభలు పారదర్శకతకు ప్రతిరూపాలని పేర్కొంటూ, వివిధ అంశాలపై పంచాయితీ రాజ్ కమీషనర్ శ్రీ చంద్రమౌళి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి, చర్చకు సభ్యులకు ఆహ్వానించారు. సిబ్బంది లేమి ముఖ్య అవరోధంగా ఉన్నదని సభ్యులు ఆవేదన వెళ్ళబుచ్చారు. దానిపై మంత్రి తొందరలోనే క్లస్టర్ లెవెల్‌లో పంచాయితీ కార్యదర్శులను నియమించగలమని హామీ యిచ్చారు. వారి సలహాలను, సూచనలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు కూడా ఆయన తెలిపారు.

తరువాత గత 12వ రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల కంటే రాబోయే 13వ ఆర్థిక సంఘం నిధులు ఇబ్బడి, ముబ్బడిగా రానున్నాయని, గత నిధుల కంటే మూడు రెట్లు అధికంగా రానున్నాయని అందులో 60% అభివృద్ధి కార్యక్రమాలకు, 40% పర్యావరణం, పారిశుధ్యానికి ఖర్చు చేయవలసివుంటుందని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులను కూడా సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని శ్రీ చంద్రమౌళి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి సభ్యులను చర్చకు ఆహ్వానించగా, సభ్యులు నిధులను ఫ్రీజింగ్ చేయడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాల అమలు నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తపరిచారు. రాబోయే రోజులలో ఫ్రీజింగ్‌ను ఎత్తివేయగలమని మంత్రివర్యులు హామీ యిచ్చారు.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయవలసిన 29 అంశాల అధికార బదిలీపై చాలా సుదీర్ఘమైన చర్చ జరిగింది. అన్ని స్థాయిలలోని ప్రజా ప్రతినిధులు కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో ఏ విధంగా అధికార వికేంద్రీకరణ జరిగిందో, దాని వలన స్థానిక సంస్థలు ఏ విధంగా బలోపేతం అయ్యాయో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై పూర్తి స్థాయిగా ఆధారపడకుండా, తమ వనరులను ఏ విధంగా ఉపయోగించుకొంటూ అభివృద్ధిని సాధించుకుంటున్నాయో ముక్తకంఠంతో వివరించి, ఆ విధంగా ఈ రాష్ట్రంలో కూడా నిధులు, విధులు, అధికారాలు, సిబ్బందిని స్థానిక ప్రభుత్వాలకు బదలాయించి వారిని స్థానిక ప్రభుత్వాల పర్యవేక్షణలో వుంచాలని కోరారు. ఆ దిశగా ప్రయత్నాలు జరగుతున్నాయని, తొందరలోనే అధికారుల బదలాయింపు జరుగగలదని గౌరవ మంత్రివర్యులు హామీ ఇచ్చారు.

వికేంద్రీకరణ ప్రణాళికల తయారీ, దాని అవశ్యకత, అందులో గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఎవరెవరు ఏ కార్యక్రమాలు చేపట్టాలి, ప్రణాళికలు ఏ విధంగా గ్రామస్థాయి నుంచి తయారు చేస్తే సమగ్రమైన అభివృద్ధి సాధించవచ్చు అనే విషయంపై కూడా సుదీర్ఘమైన చర్చ జరిగింది. గంగదేవుపల్లి గ్రామ అభివృద్ధిని సూచించడం ద్వారా అభివృద్ధి ఎలా చేయవచ్చో వివరించడం జరిగింది. దీనిపై సభ్యులు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది.

మహిళా సాధికారత, ఇందిరా క్రాంతి పథం, మహిళా సంఘాలు వారికి రుణసదుపాయం, పావలా వడ్డీ పథకం, వివిధ రకాల పెన్షన్‌లు అర్హులైన వారికి యివ్వడం గురించి కూడా సుదీర్ఘమైన చర్చ జరిగింది. అన్ని స్థాయిల ప్రజా ప్రతినిధులు ఇందులో పాలు పంచుకున్నారు. మహిళా శక్తి సంఘాల కార్యకలాపాలను, సర్పంచ్‌ల పర్యవేక్షణలో ఉంచాలని సర్పంచ్‌లు కోరగా, మంత్రివర్యులు అది సరికాదు అని సున్నితంగా త్రోసిపుచ్చారు. అంతకంటే మహిళా శక్తి సంఘాల సమావేశాలకు సర్పంచ్‌లను, యం.పి.టి.సి. సభ్యులను ఆహ్వానించవలసినదిగా కోరవచ్చునన్నారు. అదే విధంగా వీరిని కూడా సమావేశాలు ఎప్పుడు జరుగుతున్నాయో తెలుసుకొని హాజరుకమ్మని సలహాయిచ్చారు.

కొందరు మహిళాశక్తి సంఘాలకు రుణ సదుపాయం సరిగా అందటంలేదని ఆందోళన వ్యక్త పరచగా, బ్యాంకులకు తగు ఆదేశాలు ఇవ్వగలమని మంత్రివర్యులు హామీ ఇచ్చారు. వికలాంగులు ప్రస్తుతం పొందుతున్న పెన్షన్‌లలో కొంత మంది అనర్హులు కూడా దొంగ సర్టిఫికెట్లపై పెన్షన్ పొందుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దానిని నివారించడానికి 'సదరం' అనే సాఫ్ట్‌వేర్ విధానం ద్వారా వికలాంగుల అంగవైకల్య స్థాయి నిర్ధారించి, ఆ విధంగా వచ్చిన సర్టిఫికెట్ పొందిన వారికి మాత్రమే పెన్షన్ యివ్వడం జరుగుతుందని, గతంలో పెన్షన్





పొందుతున్న అందరూ ఆ విధమైన సర్టిఫికెట్లు దాఖలు చేయవలసి వుంటుందని తద్వారా అనర్హులను తొలగించగలమని, భవిష్యత్తులో పెన్షన్ పొందవలసినవారు కూడా ఆ విధమైన సర్టిఫికెట్లు తీసుకుంటేనే పెన్షన్ మంజూరు అవుతుందని తెలియజేశారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం మీద చాలా వాడిగా, వేడిగా చాలా సుదీర్ఘమైన చర్చ జరిగింది. విధి విధానాల పై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ తరువాత జరిగిన చర్చలో యం.పి. టి.సి.లు, జడ్.పి.టి.సి.లు, యం.పి.పి.లు పాల్గొంటూ, తమకు కూడా ఈ కార్యక్రమాల అమలులో భాగస్వామ్యం కల్పించాలని, అలా కాకపోతే తాము ఆమోదించిన పనులపై వేరే వారు పెత్తనం చేయడం వలన తాము చులకన అవడమే కాక, తమ గుర్తింపు తగ్గి పోతోందని తీవ్ర ఆవేదన, ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామీణాభివృద్ధి శాఖా మాత్యులు శ్రీ వట్టి వసంత్ కుమార్ మాట్లాడుతూ, ఇది కేంద్ర ప్రభుత్వ పథకమని, ఇందులో ఏ మార్పులు చేయాలన్నా కేంద్రం చట్టాన్ని సవరించవలసి వుంటుందని, సభ్యుల ఆందోళన కేంద్ర ప్రభుత్వానికి తెలుపగలమని, సాధ్యమైన మేరకు వీరికి కూడా భాగస్వామ్యం కల్పించేలా కృషి చేయగలమని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ పథకం క్రింద చేపడుతున్న లింకు రోడ్లు భవిష్యత్తులో తారు రోడ్లుగా, గ్రామీణ సడక్ రోడ్లుగా మార్పు చెంద వలసి యున్నందున ప్రస్తుతం అమలులోవున్న మార్గదర్శక సూత్రాలను తప్పని సరిగా పాటించాలని ఆయన సూచించారు. అదే విధంగా భారత్ నిర్మాణ సేవ క్రింద స్వంత భవనాలులేని గ్రామ పంచాయతీలకు సొంత భవనాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని చెప్పారు.

ఈ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు చేయడం వల్ల వ్యవసాయ పనులకు కూలీలు దొరకడంలేదని వ్యవసాయం చేయడం కష్టంగా ఉందని, వ్యవసాయం వదిలివేసే పరిస్థితి ఉందని, దీనివలన ఆహార ధాన్యాల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని సభ్యులు ఆందోళన వ్యక్త పర్చారు. వ్యవసాయ పనులకు వచ్చే కూలీలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద 50% కూలీ ప్రభుత్వం ఇస్తే, తాము మిగిలిన 50% కూలీ భరించగలమని, ఆ విధంగా సదుపాయం కలుగజేయవలసినదిగా కోరారు. మంత్రి ఈ విషయమై ఆలోచించగలమని హామీ ఇచ్చారు.

స్థానిక సంస్థలలో యం.ఎల్.ఎ.లు, ఎం.పి.లు పెత్తనమే కొనసాగు తుందని తాము ఉత్సవ విగ్రహాల వలే వున్నామని తాము ఆమోదించి పంపిన తీర్మానాలు కానీ, లబ్ధిదారుల లిస్టులు కానీ బుట్టదాఖలు అవుతున్నాయని, యం.ఎల్.ఎ.లు, ఎం.పి.లు సిఫార్స్ చేసినవారి కి మాత్రమే లబ్ధి చేకూరుతుందని, కనీసం స్థానిక సంస్థల వరకైన ఎన్నికైన ప్రజా ప్రతినిధులమైన తమకు విలువ, గౌరవం ఇచ్చే విధంగా చేయాలని, ఆ విధంగా చేసిన నాడే గాంధీజీ ఆశించిన విధంగా గ్రామాలు రామరాజ్యాలుగా, దేశ అభివృద్ధి దిశగా పయనించడానికి దోహదపడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కొందరు అధికారులు సమావేశాలకు హాజరు కాకపోవడంపై కూడా చర్చ జరిగి, ఆ విధంగా హాజరు కానీ అధికారులపై చట్టంలో సూచించిన విధంగా తప్పని సరిగా చర్య తీసుకొని, సమావేశాలకు తగు సమాచారంతో హాజరు అయ్యేలా చూడాలని సూచించారు.




ఈ రెండు రోజుల సమ్మేళనం దిగ్విజయం అయిందని చెప్పవచ్చు. అన్ని జిల్లాపరిషత్ ఛైర్మన్‌లు, కమీషనర్‌లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమీషనర్లు, ఆర్.డబ్ల్యు. ఎస్. కమీషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ రూరల్ డెవలప్‌మెంట్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నమెంటు, పంచాయితీరాజ్ మొదలైన అనేకమంది అధికార ప్రతినిధులు హాజరు అయ్యారు,. అధికారాల బదిలీ విషయంలో ప్రభుత్వం వీరి సలహాల మేరకు ఒక ముందడుగు వేయడం జరిగితే ఈ సమ్మేళనం లక్ష్యం నెరవేరినట్లే.

*- డా॥ ఎస్.వి.బి.ఎస్. శాస్త్రి*
*సీనియర్ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్,*
*ట్రైనింగ్ సెల్, జిల్లాపరిషత్, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు*

# పోచమ్మ తల్లికి బోనాలు

మన అనూచాన సంస్కృతికి ప్రతిబింబాలు ప్రతియేటా మనం జరుపుకుంటున్న పర్వాలు. తెలుగు ప్రాంతానికి సంబంధించి ఉగాది, విజయదశమి, సంక్రాంతి పండుగలు ముఖ్యమైనవని చెప్పవచ్చును. ఇవేగాక ఆయా ప్రాంతాలలో తరతరాల నుండి వస్తున్న జానపదుల పండుగలెన్నో ఉన్నాయి. జానపద సాహిత్యానికీ, కళలకూ గౌరవం లభిస్తున్న ఈ కాలంలో జానపదులు అత్యంత వైభవోపేతంగా జరుపుకునే పండుగల గూర్చి కూడా తెలుసుకోవడం అవసరం.

తెలంగాణాలోని తొమ్మిది జిల్లాలో ప్రజలు శ్రావణ మాసంలో 'బోనాల పండుగ' జరుపుకుంటారు. ఈ పండుగ తీరుతెన్నులు ఈ విధంగా ఉంటాయి. శ్రావణ బహుళ పాడ్యమి మొదలుకొని అమావాస్య దాకా అంటే పక్షం (పదిహేను) రోజులు ఈ 'బోనాలు' తీస్తుంటారు. ప్రతి గ్రామంలో ఊరి చివర పోచమ్మ గుడి ఉంటుంది. ఆ దేవతకు ప్రజలు నైవేద్యాలుగా అర్పించే 'భోజనాలే' 'బోనాలు'గా చెప్పబడుతున్నవి. 'భోజనాలు' అన్న పదం వాడుకలో 'బోనాలు'గా స్థిరపడింది.



## అమ్మతల్లి రాకుండా ఉండేందుకు

మన పూర్వులు సంప్రదాయాల పట్టింపులెక్కువగా కలవారు. వారికి మతం ప్రాణం. అదీగాక ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో మశూచి, కలరా వంటి భయంకర వ్యాధులు ప్రబలుతూ వుండేవి. మశూచిని 'అమ్మతల్లి' అని కూడా అంటారు. పోచమ్మ తల్లి కినుక వల్లనే ఈ వ్యాధి సోకుతుందని విశ్వసించేవారు. తల్లిని శాంతింపజేయడం కోసం ప్రధానంగా గ్రామాల ప్రజలు 'బోనాలు' తీస్తుంటారు.

## ఇంటింటా పర్వశోభ

బోనాల పండుగనాడు ఇళ్ళను నయనపర్వంగా అలంకరిస్తారు. ద్వారాలకు మామిడాకుల తోరణాలు కడతారు. ఇంటిల్లిపాదీ అభ్యంగన స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరిస్తారు. ఉగాది నాడు 'పచ్చడి' కోసం క్రొత్త కుండలెట్లా తేవడం ఆచారమో ఈ పండుగ నాడు కూడా మూడు లేక ఐదు కొత్త కుండలు తెస్తారు. అనేకమైన పిండి వంటలతో షడ్రసోపేత భోజనాలు సిద్ధం చేస్తారు. గృహదేవతలనభిషేకించి నానావిధ పూజాద్రవ్యాలతో అర్చిస్తారు. ప్రత్యేకంగా పరిశుద్ధంగా వండిన పాత్రలోని భోజనాన్ని శుభ్రపరచిన కొత్త కుండలో పెట్టి ఆ కుండను పసుపు కుంకుమలతో అందంగా తీర్చిదిద్ది దానికి మామిడాకుల కంకణం కడతారు. ఆ కుండపైన పెట్టిన మూకుడులో ప్రమిదలు ఉంచి దీపం వెలిగిస్తారు.



## అమ్మవారికి అర్చనలు

సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో గ్రామం నడిబొడ్డున మంగళవాద్యాలు మ్రోగిస్తారు. పాతకాలపు వాద్యమైన 'కొమ్ము' పాడడం ఒక ప్రత్యేకత. ఆ ధ్వనులు వినడంతోనే నూతన వస్త్రాలను ధరించి అందంగా అలంకరించుకొన్న











ఇంటింటిలోని ప్రతి గృహిణి దీపం వెలిగించిన ‘బోనం కుండ’ను తల పై పెట్టుకొని గ్రామం మధ్యకు చేరుకుంటుంది. అందరూ అక్కడికి చేరుకున్న పిదప మంగళ వాద్యాలతో, మేళతాళాలతో ‘బోనాలు’ పోచమ్మ గుడి వైపు తరలివెళతాయి. సంధ్యవేళ వేలాది ప్రమిదలు తలలపై వెలుగుతుండగా స్త్రీలు జ్యోతిర్మూర్తుల వలె కన్పిస్తారు. ‘బోనాల’ను చూడడానికి ఊరికి ఊరే బోనాల వెంట పోచమ్మ గుడి వద్దకు తరలివెళ్తుంది.

## అమ్మవారి సమక్షంలో . . .

నయనపర్వంగా అలంకరించబడిన పోచమ్మ దేవాలయం దగ్గరికి చేరుకున్న తరువాత గృహిణులు బోనాలు అక్కడ దించి నారికేళాలు సమర్పించిన పిదప పసుపు కుంకుమలతో దేవిని అర్చించి మూకుమ్మడిగా ‘దేవి’కి నైవేద్యాలు ఇస్తారు.

## అమ్మ మహిమలే పాటలుగా

బోనాలను ఇళ్ళ నుండి పోచమ్మ గుడి వద్దకు తీసుకువచ్చే సమయంలో, బోనాలు సమర్పించి, అర్చన ముగిసిన తరువాత మళ్ళీ బోనాల కుండలను తలపై పెట్టుకొని ఇండ్లకు వెళ్ళేటప్పుడు స్త్రీలు దారిపొడుగునా పోచమ్మ తల్లిని, ఆమె మహిమలను పలు రకాలుగా ప్రస్తుతిస్తూ బృందగానాలు చేస్తారు. ఈ పాటల్లో పోచమ్మ తల్లే దుర్గామాత, జగదాంబ, మహాకాళి, ముత్యాలమ్మ, దర్బారు మైసమ్మ, కట్టమైసమ్మ అని స్త్రీలు పాడుతూ రూపాలు వేరైనా అమ్మ ఒక్కటేనని అర్థం స్ఫురించేలా బృందాలుగా సాగిపోవడం గమనార్హం. తెలంగాణాలో కులప్రాతిపదికన పక్షం రోజులు ప్రజలు అమ్మ వారికి బోనాలు సమర్పిస్తుంటారు. తెలంగాణాలో చాలా చోట్ల పోచమ్మ తల్లితో పాటు ముత్యాలమ్మ, కట్ట మైసమ్మలకు ప్రత్యేకంగా బోనాలు సమర్పిస్తారు.





## కోర్కెలను తీర్చే రంగుల ‘తొట్టెలు’

బోనాల పండుగ సందర్భంగా తాము కోరుకునే కోర్కెలను తీర్చాలని, తమ సమస్యలు సమసి పోవాలని మొక్కుకున్న భక్తులు అమ్మవారికి దేవాలయంలో వెదురు కర్రలు, రంగు కాగితాలతో డబ్బావలె తయారు చేసిన ‘తొట్టెల’ను సమర్పించుకుంటారు. దేవాలయ ముఖద్వారం వద్ద తమ మొక్కుల క్రింద ఈ తొట్టెలను భక్తులు కడతారు. ఈ తొట్టెలను అమ్మవారికి సమర్పించడం వల్ల తమకు శుభాలు కలుగుతాయని తెలంగాణ జిల్లాలలో ప్రజలు నమ్ముతారు.









## శక్తిస్వరూపిణి - పోచమ్మతల్లి

శక్తి స్వరూపిణియైన కాత్యాయనీ రూపమే పోచమ్మ తల్లి అని తెలంగాణా జానపదుల విశ్వాసం. ప్రతి గ్రామం చివర పోచమ్మ తల్లి గుడి తప్పకుండా ఉంటుంది. ఆ గుడిని శ్రావణమాసం రాగానే బోనాల పండుగకు వారం రోజుల ముందుగానే అలంకరిస్తారు. పోచమ్మ తల్లిని పసుపు కుంకాలతో, ఆభరణాలతో, పువ్వులు, నిమ్మకాయలు, వేపాకులతో అలంకరిస్తారు.

## ఆకర్షణీయమైన నృత్యాలు, సిగాలు

బోనాల పండుగ రోజున బోనాలు ఇండ్ల నుండి పోచమ్మ దేవాలయానికి వచ్చేటప్పుడు, దేవాలయంలో నైవేద్యం అర్పించి ఇండ్లకు తిరిగి వెళ్ళేటప్పుడు బోనాల ముందు వరుసలో యువకులు, భక్తులు చేసే నృత్యాలు, సిగాలు పలువురిని విశేషంగా ఆకర్షిస్తాయి. గ్రామాలలో సాధారణంగా పసుపు కుంకుమలు నిమ్మకాయలతో అలంకరించుకుని అరుణ వర్ణ దుస్తులు ధరించిన పోతరాజులు బోనాల ముందు పోచమ్మ తల్లిని స్తుతిస్తూ నృత్యాలు చేస్తారు.

## సంబరానికి మూగజీవాల బలి

బోనాల పండుగ సందర్భంగా పోచమ్మ దేవాలయాల ప్రాంగణంలో జంతుబలి జరగడం ఆచారంగా వస్తున్నది. కోళ్ళను, గొర్రెలను అమ్మవారికి బలి ఇస్తే తమకు ఏ ప్రమాదాలు, కష్టాలు ఎదురవ్వవని ప్రజల నమ్మకం. ఆలయాల వద్ద జంతుబలిని నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం, వివిధ సంస్థలు జంతుబలిని నిషేధిస్తూ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా ఈ కార్యక్రమం ఆగకపోవడానికి కారణం ప్రజల్లో ఇంకా నెలకొని ఉన్న మూఢాచారాలు తొలగకపోవడమే. ప్రజల్లో జీవహింసను ప్రబోధించి, ఈ జంతుబలి ఆచారం వల్ల కలిగే అనర్థాలను వారికి తెలిపి వారిలో పరివర్తనను తీసుకురాగలిగిన నాడే ఈ ఆచారం సమసిపోతుంది.

తరతరాల తెలుగుదనపు మొగలి రేకుల సువాసనలను గుబాళింపు చేసే బోనాల పండుగ తెలుగు సంస్కృతిని భక్తిశ్రద్ధలతో కాపాడుకుంటూ వస్తున్న తెలంగాణ భక్తుల పండుగ బోనాల పండుగ. తనను అర్చించి నిరంతరం సేవించే భక్తుల్ని కాత్యాయని స్వరూపిణియైన పోచమ్మ తల్లి అనునిత్యం కాపాడుతుందని ఆకాంక్షిద్దాం. హైద్రాబాద్, సికింద్రాబాద్‌లలో మహంకాళి జాతర సందర్భంగా సమర్పించే మాంకాళమ్మ బోనాలు తెలంగాణా ప్రాంతంలో ఆనందోత్సాహాలతో జరుగుతాయి.

*- ఎ.ఎం. ఫీచర్స్*

# గ్రామాభివృద్ధికి మెట్లు - క్రమబద్ధమైన లేఅవుట్లు

*భారతీయులకు గ్రామ పరిపాలన, పట్టణ ప్రణాళిక అనే విషయాలు సుపరిచితమే, హరప్పా నాగరికత కాలం నుండి పటిష్ఠమైన ప్రణాళిక కలిగిన పట్టణాల ఏర్పాటు వేళ్ళూనుకొని ఉంది. సైద్ధాంతిక లెక్కల ప్రకారం రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేయబడింది. జనావాసాలు, వాణిజ్య సముదాయాలు వేరు వేరుగా ఏర్పాటు చేయబడినవి. ఈ పటిష్ఠమైన గ్రామ ప్రణాళిక అనేది సమాజాభివృద్ధికి దోహదపడినది.*

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 22,000 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. సదరు పంచాయితీల రోజువారీ పరిపాలన నిర్వహించటానికి ప్రతి గ్రామ పంచాయితీకి లేదా గ్రామాల సముదాయానికీ ఒక పంచాయితీ కార్యదర్శి ఏర్పాటు చేయబడ్డారు. ప్రతి గ్రామ పంచాయితీలో ప్రజలకు మంచినీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, పారిశుధ్యం అనేవి ముఖ్యమైన సేవలు లేక విధులు.

ఈ సౌకర్యాలను ఏర్పాటు చేయటానికి గ్రామాలు ఒక క్రమమైన పద్ధతిలో అభివృద్ధి చెందాలి. ఇందుకు భవన నిర్మాణం, లేఅవుట్ల ఏర్పాటు అనేది క్రమ పద్ధతిలో జరగాలి. రోడ్ల నిర్మాణం, మంచినీటి పైపులైన్ల ఏర్పాటు, డ్రైనేజీల నిర్మాణం గ్రామ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేయాలి. ఈ మొత్తం కార్యక్రమాన్ని సక్రమంగా నడిపించడానికి పంచాయితీ కార్యదర్శులు గ్రామ పంచాయితీ పాలక వర్గానికి మార్గదర్శకులు కావాలి.

ఇందుకు పంచాయతీ కార్యదర్శులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా పట్టణ ప్రణాళిక లేదా ఆదర్శగ్రామాన్ని తయారు చేసేందుకు అవసరమైన సక్రమ లేఅవుట్ల ఏర్పాట్ల నియమ నిబంధనల విషయంలో సరి అయిన అవగాహన కలిగి ఉండాలి. పంచాయితీ పాలక వర్గానికి గ్రామ సక్రమ విస్తరణపై అవగాహన లేకపోతే గ్రామంలో అస్తవ్యస్త లే అవుట్లు విస్తరిస్తాయి.

### అస్తవ్యస్థ లేఅవుట్ల వల్ల ఏర్పడే ఇబ్బందులు

జనాభా పెరుగుదల, ఇతర కారణాల వల్ల గ్రామాలలో జనావాసాలు పెరుగుతున్నాయి. గృహ నిర్మాణాలు, భవనాలు (గృహాల సముదాయం) పెరుగుతున్నాయి. జనావాసాలు క్రమబద్ధంగా పెరగనట్లయితే, గృహ నిర్మాణాలు నియమబద్ధంగా జరగనట్లయితే ప్రాథమిక సౌకర్యాలైన రక్షిత నీటి సరఫరా, వీధి దీపాలు, డ్రైయిన్ల నిర్మాణాన్ని సక్రమంగా చేపట్టలేము. ఇందువల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయి. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా ఉండవలసినవి రోడ్లు, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యాలు. గ్రామ పంచాయితీ పరిధిలోని ఏదేని భూమిని లేఅవుట్ ద్వారా ఇండ్ల స్థలాలుగా విడగొట్టి, సదరు ఇండ్లకు అవసరమైన, పైన తెల్పిన కనీస సౌకర్యాలు కల్పించినప్పుడే సదరు స్థలాలు నివాస యోగ్యం కాగలవు.

క్రమ పద్ధతిలో లేఅవుట్లు ఏర్పాటు చేయటంలో సరైన అవగాహన లేనట్లయితే ఈ దిగువ తెల్పిన ఇబ్బందులు తలెత్తుతాయి.

* గ్రామ విస్తరణ అస్తవ్యస్తంగా ఉంటుంది.
* రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు అసౌకర్యాన్ని కలిగిస్తాయి.
* పైపులైన్లు పూర్తిగా క్రమమైన పద్ధతిలో విస్తరింపచేయక పోవటం వల్ల మంచినీటి సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడతాయి.
* విద్యుత్ లైన్లు, దీపాల ఏర్పాటులో అనూహ్య దుష్పరిణామాలు ఏర్పడతాయి.
* లేఅవుట్ కోసం వసూలు చేయవలసిన రుసుములను ఖచ్చితంగా



వసూలు చేయనిచో గ్రామ పంచాయతీ ఆర్థిక పరిస్థితి బలహీన పడుతుంది.

* సక్రమంగా లేని లేఅవుట్ల వల్ల తలెత్తే చట్టపరమైన వివాదాల వల్ల అంతిమంగా గ్రామ పంచాయతీ ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది.

### లేఅవుట్ అంటే ఏమిటి?

లేఅవుట్ అనగా స్థలాల సముదాయాన్ని లేదా ఏదేని వ్యవసాయ భూమిని ఇండ్ల ప్లాట్లుగా విడగొట్టటంతో పాటు రోడ్ల నిర్మాణం, మంచి నీటి సరఫరా, మురుగు నీటి పారుదల సౌకర్యం, వీధి దీపాల ఏర్పాట్లతో పాటు ఫలసాయాన్నిచ్చే వృక్ష సంపద పెంపకం మొదలైన అవస్థాపనా సౌకర్యాలు కల్పించాలి. లే అవుట్ల వల్ల గ్రామ పంచాయితీ పరిధిలో రోడ్లు సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, తద్వారా గ్రామ పంచాయితీకి ఆదాయం, ఆస్తులు కూడా ఏర్పడతాయి. స్థలాన్ని ప్లాట్లుగా విడగొట్టి అమ్మడం ద్వారా స్టాంపు డ్యూటీ నుండి గ్రామ పంచాయితీకి వచ్చే ఆదాయం (వాటా మొత్తం) కూడా పెరుగుతుంది.

అందుకే పంచాయతీరాజ్ చట్టం 1994 నందలి పరిచ్ఛేదం (సెక్షన్) 121 ద్వారా లే అవుట్లు, గృహ నిర్మాణాలకు గ్రామ పంచాయతీ అనుమతిని తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేయబడ్డాయి. పంచాయతీ రాజ్ చట్టం ఏర్పాటు కాకముందు లే అవుట్లు, గృహ నిర్మాణాల అనుమతుల నిమిత్తం అమలులోనున్న జి.ఓ.యం.యస్. నం. 377, పి.ఆర్. ఆర్.డి. తేది: 12.10.1973 ను మార్పు చేస్తూ జి.ఓ.యం.యస్. నెం. 454, పి.ఆర్. ఆర్.డి., ది :31.10.1998 ద్వారా నియమ నిబంధనలను పొందుపరిచారు. మరల లే అవుట్లకు, గృహ నిర్మాణాల అనుమతులకు సంబంధించిన విధి విధానాలకు మరిన్ని సవరణలు చేసి ప్రస్తుతం అమలులో నున్న జి.ఓ.యం.యస్. నెం. 67, ది. 26.2.2002ను జారీ చేశారు. సదరు జి.ఓ. ప్రకారం గృహ నిర్మాణాల నిమిత్తం అమ్మే భూమి లేదా ప్లాట్లను లే అవుట్ చేసిన తరువాత మాత్రమే అమ్మాలి.

### లే అవుట్ నియమాలు

* ఎవరైనా వ్యక్తి గాని, సంస్థగాని, ఏదేని స్థలాన్ని లేఅవుట్ చేయాలంటే లేఅవుట్ ప్లాను, సైటు ప్లాను, భూమి యజమాన్య పత్రాలు, లే అవుట్ కొరకు వ్రాత పూర్వకమైన దరఖాస్తు మొదలైన వాటితో పంచాయతీ కార్యదర్శి వారి ద్వారా టౌన్ ప్లానింగా శాఖకు సమర్పించాలి.
* లేఅవుట్ కొరకు ప్రతిపాదించబడిన భూములు వ్యవసాయ భూములు అయిన ఎడల రిజిష్టర్డ్ క్రయదస్తా వేజు నందు చూపబడిన భూమి విలువలో 10% మొత్తాన్ని రెవెన్యూ శాఖకు చెల్లించి, కన్వర్షన్ ధృవపత్రం (వ్యవసాయ భూమి నుండి ఆవాసయోగ్యమైన భూమిగా మార్పు చేసినట్లు) పొంది. లేఅవుట్ ప్రతిపాదనతో పాటుగా సమర్పించాలి. సదరు ధృవపత్రం లేని లే అవుట్ ప్రతిపాదనలు ఆమోదించబడవు.
* రెవెన్యూ శాఖ వారిచే బలహీన వర్గాల వారికి పట్టాల మంజూరు కొరకు తయారు చేయబడిన లేఅవుట్లు కూడా ఈ నియమాల ననుసరించి మాత్రమే చేయాలి. బలహీన వర్గాల గృహనిర్మాణ పథకం కొరకు ప్రభుత్వం నుండి జారీ చేయబడిన నియమాలను తప్పక అనుసరించాలి.
* లేఅవుట్ చేయటానికి నిర్దేశించబడిన స్థలం తాలూకు ప్లానులో (1:1000 స్కేలు ప్రకారం) స్థలం భౌగోళిక వివరాలు, సరిహద్దులు, చుట్టు ప్రక్కల వేయబడిన లేఅవుట్లు, సదరు స్థలానికి గల అప్రోచ్ రోడ్డు సౌకర్యం మొదలైన వివరాలు పొందుపరిచి, 4 కాపీలను దరఖాస్తుతో పాటుగా జతచేయాలి.
* స్థల లేఅవుట్ ప్లానులో (1:500 స్కేలు ప్రకారం) స్థలం సరిహద్దులు, ఇండ్ల ప్లాట్ల సంఖ్య, ఒక్కొక్క ప్లాటు విస్తీర్ణం, రోడ్ల కొరకు కేటాయించబడిన స్థలం వివరాలు, ఖాళీ స్థలం వివరాలు పొందుపరచి 4 కాపీలను దరఖాస్తుతో పాటుగా జతచేయాలి.
* లేఅవుట్ చేయటానికి నిర్దేశించిన మొత్తం స్థలంలో 10 % స్థలాన్ని (ఉదాహరణకు ఎకరానికి 10 సెంట్లు) ప్రజాప్రయోజనాల నిమిత్తం దాన పట్టా ద్వారా గ్రామ పంచాయతీకి దాఖలు పరచాలి. సదరు స్థలాన్ని గ్రామ పంచాయతీ పార్కులు, పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు, ఇతర సామాజిక ప్రయోజనాలకు ఉపయోగించవచ్చు.



* లేఅవుట్ చేయటానికి నిర్దేశించిన స్థలంలో రోడ్డు వెడల్పు, ప్లాట్ల విస్తీర్ణం ఈ దిగువ తెల్పిన విధంగా ఉండాలి.

1. నివాసయోగ్యమైన ప్రాంతాలలో 10 మీ. లేదా 30 అ. (అంతర్గత రహదారులు)
2. నివాసేతర ప్రాంతాలలో 12 మీ. లేదా 40 అ. (ప్రధాన రహదారులు)
3. వాణిజ్యపరమైన అవసరాలకు ఉపయోగించే ప్లాటు తప్ప, మిగిలిన అన్ని నివాసేతర లే అవుట్లలో ప్లాటు సైజు కనీసం 300 చ.మీ ఉండాలి. వర్తక వాణిజ్యాలకు సంబంధించిన భవన నిర్మాణానికి ఉపయోగించే ప్లాటు సైజు కనీసం 18 చ.మీ ఉండాలి.

లేఅవుటు చేసే స్థలంలో రోడ్ల నిర్మాణం నిమిత్తం విడగొట్టబడిన స్థలాలలో రోడ్ల నిర్మాణం చేసి సదరు రోడ్లను భవిష్యత్తులో అభివృద్ధి చేసే నిమిత్తం దానపట్టా ద్వారా గ్రామ పంచాయతీకి దాఖలు పరచాలి.

* లేఅవుట్ దరఖాస్తుతో పాటు రిజిస్ట్రేషన్ శాఖ నుండి స్థలానికి సంబంధించి పొందిన నాన్ - ఎన్‌కమ్‌బరెన్స్ సర్టిఫికేట్, అసిస్టెంట్

డైరెక్టర్, సర్వే, ల్యాండ్ రికార్డ్సు శాఖ నుండి పొందిన డీమార్కేషన్ సర్టిఫికేట్ మరియు టౌన్ ప్లానింగ్ శాఖకు చెల్లించవలసిన లేఅవుట్ స్క్రూటినీ రుసుము ఎకరానికి రూ.100 లు లేదా అత్యల్పంగా రూ.1000 లు (సుమారు 10 ఎకరాలలోపు స్థలాలకు రూ. 1000 లు మేరకు వసూలు చేయాలి) డిమాండు డ్రాఫ్టును జతపరచి సమర్పించాలి.

* లేఅవుట్ చేయబడిన స్థలం కనుక 60మీ. లోపు వెడల్పు కలిగిన జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నట్లైతే, కనీసం 10 మీ వెడల్పు కలిగిన సర్వీసు రోడ్డును లే అవుట్ కొరకు ఏర్పాటు చేయాలి.
* లేఅవుట్ నిమిత్తం మేజరు గ్రామ పంచాయతీ నందు చ.మీ. కు రూ. 100 లేదా అత్యల్పంగా రూ. 3000/-లు, మైనరు గ్రామ పంచాయతీలో చ.మీకు రూ.0.25లు లేదా అత్యల్పంగా రూ.1000 లు ఏది ఎక్కువైతే అది వసూలు చేసి గ్రామ పంచాయితీ నిధులకు జమచేయాలి.
* సదరు లేఅవుట్ రుసుముతో పాటుగా మేజరు గ్రామ పంచాయతీ నందు చ.మీ. కు రూ.200లు లేదా అత్యల్పంగా రూ.10,000 లు, మైనరు గ్రామ పంచాయతీ నందు చ.మీ కు రూ.100 లేదా అత్యల్పంగా రూ. 5000 లు, ఏది ఎక్కువైతే అది వసూలు చేసి గ్రామ పంచాయతీ నిధులకు జమ చేయాలి.
* లేఅవుట్ చేసే స్థలంలో ఏర్పాటు చేయవలసిన మంచినీటి సరఫరా, వీధి దీపాలు, మురుగునీటి పారుదల సౌకర్యం, రోడ్ల నిర్మాణం వంటి కనీస సౌకర్యాలు దరఖాస్తుదారు లేదా సంస్థ వారు కార్యనిర్వాహక వర్గం పర్యవేక్షణలో ఏర్పాటు చేయాలి. అలా ఏ ర్పాటు చేయని ఎడల సదరు స్థలంలోని భాగాన్ని కానీ, ప్లాట్లనుకానీ, ఉపయోగించటానికి లేదా అమ్మటానికి దరఖాస్తుదారు అర్హుడు కాడు.

పై తెల్పిన 1 నుండి 12 వరకు గల నియమాల ప్రకారం సక్రమంగా సమర్పించబడిన దరఖాస్తులను, గ్రామ పంచాయతీ తీర్మానం ద్వారా టౌన్ ప్లానింగ్ శాఖ వారికి సాంకేతిక ఆమోదం కొరకు, దరఖాస్తు అందిన తేదీ నుండి 10 రోజులలోపుగా సమర్పించాలి. అసంపూర్తిగా అందిన దరఖాస్తులను పరిశీలించి అవసరమైన సమాచారాన్ని దరఖాస్తు దారు నుండి 10 రోజులలో నోటీసు జారీ చేయటం ద్వారా పొందవచ్చు.

య.2.50 ట్లు లేదా హెక్టారు భూమి వరకు జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి వారికి, య.2.50ట్లు పై బడి య. 5.00 ట్లు భూమి వరకు రీజనల్ టౌన్ ప్లానింగ్ అధికారి వారికి, య.5.00ట్లు పై గల లేఅవుట్ దరఖాస్తులను డైరెక్టర్, టౌన్‌ప్లానింగ్, హైదరాబాద్ వారికి క్రమ మార్గం ద్వారా సమర్పించాలి.

లేఅవుట్ దరఖాస్తు అందిన 30 రోజులలోగా (అన్నీ సక్రమంగా ఉన్నట్లయితే) తాత్కాలిక అనుమతిని గ్రామ పంచాయతీ ద్వారా దరఖాస్తుదారుకు తెలియజేయాలి. దరఖాస్తుదారు కార్యనిర్వాహకవర్గం చేసిన సూచనల మేరకు వాటర్ బౌండ్ మాకడమ్ రోడ్లు నిర్మించిన 15 రోజులలోపు పంచాయతీ కార్యదర్శి టౌన్ ప్లానింగ్ వారికి నివేదిక సమర్పించాలి. నివేదిక అందిన 15 రోజులలోగా టౌన్ ప్లానింగ్ శాఖ వారు లేఅవుట్ స్థలాన్ని తనిఖీ చేసి, తాత్కాలిక అనుమతి యివ్వబడిన ప్లానులో చూపబడిన విధంగా లేఅవుట్ ఏర్పాటు చేసి వుంటే, లే అవుట్ అంతిమ అనుమతి కొరకు సాంకేతిక అనుమతిని గ్రామ పంచాయతీకి అందజేయవచ్చు.

టౌన్ ప్లానింగ్ శాఖ నుండి సాంకేతిక అనుమతి పొందిన తేదీ నుండి 15 రోజులలోగా లేఅవుట్ తాలుకు షరతులు, మార్పులు, కనీస సౌకర్యాల అభివృద్ధి కొరకు అవసరమైన అంచనా మొత్తాలను పంచాయతీ కార్యదర్శి దరఖాస్తు దారునకు తెలియజేయాలి.

దరఖాస్తుదారు, పంచాయతీ కార్యదర్శి నుండి నోటీసు అందిన 10 రోజులలోగా తన అంగీకారాన్ని తెలియజేస్తూ ఒక ఒప్పందాన్ని (అనెగ్జరు -ఇ) తయారు చేసి, లేఅవుట్ అభివృద్ధి కొరకు తయారు చేయబడిన అంచనాల మొత్తం నందు 5% లేదా అందుకు సమానమైన సొమ్మును, తిరిగి తీసుకొని (నాన్ రిటర్నబుల్) పద్ధతిపై డిపాజిట్టుగా చెల్లించాలి లేదా దరఖాస్తుదారు సదరు సొమ్ము మొత్తాన్ని బ్యాంకు గ్యారంటీ లేదా తనఖా దస్తావేజు ద్వారా కూడా డిపాజిట్టు చేయవచ్చు.

పై తెల్పిన 16వ అంశంలో చెప్పిన విధంగా దరఖాస్తుదారు నుండి 10 రోజులలోగా ఎటువంటి సమాచారం రాని ఎడల దరఖాస్తు కాల పరిమితి ముగిసినట్లుగా భావించబడుతుంది.

లేఅవుట్ల కోసం చేయబడిన దరఖాస్తులను, దరఖాస్తు అందిన తేదీ నుండి 90 రోజులలోగా అనుమతించడం గానీ, తిరస్కరించడంగానీ చేయాలి. లేనిచో, 90 రోజుల గడువు తరువాత అనుమతి పొందినట్లుగా (డీమ్డ్ టు బి అప్రూవ్డ్) భావించబడుతుంది.

అనుమతి పొందిన లేఅవుట్ కాలపరిమితి 2 సంవత్సరాలు. సదరు కాలపరిమితి లోపుగా లేఅవుట్‌కు సంబంధించిన పనులు మొత్తం పూర్తి చేయాలి. అట్లు పూర్తి చేయని పక్షంలో అప్పటికి అమలులోనున్న నిబంధనలననుసరించి 20% లేదా 10% ఫీజు చెల్లించి దరఖాస్తును పునరుద్దరింపచేసుకోవచ్చును.

లేఅవుట్ కొరకు మంజూరు కాబడిన అనుమతిని, కార్యనిర్వాహక అధికారి లేదా జిల్లా పంచాయతీ అధికారి వారు, సదరు అనుమతి నియమ నిబంధనలకు విరుద్ధంగా మంజూరు కాబడినట్లు భావించిన ఎడల ఏ సమయంలోనైనా ఉపసంహరించుకొనే అవకాశం కలదు.

లేఅవుట్ అనుమతి పొందిన ప్లాను ప్రకారం కాకుండా, మార్పులు చేర్పులతో వేయబడిన ఎడల, సదరు మార్పులు, చేర్పుల ప్రకారం వేయబడిన ప్లానుకు తిరిగి అనుమతి పొందాలి.

లేఅవుట్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్టులకు అదనంగా ప్రభుత్వం లేదా జిల్లా కలెక్టరు వారి అనుమతితో కార్యదర్శి వారు అభివృద్ధి ఛార్జీలు, బెటర్‌మెంట్ ఛార్జీలు కూడా వసూలు చేయవచ్చును.

డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ వారిచే ఆమోదింపబడిన మాస్టర్ ప్లాన్ లేదా ఇండికేటివ్ ల్యాండ్ యూస్ ప్లాన్ పరిధిలోనికి వచ్చే ప్రాంతాలలో వేయబడిన లేఅవుట్లు సదరు అభివృద్ధి ప్లానులో చూపబడిన అంశాలకు లోబడి ఉండాలి.

పై తెల్పిన నియమాలన్నీ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రస్తుతం ఉన్న లే అవుట్లకు కూడా వర్తిస్తాయి. సదరు లేఅవుట్లు అసంపూర్తిగా ఉన్నా, సరైన అనుమతి లేనటువంటి లేఅవుట్లను కలెక్టరు గారిచే



క్రమబద్ధీకరింప చేసుకోవాలి. అందుకు సంబంధించి చెల్లించవలసిన రుసుములన్నియూ, ప్లాటు / ప్లాట్ల యొక్క యజమానులే భరించాలి. సదరు క్రమబద్ధీకరణ కార్యక్రమం ప్రత్యేకంగా కలెక్టరు గారి అనుమతితో చేపట్టబడును.

అనధికార లేఅవుట్ల విషయంలో, జిల్లా పంచాయతీ అధికారి వారు లేదా వారిచే నియమించబడిన అధికారులు కార్యనిర్వాహక వర్గానికి సూచనలు, సలహాలు జారీచేసి అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకొనవచ్చును. అంతేకాకుండా అనధికార లేఅవుట్లను నివారించని వారిపై కూడా చర్యలు తీసుకొనవచ్చును.

**అక్రమ / అనధికార లేఅవుట్ అంటే ఏమిటి?**

గ్రామ పంచాయతీ, టౌన్ ప్లానింగ్ శాఖల నుండి అనుమతి పొందకుండా కొంత భూమిని గానీ, ప్లాటుల సముదాయాన్ని గానీ ఇండ్ల స్థలాలుగా విడగొట్టి, కనీస అవస్థాపనా సౌకర్యాలు కల్పించకుండా వేసే లే అవుట్లను అక్రమ / అనధికార లేఅవుట్లు అంటారు.

ఇటీవలి కాలంలో గ్రామ పంచాయతీ ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోటానికి ప్రభుత్వానికి రావలసిన ఆదాయం సక్రమంగా రాబట్టటానికి లేఅవుట్లపై విజిలెన్స్ అధికారులు నిఘా అధికం చేసి ఉన్నారు. సదరు అధికారుల నిఘా ఫలితంగా బయల్పడిన లేఅవుట్లలో ఎన్నో అక్రమాలు, అవకతవకలు బయటపడ్డాయి. సదరు అక్రమాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలలో గండిపడటమే కాకుండా, గ్రామ పంచాయతీల అభివృద్ధి వనరులు కూడా దారి మళ్ళిపోయాయి.

2007 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి లేని అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోటానికి గాను అవకాశాన్ని కల్పిస్తూ జి.ఓ.యం.యస్.నెం. 902 తేది:31.12.2007 ద్వారా ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారు. పట్టణాలలో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యాల సహకారంతో క్రమమైన అభివృద్ధిని నెలకొల్పటానికి చేస్తున్న ప్రయత్నంలో భాగంగా కనుగొనబడిన అనధికార లేఅవుట్లను కూడా క్రమబద్ధీకరించి తద్వారా కనీస సౌకర్యాలను కల్పించి, పట్టణ / నగర స్థాయి అభివృద్ధిని కల్పించి ప్రజలకు ఉత్తమమైన జీవన స్థాయిని కల్పించటానికి అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ కార్యక్రమాన్ని చేపట్టి, అందుకు అవసరమైన నిబంధనలను పై తెల్పిన జి.ఓ. ద్వారా తెలిపారు. ఈ నిబంధనలను 'ఆంధ్రప్రదేశ్ అనధికార, అక్రమ లేఅవుట్ల క్రమ బద్ధీకరణ నిబంధనలు - 2007' గా వ్యవహరిస్తున్నారు.

ఈ నిబంధనలు పట్టణ అభివృద్ధి సంస్థలు, నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలు, మాస్టర్‌ప్లాన్ పరిధిలో ఉన్న గ్రామ పంచాయితీలకు వర్తిస్తాయి. ఈ నిబంధనలు అమలులోనికి వచ్చే తేదీ కంటే ముందుగా రిజిష్టర్డు క్రయ దస్తావేజుల ద్వారా క్రమ విక్రయాలు జరుపబడిన అన్ని అనధికార లేఅవుట్లకు, వాటి తాలుకు ప్లాట్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. క్రమబద్ధీకరణ కొరకు దరఖాస్తులను సంబంధిత నగర పాలక/మునిసిపాలిటీ/ గ్రామ పంచాయతీ అధికారులకు సమర్పించాలి.

ఈ నియమాలు అర్బన్ ల్యాండ్ సీలింగ్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ 1976, ఎ.పి. ల్యాండ్ రిఫామ్స్ (సీలింగ్ ఆన్ అగ్రికల్చరల్ హోల్డింగ్స్) యాక్ట్ 1973 క్రింద సంబంధిత అధికారుల నుండి క్లియరెన్స్ పొందిన అనధికార లే అవుట్ ప్రాంతాలకు కూడా వర్తిస్తాయి. అసైన్డ్ భూముల విషయంలో మాత్రం జిల్లా కలెక్టరు వద్ద నుండి ముందస్తు క్లియరెన్స్ పొందాలి.

అనధికారికంగా లేఅవుట్ చేయబడిన ప్రాంతం తాలూకు కొంత మంది ప్లాట్ల యాజమానులు మాత్రమే క్రమబద్ధీకరణకు ముందుకు వచ్చినప్పటికినీ, సదరు క్రమబద్ధీకరణకు సంబంధిత అధికారులు అనుమతినిచ్చిన లే అవుట్ నమూనా నియామాలకు లోబడి మాత్రమే క్రమబద్ధీకరించబడును.

నదులు, సెలయేర్లు, కాలువలు, చెరువులు, సరస్సులు, కుంటలు, శికం భూములకు సంబంధించిన గట్లపై లేఅవుట్, అందుకు సంబంధించిన అభివృద్ధి పనులు చేయరాదు. సదరు ప్రదేశాలలో మనోరంజకమైన పచ్చిక బయళ్ళను మాత్రమే నిర్వహించాలి. ఇట్టి అభివృద్ధి పనులు భారత జాతీయ భవనాల కోడ్ - 2005లో అంశాలకు లోబడి యుండాలి. మాస్టర్ ప్లాన్ / జోనల్ అభివృద్ధి ప్లాన్‌లో చూపి ఉన్నట్లయితే పచ్చిక బయళ్ళతో పాటు 12 మీ. వెడల్పు గల రింగురోడ్డు లేదా విహార స్థలాన్ని నదీ తీరానికి 30మీ. దూరంలో అభివృద్ధి చేయవచ్చు.

ఎయిర్‌పోర్టు, మిలటరీ, ఓ.ఎన్.జి.సి. శాఖలకు సంబంధించిన సమీప ప్రాంతంలో గల లేఅవుట్లకు సదరు అధికారుల నుండి క్లియరెన్స్ పొందాలి. జి.ఓ.యం.యస్.నెం. 111, యం.ఏ/ యు.డి. డిపార్ట్‌మెంట్, తేది : 08.03.1996 క్రిందకు తీసుకు రాబడిన ప్రాంతాలకు కూడా హుడా / హడా మాస్టర్ ప్లాన్‌లో చెప్పబడిన నింబంధనలతో పాటుగా ఈ నిబంధనలు కూడా వర్తిస్తాయి.

ప్రత్యేక ప్రయోజనాల కొరకు కేటాయించబడిన ప్రాంతాలలో అనధికారికంగా వేయబడిన లేఅవుట్లను క్రమబద్ధీకరించరాదు. అనుమతి పొంది వేయబడిన లేఅవుట్ల నందు ఖాళీ స్థలాలు (10%) గా గుర్తించబడిన స్థలాలకు కూడా ఈ నియమాలు వర్తించవు.

అనధికార లేఅవుటు, వాటి తాలుకు ప్లాట్ల యజమానులు క్రమబద్ధీకరణ కొరకు సంబంధిత అధికారులకు ఈ దిగువ తెల్పిన డాక్యుమెంట్లతో దరఖాస్తు చేయటం తప్పనిసరి.

1. గెజిటెడ్ అధికారిచే ధృవీకరించబడిన రిజిష్టర్డు దస్తావేజు నకలు. (ఈ నోటిఫికేషన్ వెలువడుటకు ముందు గల తేదీలలో రిజిష్టరు కాబడి ఉండాలి)

2. స్థలం ప్లాను.
3. ప్లాట్ల విస్తీర్ణం, ఓపెన్ స్థలం, రోడ్ల విస్తీర్ణం మొదలైన వివరాలతో సవివరమైన మరొక ప్లాను.
4. లే అవుట్ స్థలం సీలింగ్ లిమిట్ దాటిన ఎడల అర్బన్ ల్యాండ్ సీలింగ్ క్లియరెన్స్ సర్టిఫికెట్.
5. లే అవుట్ స్థలం సీలింగా లిమిట్ లోపు ఉన్నట్లయితే ఒక అఫిడవిట్.
6. జి.ఓ.యం.యస్. నెం. 111 మరియు 456 (రెవెన్యూ) తేదీ: 29.07.2002 క్రింద ప్రభుత్వంచే జారీ చేయబడిన యు.ఎల్.సి. క్రమబద్దీకరణ ఉత్తర్వులు.
7. ఇండెమ్నిటీ బాండు (సదరు జి.ఓ.లో తెల్పిన ప్రకారంగా రూ.10/-లు విలువ కలిగిన స్టాంపు పేపరు పై తయారు చేయించాలి)
8. రక్షణ అధికారుల నుండి ఎన్.ఓ.సి. ధృవపత్రం. (ఎయిర్ పోర్టు, మిలటరీ వారికి సమీపంలో గల ప్రాంతాల నిమిత్తం).

**అపరాధ రుసుముల చెల్లింపు**

క్రమబద్దీకరణ కొరకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారు బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్, లేఅవుట్ పరిశీలన, అపరాధ, ఇతర ఛార్జీలతో కూడిన ప్రో-రాటా ఛార్జీలను చెల్లించాలి. సదరు ఛార్జీలను 4 భాగాలుగా విభజించి ప్రాంతాల వారీ గా చ.మీ.ల చొప్పున చెల్లించాలి. అయితే అపరాధ రుసుము చెల్లింపులో సదరు రుసుము గణన విషయమై జి.ఓ.యంయస్.నెం. 113, తేది : 31.01.08 ద్వారా సవరణలు చేశారు. సదరు సవరణల ప్రకారం ప్రాథమిక అపరాధ రుసుము ఈ దిగువ తెల్పిన విధంగా లెక్క గట్టాలి.

| | |
|---|---|
| **100 చ॥మీ॥ లోపు గల ప్లాటుకు** | **- చ॥మీ॥ రూ. 200/- లు** |
| **101 నుండి 300 లోపు గల ప్లాటుకు** | **- చ॥మీ॥ రూ. 300/- లు** |
| **301 నుండి 500 లోపు గల ప్లాటుకు** | **- చ॥మీ॥ రూ. 400/- లు** |
| **500 చ॥మీ॥ పైబడిన ప్లాటుకు** | **- చ॥మీ॥ రూ. 500/- లు** |

తేది : 01.01.2008 నాటికి అమలులో నున్న భూమి విలువ ఆధారంగా లెక్క గట్టబడిన ప్రాథమిక అపరాధ రుసుము విలువలో పర్సంటేజి రూపంలో వాస్తవమైన అపరాధ రుసుము ఉంటుంది. వాస్తవమైన అపరాధ రుసుమును లెక్కించడానికి సబ్ రిజిస్ట్రారుచే చేయబడిన మార్కెట్టు విలువ సర్టిఫికెట్ కూడా దరఖాస్తుకు జతపరచాలి.



*చ॥మీ॥ కు మార్కెట్టు విలువ*

| | |
|---|---|
| *రూ. 25000 పైన అయితే* | *- ప్రాథమిక అపరాధ రుసుం పై 100%* |
| *రూ. 20001 నుండి 25000 వరకు* | *- ప్రాథమిక అపరాధ రుసుంపై 90%* |
| *రూ. 15001 నుండి 20000 వరకు* | *- ప్రాథమిక అపరాధ రుసుం పై 80%* |
| *రూ. 10001 నుండి 15000 వరకు* | *- ప్రాథమిక అపరాధ రుసుం పై 70%* |
| *రూ. 8001 నుండి 10000 వరకు* | *- ప్రాథమిక అపరాధ రుసుం పై 60%* |
| *రూ. 5001 నుండి 8000 వరకు* | *- ప్రాథమిక అపరాధ రుసుం పై 50%* |
| *రూ. 3001 నుండి 5000 వరకు* | *- ప్రాథమిక అపరాధ రుసుం పై 45%* |
| *రూ. 2001 నుండి 3000 వరకు* | *- ప్రాథమిక అపరాధ రుసుం పై 40%* |
| *రూ. 1001 నుండి 2000 వరకు* | *- ప్రాథమిక అపరాధ రుసుం పై 35%* |
| *రూ. 501 నుండి 1000 వరకు* | *- ప్రాథమిక అపరాధ రుసుం పై 30%* |
| *రూ. 500 వరకు* | *- ప్రాథమిక అపరాధ రుసుం పై 25%* |

*ఉదా :*

ఒక ప్లాటు విస్తీర్ణం X 200 చ॥మీ॥
ప్రాథమిక అపరాధ రుసుము X రూ. 300లు చ॥మీ॥
(పట్టిక-1 ప్రకారం) X 200 = 300 X 60,000 లు
చెల్లించవలసిన వాస్తవమైన X
భూమి యొక్క మార్కెట్టు విలువ చ॥మీ॥కు రూ. 1000/-
అపరాధ రుసుము అయితే 60000/- = 30% X రూ. 18,000/-లు

సదరు అపరాధ రుసుము మొత్తంగా గాని లేదా 50% గాని దరఖాస్తుతో పాటు చెల్లించాలి. మిగిలిన 50% 6 నెలల లోపుగా చెల్లించవచ్చును.

లే అవుట్‌లో గ్రామ పంచాయితీకి ఇవ్వబడిన 10% ఖాళీ స్థలాన్ని ప్లాట్లను తిరిగి సర్దుబాటు చేయటం ద్వారా ఇవ్వవచ్చును. అట్లు వీలుకాని పక్షంలో సదరు స్థలం నిమిత్తం విరాళం రూపంలో ఛార్జీలను వసూలు చేయాలి. అనధికార లేఅవుట్‌లో భవన నిర్మాణాలు జరిగి ఉన్నట్లయితే ఓపెన్ స్పేస్ నిమిత్తం రిజిస్ట్రేషన్ తేదీ నాటికి అమలులో నున్న భూమి విలువ ఆధారంగా ఛార్జీలను వసూలు చేయాలి.

ఖాళీ స్థలాలు మాత్రమే ఉన్నట్లయితే ఓపెన్ స్పేస్ నిమిత్తం ఛార్జీలను తేది : 1.1.2008 నాటికి అమలులో నున్న భూమి విలువ ఆధారంగా వసూలు చేయవచ్చును. లేదా భవన నిర్మాణ అనుమతి కొరకు ధరఖాస్తు చేసినప్పుడు అప్పటికి అమలులో నున్న భూమి విలువ ఆధారంగా దరఖాస్తుతో సహా వసూలు చేయవచ్చును. ఈ విషయంలో నిర్ణయాధికారం దరఖాస్తుదారునిదే.

అయితే ఓపెన్ స్పేస్ నిమిత్తం చెల్లించవలసిన రుసుము విషయమై తిరిగి సవరణ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం. 301 తేది :11.04.2008 నందు, అక్రమ లేఅవుట్ నందలి ప్లాట్లలో భవన నిర్మాణం జరిగినా లేక ఖాళీగా ఉన్న, ఓపెన్ స్పేస్ ఛార్జీలు, సదరు ప్లాటు రిజిస్ట్రేషన్ నాటికి అమలులో నున్న భూమి విలువ ఆధారంగా వసూలు చేయవలసిందిగా ఉత్తర్వులు జారీ చేశారు.

### క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలన




క్రమ బద్ధీకరణ కొరకు నిర్ణీత నమూనాలో అందిన దరఖాస్తులను నియమ నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి, సరైనదిగా భావించిన ఎడల, దరఖాస్తు అందిన తేది నుండి 6 నెలల లోపుగా సంబంధిత అధికారులు అనుమతినివ్వాలి.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోనికిరాని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీల పరిధిలో గల అక్రమ లే అవుట్ల తాలూకు దరఖాస్తుల ను పరిశీలించిన మీదట, స్థలాన్ని తనిఖీ చేసిన మీదట, సదరు దరఖాస్తును సాంకేతిక మంజూరు కొరకు టౌన్ ప్లానింగ్ వారికి సమర్పించాలి. సాంకేతిక మంజూరు పొందిన తర్వాత దరఖాస్తు దారునికి 6 నెలలోపుగా (దరఖాస్తు తేది నుండి) అనుమతినివ్వాలి. భూమి ఉపయోగం లేదా మాస్టర్ ప్లాను నందలి రోడ్లు మార్పు చెందినప్పటికీ, ప్లాటు స్వరూపం మార్పు చెందని ప్లాట్లకు సంబంధిత అధికారులు అనుమతి మంజూరు చేయవచ్చు.

దరఖాస్తులు అసమగ్రంగా ఉన్న ఎడల వాటిని త్రిప్పివేయటం కూడా 6 నెలలలోపుగానే జరగాలి. దరఖాస్తుల పరిశీలనలో సాంకేతిక అనుభవం గల వ్యక్తుల సేవలను వినియోగించుకోవచ్చును.

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించేటప్పుడు రోడ్డు వెడల్పు కనీసం 9 మీ. అదే బలహీన వర్గాల తాలూకు లే అవుట్ అయితే రోడ్ల వెడల్పు కనీసం 6 మీ. ప్లాటు విస్తీర్ణం 100 చ.మీ కు తక్కువ కాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి. అక్రమ లే అవుట్ స్థలంలో ఏవైనా నీటి వనరులున్నట్లయితే, వాటిని సంరక్షించాలి. సదరు నీటి వనరుల ను ఓపెన్ స్పేస్‌లో భాగంగా భావించి నిర్వహించాలి.

సాధారణ లే అవుట్‌లో ఏవైతే కనీస సౌకర్యాలు కల్పించటం జరుగుతుందో, అవే సౌకర్యాలు అక్రమ లే అవుట్లలో కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

ఈ నియమ నిబంధనల క్రింద లే అవుట్లను లేదా అందలి ప్లాట్లను క్రమబద్ధీకరించుకొనుటకు ముందుకురాని వారికి భవిష్యత్తులో మంచి నీటి సరఫరా, డ్రైనేజి సౌకర్యం కల్పించకపోవటం, సదరు ప్లాట్ల అమ్మకం కొనుగోలు నిలుపుదల, సదరు ప్లాట్లలో భవన నిర్మాణం కొరకు అనుమతి మంజూరు చేయకపోవడం వంటి చర్యలతో ప్లాట్లు, సదరు ప్లాట్ల యాజమానుల నుండి అపరాధ రుసుం కూడా వసూలు చేయటానికి ఉత్తర్వులు జారీ చేశారు.

లే అవుట్ల, ప్లాటు క్రమబద్ధీకరణ నిమిత్తం వసూలు చేసిన మొత్తాల ను విడిగా ఒక పద్దు క్రింద ఉంచి, సదరు ప్రాంతాల అభివృద్ధికి మాత్రమే ఈ మొత్తాలను ఉపయోగించాలి.

### ముగింపు

అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ తేది : 31.12.2007 నుండి మొదలు పెట్టబడినప్పటికీ, దరఖాస్తు కొరకు మొదటి 60 రోజుల ంగా విధించిన గడువును తేది : 31.03.2010 వరకు పెంచుతున్నట్లు ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ శాఖా మంత్రివర్యులు తెలియజేశారు.

కావున ఇప్పటికైనా మన గ్రామాలలో ఉన్న అక్రమ లే అవుట్లపై యుద్ధభేరిని మ్రోగించి, తద్వారా గ్రామాభివృద్ధిని సాధించాలి. ఈ విషయంలో గ్రామ పంచాయితీలతో పాటు ప్రజా ప్రతినిధుల నుండి మొదలుకొని వివిధ శాఖల అధికారుల సమిష్టి కృషి ఎంతైనా అవసరం.

ప్రస్తుతం సదరు గడవును 30.6.2010 వరకు పొడిగించారు.

*- జి. సత్యవాణి, ఫ్యాకల్టీ*
*ఇ.టి.సి. రాజేంద్రనగర్*

#### సవరణ

*డిసెంబరు 09 నెలలో విడుదల కాబడిన "స్థానిక పాలన " గ్రామీణ వికాస మాస పత్రిక నందలి పేజి నెం. 22 లో ప్రచురించబడిన ప్రైవేటు మరుగుదొడ్లు అనే అంశాన్ని ఈ దిగువ తెలిపిన విధంగా సవరించి చదువుకొనగలరు.*

*"సెక్షన్ 84 నందు గ్రామ పంచాయితీ కార్యనిర్వహణాధికారి ఏదేని ప్రైవేటు వ్యక్తుల తాలూకు ఇండ్ల పరిసరాలలో గల వ్యర్థ పదార్థాలను లేక మరేదైనా చెత్తను తొలగించుటకు, ప్రైవేటు వ్యక్తులతో కాంట్రాక్టు ఏర్పరచుకొనవచ్చును. అందుకు సంబంధించి చెత్త తొలగింపు సమయములు వగైరా, కార్యనిర్వహణాధికారి ఆదేశించు నియమనిబంధనలకు లోబడి, గ్రామ పంచాయతీ నిర్ణయించిన రుసుము ప్రైవేటు వ్యక్తులు గ్రామ పంచాయితీకి చెల్లించిన మీదట, సదరు ఆసామీ ఇంటి పరిసరాలలోని చెత్తా చెదారాలను గ్రామ పంచాయితీ వారు తొలగించవచ్చును".*




# పచ్చి బాలెంతరాలు మా భరతమాత

దేశం ఒక త్యాగాల చెట్టు, కొన్ని సమూహాల్ని ఇదీ అని తెలియని బంధంతో పెనవేసి, ఒకటిగా ఉంచే అద్భుతమయిన అంతస్సూత్రం. 'దేశమును ప్రేమించుమన్నా! మంచి యన్నది పెంచుమన్నా!!' అన్నారు మహాకవి గురజాడ. ఈ వాక్యం అంతర్జాతీయ మయిన అన్వయం కలది. ఏ దేశం వాడయినా ఈ మాట అనుకోవచ్చు. తన దేశం కీర్తిని ఉప్పొంగిన గుండెలతో సంకీర్తన చేయవచ్చు.

ఉవ్వెత్తున ఎగసిన చైతన్యంతో భారత స్వాతంత్ర్యోద్యమ పోరాటం సాగింది. అందులో తెలుగువాళ్ళు, కలం, గళమూ కదిపారు. సహస్రకోటి భాను కిరణాలై ప్రకాశించారు. నిండైన దేశభక్తి అందించిన కొత్త ఊపిరిలో తెలుగు కవులు ఉద్యమ శంఖాన్ని పూరించారు. సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకొని స్వాతంత్ర్య ఫలాన్ని అందుకోవడం కోసం ఉవ్విళ్ళూరారు. ఇది సమాజం సంఘటితం కావడానికి ఒక సందర్భం. ఎన్నో భిన్నత్వాలు సమాజంలో ఉండవచ్చు. వ్యక్తుల మధ్యా ఉండవచ్చు. కానీ సమస్య ఉద్భవించినపుడు అందరూ ఒకే సూత్రంపై నిలవాలి. ముక్త కంఠంతో ఒకే నినాదం చేయాలి. ఇదే మన స్వాతంత్ర్య వారసత్వం మనకి అందించిన సందేశం.

దేశ సేవ కన్న దేవతార్చన లేదు
స్వార్థపరత కన్న చావులేదు
సానుభూతి కన్న స్వర్గమ్ము లేదు
లలిత సుగుణజాల తెలుగు బాల

ప్రతి ఒక్కరూ దేశవైభవాన్ని గుర్తించాలి. ఆ వైభవం ఎప్పటికప్పుడు కనుమరుగై పోకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సత్వరం తీసుకోవాలి. రాయప్రోలు వారన్నట్లు 'నాదు జాతి నాదు దేశము నాదుభాష అను అహంకార ప్రదర్శనమునందు' నిమగ్నులై ఉండాలి. అంతే కాదు నేను భారతీయుడనని చెప్పుకోవడానికి ఎంతమాత్రమూ వెనుకాడకూడదు.

అవమాన మేలరా అనుమానమేలరా
భారతీయుడనంచు భక్తితో పాడ
లేరురా మనవంటి పౌరులింకెందు
ఏ పూర్వ పుణ్యమో ఏ యోగబలమొ
జనియించి నాడవీ స్వర్గఖండమున

ఇదీ మన భావన. ఇంతటి భావం ఉంటే దేశం కోసం ఏమయినా చెయ్యాలనిపిస్తుంది. ఎన్ని అవమానాలయినా, బాధలయినా కష్టసందోహాలయినా అవన్నీ దేశం అందించే స్ఫూర్తి ముందు దిగదుడుపే.

దేశం కోసం తమ సర్వస్వాన్నీ త్యాగం చేసిన త్యాగధనులయిన మన అమర నేతలకు ఏ కష్టాలూ లెక్కలోనికి రాలేదు. సరిగదా చెరశాలలే వారికి పెద్దపెద్ద చంద్రశాలలుగా తోచాయి. చేతులకు పడిన సంకెళ్ళే పూలదండలుగా విరిశాయి. చెరశాలలలో పెట్టే చోడంబళ్ళే పరమాన్నంలా రుచించింది. అక్కడ కప్పుకొనే మోటు కంబళ్ళే పట్టు సెల్లాల్లా మెత్తగా అనిపించాయి. ఎప్పుడైతే స్థిరంగా దేశభక్తి ఉప్పొంగుతుందో అప్పుడు ఇలాగే ఉంటుంది.

సిరులు పొంగెడి జీవగడ్డయి
పాలు కారెడి భాగ్యసీమయి
వరలినది ఈ భరత ఖండము
భక్తి పాడర తమ్ముడా!!
దేశ గర్వము దీప్తి చెందగ
దేశ చరితము తేజరిల్లగ
దేశమరిసిన ధీరపురుషుల
తెలిసిపాడర తమ్ముడా

అని దేశ ఔన్నత్యాన్ని గానం చేయాలని మనవారు ఉద్బోధించారు. తెలుగునేల, తెలుగుదేశం, తెలుగుకత్తి, తెలుగుశిలలు, కోటలు, పట్టణాలు, బురుజులు, ఆచార్యులు, విశ్వవిద్యాలయులు దేశ వైభవానికి చిహ్నాలు. మహర్షులు, మతప్రవక్తలు, స్వాతంత్ర్య సమరయోధులు మన దేశ శక్తికి తార్కాణాలు. ఒక వైపు ఎందరో ఘనులయిన చక్రవర్తుల సద్ధర్మపాలన, కర్మసిద్ధాంతాన్ని ప్రబోధించిన గీతాచార్యుల దివ్యభోధన, అహింసయే పరమమయిన ధర్మమని చాటి చెప్పిన బుద్ధ భగవానుడి కారుణ్యహృదయం, భారతీయ కీర్తిని ఇనుమడింపచేశాయి.

మన భరతమాత మాతలకు మాత. సత్యం ధర్మం శౌచం వంటి ఎన్నో సంపదలకు నిలయమైనది. ఎందరో దివ్య పురుషులను, వీరులను విజ్ఞానవేత్తలును, విశ్వశాంతి దూతలను ప్రసవించిన, ప్రసవిస్తూ ఉన్న పచ్చి బాలెంతరాలు. అందుకే 'న మాతుః పరదైవతం' అనీ 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనీ ఆర్షవాణి ప్రభోధిస్తోంది.

జన్మనిచ్చిన నేల నాదేనన్న భావం రాగానే శరీరం మొత్తం దేశభక్తితో పులకరించి పోవాలి. అదే భారతీయుడిగా ప్రతి వ్యక్తికీ తొలి అర్హత, కర్తవ్యం కూడా.

ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము

**- డా॥ అద్దంకి శ్రీనివాస్**





**1958** నవంబర్ 1 న ప్రారంభమైన పంచాయితీ రాజ్ వ్యవస్థకు ఆంధ్రప్రదేశ్‌లో 50 ఏళ్ళు నిండాయి. భౌగోళిక చారిత్రక నేపథ్యంలో చూస్తూ యాభై ఏళ్ళు చాలా చిన్నగా కనిపించినా, ఒక పాలనా వ్యవస్థ వేళ్ళూనుకోవటానికి, స్థిర పడటానికి ఇది చాలా ఎక్కువే అని చెప్పాలి. ప్రజలను కేంద్రబిందువుగా పాలనా వ్యవస్థలను రూపొందించాలనీ, అభివృద్ధి ప్రక్రియలో, ప్రణాళికా రచనలో ప్రజలను భాగస్వాములను చేయాలని, నాయకత్వాన్ని క్రింద నుండి బలోపేతం చేయాలని తలపోసిన రాజ్యాంగ నిర్మాతల, రూపకర్తల ఆశలు కార్యరూపం దాల్చటానికి ఇంకా సమయం అవసరమయ్యేలా ఉంది. పంచాయితీ రాజ్ సంస్థలలో నాయకత్వం బలోపేతం కాలేకపోటానికి కారణాల్ని సమీక్షించుకోవలసిన సమయం ఆసన్నమైంది.

పాలనా యంత్రాంగంలో భాగంగా ప్రజాప్రతినిధులుండాలంటే అందుకు తగ్గ నిర్మాణం ఉండాలని, స్థానిక సంస్థలు తమ పరిపాలనా వ్యవహారాలు, ప్రణాళికలు రూపొందించి, నిర్వహించాలని నిర్దేశించటం జరిగింది. తర్వాత పంచాయితీరాజ్ సంస్థలు ఏర్పడ్డాయి. పంచాయితీరాజ్ సంస్థలు ఏర్పడ్డ తొలినాళ్లలో సమర్థవంతంగా పని చేసినప్పటికీ, తరువాత కాలంలో ప్రాభవాన్ని కోల్పోయాయి. మితిమీరిన రాజకీయ జోక్యం, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పంచాయితీ సమితి అధ్యక్షుల మధ్య భేదాభిప్రాయాలు మొదలైనవి పంచాయితీ రాజ్ సంస్థల్ని బలహీన పరిచాయి. ఈ సంస్థలకు రాజ్యాంగ బద్ధత లేకపోవటం ప్రధాన అవరోధంగా గుర్తించటం జరిగింది. పంచాయితీ రాజ్ సంస్థల్ని బలోపేతం చేయాలన్న రాజ్యాంగ సూత్రాల కనుగుణంగా 73వ రాజ్యాంగ సవరణ రూపొందించారు.

అర్ధశతాబ్ది ఉత్సవాల్లో పంచాయితీ రాజ్ సంస్థలు

# పంచాయితీల నాయకత్వం మరింత బలోపేతం కావాలి

### పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులు

భారతదేశం సంక్షేమ రాజ్యం. ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, లక్ష్యంగా రూపొందించిన అభివృద్ధి కార్యక్రమాల అమలు ప్రజా బాహుళ్యానికి ఏ మేరకు అందుతున్నాయో అధ్యయనం చేయటానికి బల్వంతరాయ్ మెహతా కమిటీ ఏర్పాటయింది. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అంటే, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, అమలు, నిర్ణయాలలో కూడా ప్రజల భాగస్వామ్యం ఉండాలని ఈ కమిటీ సూచించింది. ఎన్నో పథకాలు ప్రజలకు తెలియకపోవటం, పథకాలకు ప్రజల మద్దతు లేదన్నది గుర్తించటం జరిగింది. పథకాల రూపకల్పన ప్రజల అవసరాలకు, అభీష్టాలకు అనుగుణంగా లేదన్నది గుర్తించటం జరిగింది. ఈ లోపాలు సవరించాలంటే, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అమలు యంత్రాంగంతో పాటు ప్రజా ప్రాతినిధ్యం కూడా అవసరమని భావించటం జరిగింది.

73వ రాజ్యాంగ సవరణను అనుసరించి గ్రామసభకు ప్రాధాన్యత ఇవ్వబడింది. గ్రామ స్థాయిలో బలపడిన నిర్ణయాలు, తీర్మానాల రూపంలో పంచాయితీ ఆమోదానికి, తర్వాత మండల, జిల్లా స్థాయి ప్రణాళికల రూపకల్పనకు దోహదం చేయాలని స్పష్టం చేయబడింది. అయితే బలమైన నాయకత్వం లేమి అనేది 73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి, వికేంద్రీకృత అధికారాల బదలాయింపునకు, క్షేత్ర స్థాయిలోని సమస్యలను బలంగా వినిపించగలిగి, పరిష్కార మార్గాల్ని అన్వేషించడానికి అవరోధంగా నిలుస్తున్నాయి.

## నాయకత్వం ఎలా వస్తుంది?

ఒక ప్రత్యేక సందర్భంలో మాత్రమే నాయకులు ఉద్భవిస్తారనే వాదన ఒక వైపు, కాదు నాయకులు స్వయంభువులు అనే వాదన మరోవైపు ఉన్నాయి. ఇరవయ్యవ శతాబ్దపు తొలినాళ్ళలో గాంధీజీ కానీ, డా॥ బి.ఆర్ అంబేద్కర్ కానీ ఆయా సమస్యలు, సంధి, సందర్భాలుగానే తెర మీదకు వచ్చారు. దక్షిణాఫ్రికాలో భారతీయుల పట్ల చూపే వివక్షతను స్వయంగా అనుభవించి, ఉద్యమించి గాంధీజీ నాయకునిగా ఎదిగితే, భారతీయ సమాజపు అసమానతల్ని, వివక్షతను స్వయంగా అనుభవించి, ఎదిరించి డా॥ బి.ఆర్ అంబేద్కర్ నాయకునిగా ఎదిగారు.

పంచాయితీ రాజ్ సంస్థల విషయంలో జాతీయ స్థాయిలో ఈ సంస్థల సమస్యలను నినదించటం, ప్రభుత్వంతో చర్చించి విధులు, నిధులు, సిబ్బంది మొదలైన అంశాల పట్ల పూర్తి స్థాయి పరిష్కారాల్ని సాధించటానికి తగినంత స్థాయిలో కృషి చేయాల్సి ఉంది. అయితే అన్నింటి కంటే ముఖ్యంగా పంచాయితీ రాజ్ సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా రూపొందించటంలోనూ, ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని, నమ్మకాన్ని కల్గించటంలోనూ పంచాయితీ రాజ్ నాయకులు క్రింది సమస్యల్ని ఎదుర్కొంటున్నారు.

### 1) నిరక్షరాస్యత

రాజ్యాంగం ప్రతిపాదించిన నియమం ప్రకారం నిర్ణీత వయస్సు గల వారు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయటానికి అర్హులు, కానీ వారిలో ఎక్కువ శాతం నిరక్షరాస్యులు. మరీ ముఖ్యంగా ఈ సంస్థలు గ్రామీణ ప్రజానీకానికి సంబంధించినవే కనుక, మన గ్రామీణ ప్రజలు అధిక శాతం నిరక్షరాస్యులే కనుక, నిరక్షరాస్యులు, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు నిరక్షరాస్యత నుంచి బయట పడలేరు కనుక, ప్రతి నిధులుగా ఎన్నిక కాబడిన వారిలో నిరక్ష రాస్యులుగా ఉంటే, వారు ప్రజల స్థానిక అవసరాలకనుగుణమైన ప్రణాళికా రచనను ఆశించిన స్థాయిలో రూపొందించలేరు. ప్రభుత్వాధికారులను సంప్రదించటం, సహకరించటం వంటి సందర్భాలలో వారు ముందు నిలబడలేక పోవచ్చు.

ప్రజలలో అక్షరాస్యతా శాతం పెంచటం, బడిలో హాజరు శాతం పెంచటం, కనీసపు విద్యార్హత ఉన్న వారినే తమ ప్రతినిధులుగా ఎన్నుకొనేలా ప్రజల్ని చైతన్య పరచటం తక్షణం చేపట్టాల్సిన చర్యలు.



### 2) ప్రాబల్య వర్గాల పెత్తనం

భారతీయ సమాజం భూస్వామ్య, కుల పెత్తందార్ల అజమాయిషీలో ఉంటుందని డా॥ బి.ఆర్. అంబేద్కర్ చెప్పారు. కులాలుగా విడి పడిఉన్న సమాజంలో ప్రాబల్య వర్గాలు ఆధిపత్యం చెలాయించటం సహజం, రాజ్యాంగపరమైన వెసులుబాటు వల్ల యస్.సి,యస్.టి, వెనుకబడిన వర్గాలు, మహిళలు ఎన్నుకోబడినప్పటికీ, పరిపాలనా నిర్వహణలో అనుభవలేమివల్ల, సామాజిక దుర్భలత్వం వల్ల అవసరమైన సందర్భాలలో వారు నిర్ణయాత్మకంగా వ్యవహరించలేరు.



అందువల్ల పరిపాలనలో ప్రాబల్య వర్గాల పెత్తనం పెరుగుతుంది. ఇటువంటి సందర్భాలలో సరైన నాయకత్వం ఈ సంస్థలలో ఏర్పడలేదు కాబట్టి, ప్రజలను చైతన్య పరచటం, హక్కులను తెలియజేయటం ద్వారా ప్రజలందరూ ఒక్కటేనన్న సత్యాన్ని ఈ రెండు వర్గాలలో విస్తృతంగా ప్రచారం చేయాలి. తద్వారా సమాజంలో నూతన నాయకత్వానికి నాంది పలకాలి.

### 3) అవినీతి

అవినీతి అంతటా విస్తరించిందనీ, రాజకీయాలలో అవినీతి ఎక్కువనీ, పంచాయితీరాజ్ సంస్థలలో అవినీతి మరీ ఎక్కువనీ విమరి ్శస్తారు. కానీ అవినీతిని నిర్మూలించాలంటే ఎవరికి వారు ఆత్మపరిశీలన చేసుకోవాలి. సమాజంలోని నిర్లక్ష్యవర్గాల కోసం ఏర్పాటు చేయబడ్డ పథకాలు, నిస్సహాయులకై రూపొందించిన కార్యక్రమాలు వారికి అందజేయటంలో పంచాయితీ రాజ్ ప్రజా ప్రతినిధులు ముందుండాలి. సమాచార హక్కు చట్టం ( RTI ) ద్వారా లభించిన అధికారాల్ని వినియోగించుకోవటంలో ఈ ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి.

గ్రామస్థాయిలో, మండలస్థాయిలో, జిల్లా స్థాయిలో ప్రజల సంక్షేమం, ఆరోగ్యం, అభివృద్ధికై పనిచేస్తున్న వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, శాఖల పనితీరు, వారికి అందే నిధులు, వెచ్చించిన విధానం మొదలైన

సమాచారం పొందటంలోను, గ్రామ సభల్లో వివిధ కార్యక్రమాల్లో చర్చించటం ద్వారాను, ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత యివ్వాలి. ప్రజాభిమానాన్ని పొందగలగాలి. ప్రణాళికల రూపకల్పనకు మార్గ నిర్దేశం చేయాలి.

### 4. జిల్లా ప్రణాళికా కమిటీలు

జిల్లా ప్రణాళికా చట్టం 2005 నుండి అమలులో ఉన్నప్పటికీ, జిల్లా ప్రణాళికా కమిటీలు ఏర్పడ్డప్పటికీ గ్రామ పంచాయితీలు, మండల పంచాయితీలు జిల్లా ప్రణాళికలను రూపొందించలేక పోవటం వెనుక నాయకత్వం బలంగా లేకపోవటంగానే భావించాలి. ఇప్పటి వరకూ రూపొందించిన ప్రణాళికలు పూర్తి స్థాయిలో రాజ్యాంగ స్ఫూర్తిని పరిపుష్టం చేయలేవు.

11వ షెడ్యూలులో చెప్పిన 29 అంశాలు, శాఖల బదలాయింపు ప్రక్రియ వేగవంతంగా జరగకపోవడం కూడా జిల్లా ప్రణాళికల రూప కల్పనకు అవరోధంగా పరిణమించిందని చెప్పవచ్చును. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగస్ఫూర్తికి అనుగుణంగా ఈ 29 అంశాలను పంచాయితీ రాజ్ సంస్థలకు బదలాయించాల్సి ఉంది.

### 5. నిధుల బదలాయింపు

3వ రాష్ట్ర ఆర్థిక సంఘం వారి వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, 1997-98 లో మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో 23.9% విడుదల చేశారు. 2004-2005 నాటికి రాష్ట్ర బడ్జెట్ నుండి కేవలం 12.5% రూపాయలు మాత్రమే విడుదల చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో పెరుగుదల ఉన్నప్పటికీ, పంచాయితీరాజ్ సంస్థలకు ఇవ్వాల్సిన వాటా 12.5% కి తగ్గిపోవటం ఈ సంస్థలోని నాయకత్వ లేమికి తార్కాణం. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా గ్రామీణాభివృద్ధికై విడుదల చేసే నిధుల్ని ఏక గవాక్ష పద్ధతిన పంచాయితీ రాజ్ సంస్థలకు విడుదల చేయటం



వల్ల ఈ సంస్థలు బలోపేతం అవుతాయి. తద్వారా నాయకత్వం బలపడుతుంది.

### 6. సామర్థ్యాల పెంపు

పంచాయితీ రాజ్ సంస్థల ప్రతినిధులు, సిబ్బందికి శిక్షణ ద్వారా వారి సామర్థ్యాల్ని పెంచే దిశగా చర్యలు చేపట్టాలి. ఆంధ్రప్రదేశ్‌లోని 2.6 లక్షల ప్రజా ప్రతినిధులకు, ఆ సంస్థల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి. ఆ దిశగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు శిక్షణకై కేటాయింపులు జరిపాయి. వివిధ అభివృద్ధి శాఖల సిబ్బందికి కూడా పంచాయితీ రాజ్ సంస్థలపై అవగాహన కల్పించాలి. తద్వారా ఈ సంస్థలు విస్తృతంగా చర్చించబడి, వీటి సామర్థ్యాలు పెంచబడతాయి. ఈ సంస్థలో పని చేసే సిబ్బందిలో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. ఈ సంస్థలకు నిజమైన నాయకులు ఎన్నుకోబడుతారు.

### ముగింపు

నాయకత్వం అనేది ఏ సమాజంలో అయినా ఒక్క రోజులో రూపొందేదికాదు. నిరంతర అనుభవాల ఆధారంగా, గుణపాఠాల పునాదులుగా, ప్రజా సమస్యల పరిష్కారాల ద్వారా వ్యక్తులు నాయకులుగా ఎదుగుతారు.




పంచాయితీరాజ్ సంస్థలు ఇందుకు మినహాయింపుకాదు. భారతీయ సమాజంలో నాయకులుగా ఎదగటానికి ఆత్మవిశ్వాసంతో పాటు నిజాయితీ, నిబద్ధత కలిగిన వ్యక్తులు కావాలి. ఇటీవలి పంచాయితీ రాజ్ ఎన్నికల్లో ఆధునిక భావాలు గల యువతరం అత్యధిక స్థానాల్లో ఎన్నిక కాబడ్డారు. పంచాయితీ రాజ్ సంస్థల స్ఫూర్తిని, సామాజిక న్యాయంతో కూడిన సమగ్రాభివృద్ధిని సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ నాయకత్వం బలోపేతం కావటానికి తగు చర్యలు చేపట్టమే మన ముందున్న కర్తవ్యం.

*- ఎ. గవర్రాజు,*
*ఫ్యాకల్టీ, ఇ.టి.సి. రాజేంద్రనగర్*
*సెల్ : 9505504276*

**ముంగిట్లో రంగు రంగుల ముగ్గులు, ఇంటినిండా ధాన్యం నిల్వలు, రైతన్న ముఖంలో చిరునవ్వులు-ఇవి పల్లె పల్లెలో మనకు కనిపించే సంక్రాంతి పండుగ దృశ్యాలు. గత అరవై సంవత్సరాలలో వ్యవసాయ రంగంలో జరిగిన సాంకేతిక పురోభివృద్ధి వలన, రైతుల శ్రమ ఫలితంగా ధాన్యాలు, పప్పు దినుసులు, నూనెగింజల పంటల ఉత్పత్తిలో ముందంజ వేయడమే కాకుండా, మన దేశంలో పెరిగే జనాభాకు ఆహార భద్రతను చేకూర్చగలిగారు.**

ఇటీవల వర్షాభావం వల్ల, అకాల వర్షాల వల్ల కొంత దిగుబడి తగ్గినప్పటికీ పండించిన పంటను నిల్వ చేసుకొని మంచి ధర పలికినపుడు అమ్ముకున్నట్లైతే రైతులకు అధిక నికరాదాయం వచ్చే అవకాశం వుంది. అందువలన సుమారు 60-70 శాతం వరకు రైతులు తమ ఇండ్లలోనే ఆరేడు నెలలు నిల్వ చేసుకుంటారు. నిల్వ చేసిన ఈ ధాన్యం కొంత కుటుంబ అవసరాలకు, కొంత విత్తనానికి, అధిక శాతం అమ్మకానికి ఉపయోగపడుతుంది. కొంతమంది రైతులు నేడు సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా గిడ్డంగులలో నిల్వ చేసుకుంటున్నారు. చేతికొచ్చిన పంటలో పదిశాతం వరకు నిల్వ లోపాల వల్ల రైతులు నష్టపోతున్నారు. అందువలన నూర్చినప్పటి నుంచి అమ్ముకునేంత వరకు మధ్యలో ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా జాగ్రత్త పడితే ప్రజలకు ఇంకా ఎక్కువ ధాన్యం లభ్యమయ్యే అవకాశం ఉంది.

నిల్వ చేసిన ఆహారధాన్యానికి ముఖ్యంగా పక్షులు, ఎలుకలు, తేమ, ఉష్ణోగ్రత, క్రిమి కీటకాలు-బూజు తెగుళ్ళ వలన నష్టం

# ధాన్యాన్ని సంరక్షిస్తే, మానవాళి సురక్షితం



కలుగుతుంది. సాధారణంగా పంట కోసిన తరువాత గింజలలో 18-20 శాతం పైబడి తేమ ఉంటుంది. ఈ దశలో కీటకాల శిలీంద్రాలకి ధాన్యాన్ని ఆశించడానికి అనుకూలమైన పరిస్థితులు వుంటాయి. కాబట్టి తేమ శాతాన్ని 10 నుండి 12కు వచ్చే వరకు ధాన్యాన్ని సూర్యరశ్మిలో గాని, సోలార్ డ్రైయర్‌తోగాని ఆరబెట్టాలి. ఇలా చేసినట్లైతే ధాన్యం పురుగులు, తెగుళ్ళ బారినపడకుండా 6 నుండి 12 నెలల వరకు కాపాడుకోవచ్చు. విత్తనాల కోసం నిల్వ చేసేటప్పుడు అధిక ఉష్ణోగ్రతలో అంటే పూర్తిగా ఎండలో ఆరబెట్టకుండా కొద్దిగా నీడలో తేమశాతం కొద్దికొద్దిగా తగ్గే విధంగా ఆరబెట్టాలి. లేకపోతే గింజలపై పగుళ్ళు ఏర్పడి మొలక దెబ్బతింటుంది. అంతేకాకుండా మిల్లు ఆడించినప్పుడు నూకలవుతాయి. కొన్ని ప్రాంతాలలో గాలిలో అధిక తేమ ఉండటం వలన శిలీంధ్రాలు ఆశించి ధాన్యాన్ని నష్టపరుస్తాయి. ఇటువంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నపుడు ఆరబట్టే యంత్రం సహాయంతో తేమను తగ్గించుకోవచ్చు.

ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి రైతులకు అనేక నిల్వ సాధనాలు అందుబాటులో వున్నాయి.

- వరి గడ్డితో నిర్మించిన పురులు
- వెదురు బద్దలతో చేయబడిన గంపలు
- విత్తన నిల్వ పరిశోధన సంస్థలు అభివృద్ధి పరచిన ఆధునిక పురులు, లోహపు గాదెలు, వీటిని నిర్మించుకోవడానికి ప్రభుత్వ రాయితీలు కూడా వున్నాయి.
- వివిధ పరిమాణాలలో గిడ్డంగులు, కొట్లు, రూములు, షెడ్లు
- గోనె సంచులు, పాలిథీన్ సంచులు, గుడ్డ సంచులు మొదలైన వాటిని నిల్వ కొరకు ఉపయోగించవచ్చు.

*మేలైన నిల్వ సాధనాన్ని ఎంచుకోవడానికి కొన్ని లక్షణాలను గుర్తుంచుకోవాలి:*

- గాలిలోని తేమ, వర్షం మొదలైనవి నిల్వ సాధనంలోకి ప్రవేశించకూడదు.
- అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉండకూడదు.
- పక్షులు, ఎలుకలు, పెంపుడు జంతువులు చొరపడనిదిగా ఉండాలి.
- అవసరాన్ని బట్టి గాలి వెలుతురు ప్రవేశించేలా ఉండాలి.
- క్రిమికీటకాలను అరికట్టే పద్ధతులను పాటించే విధంగా ఉండాలి.

ఇక నిల్వ చేసే ముందు, చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలుసుకునే ముందు, ధాన్యాన్ని ఆశించే పురుగుల వల్ల 5 శాతం నష్టం వాటిల్లుతున్నట్లు అంచనా. వీటిలో ముఖ్యమైనవి వడ్లచిలుకలు, పెంకు పురుగులు లేక మసి పురుగులు, ముక్కు పురుగులు, బిళ్ళ పురుగులు.

ధాన్యాన్ని ఆశించే పురుగులు, గింజలలో రంధ్రాలు చేయడమే కాకుండా, గింజలను పిండిగా మార్చి, అంకురాన్ని తినివేస్తాయి. వీటి విసర్జన వలన కట్టిన తుట్టెలవలన ధాన్యంలో వేడి పెరిగి, గింజల రంగుమారి నాణ్యత దెబ్బ తింటుంది.

ఈ పురుగులు అనేక విధాలుగా ధాన్యాన్ని ఆశించవచ్చు. కొన్ని పురుగులు పొలంలో వున్నపుడే గింజలపై గ్రుడ్లను పెట్టి నిల్వ వసతులలో తల్లి పురుగులై బయటికి వచ్చి గిడ్డంగులు సరిగా శుభ్రపరిచనట్లైతే వాటి నెర్రలలో, కంతలలో మిగిలిన గింజలనాశించి వృద్ధి చెందుతాయి. అలాగే పాత సంచుల అంచులపై కూడా గ్రుడ్లు పెట్టి వృద్ధి చెందుతాయి. ఇక పొలం నుండి నూర్చి ఆరబెట్టిన ధాన్యాన్ని గిడ్డంగులకు చేర్చడానికి వాడే రవాణా సాధనాల ద్వారా కూడా ఈ పురుగులు వ్యాప్తి చెందుతాయి.

వరి ధాన్యాన్ని ఎక్కువగా రెండు రకాల వడ్ల చిలుకలు ఆశించి

నష్టపరుస్తాయి. ఈ చిలుకలలో ఒక రకమైన కార్సిరా అనే రకం వరితో పాటు పప్పు దినుసులు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలను కూడా నష్టపరుస్తుంది. చిన్న వడ్ల చిలుకైనటువంటి సైటో్ట్రోగా రకం చిన్న చిన్న తుట్టెలు కడుతుంది. కాని పెద్ద వడ్లచిలుక పెద్ద పెద్ద తుట్టెలు కట్టడం వలన నష్టం ఎక్కువగా వుంటుంది. ఒక్కొక్కసారి ఈ తుట్టెలు 2 కిలోల బరువు కూడా వుంటాయి.

వరి ధాన్యాన్ని ఆశించే మరో పురుగు ముట్టెపురుగు లేక ముక్కు పురుగు. దీనినే రైస్ వీవిల్ అని కూడా అంటారు. ఇది 3 మి.మి.ల పొడవుండి తలభాగం సన్నని ముక్కుగా బయటకు వచ్చి కనబడుతుంది. ఇవి ముదురు గోధుమరంగు నుంచి నలుపు రంగులో వుంటాయి. ఆడపురుగులు గింజపై సన్నని రంధ్రం చేసి లోపలికి గ్రుడ్లు పెట్టి పైన జిగట వంటి పదార్థంతో కప్పివేస్తాయి. ఒక్కొక్క ఆడపురుగు గింజకొకటి చొప్పున దాదాపు 150 నుండి 250 గ్రుడ్లు వరకు పెడుతుంది. ఈ గ్రుడ్లనుంచి కాళ్ళు లేని మెత్తని పిల్ల పురుగులు పిగిలి గింజలోనే వుండి, అందులో పదార్థాన్ని తిని గూడు కట్టుకుని ధాన్యాన్ని పిండిగా మార్చి నష్టపరుస్తుంది. గింజకు రంధ్రం చేసి తల్లి పురుగు బయటికి వచ్చి దాదాపు 3-5 నెలలు జీవించి మళ్ళీ మళ్ళీ ధాన్యాన్ని నష్టపరుస్తుంది. 10 శాతం కన్నా తేమ తక్కువగా వున్న ధాన్యంలో ఇవి గ్రుడ్లు పెట్టవు. ఈ పురుగు నష్టం ఎక్కువగా వడ్ల కన్నా బియ్యంలోను, జొన్న, మొక్కజొన్న, గోధుమలోను కనిపిస్తుంది.

ధాన్యాన్ని ఆశించే మరొక ముఖ్యమైన పురుగు ట్రైబోలియం కాస్టేనియం. దీనినే చెక్కపురుగని పిలుస్తుంటాము. వీటి తల్లి పురుగులు, లార్వాలు మిల్లు ఆడించిన ధాన్యాన్ని, పిండిని ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. ఒక్క పురుగు 400 నుండి 500 గ్రుడ్లను పెడుతుంది. రోజు పది గ్రుడ్ల చొప్పున నెలల తరబడి పెడుతూనే వుంటుంది. తౌడు ఎక్కువగా వున్న ధాన్యం నిలువ వుంచినపుడు ఈ పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. పిండి నాశించినపుడు త్వరత్వరగా వృద్ధి చెందడం వలన పిండి నుంచి ఒక విధమైన వాసన వెలువడి తినడానికి పనికి రాకుండా పోతుంది.

పప్పు దినుసులాశించే పెంకు పురుగుల తల్లి పురుగులు గింజలకు రంధ్రాలు చేసి 80-100 గ్రుడ్లు పెడతాయి. వీటి నుండి వచ్చిన పిల్ల పురుగులు గింజ లోపలి భాగాన్ని తిని పెద్ద పెద్ద రంధ్రాలు చేయడం వలన ఈ పప్పు దినుసులకు మార్కెట్‌లో పూర్తిగా ధర తగ్గిపోతుంది.

ఎలుకల విషయానికొస్తే చిట్టెలుకలు, పందికొక్కులు గోధుమరంగు ఎలుకలు ధాన్యాన్నే కాకుండా చెక్క సామాన్లను, కాగితపు, ప్లాస్టిక్ సామాన్లను కూడా కొరికి నష్టపరుస్తాయి. ఇవి ధాన్యం తినడం కన్నా వీటి వెంట్రుకలు, మలమూత్ర విసర్జనలతో ఎక్కువగా గింజ నాణ్యతను తగ్గిస్తాయి. ఎలుకలు ఎక్కువగా వుండే గిడ్డంగులలో ఒక ప్రత్యేకమైన దుర్వాసన గమనించవచ్చు. వీటి వల్ల అనేక రకాలైన జబ్బులు కూడా వ్యాప్తి చెందుతాయి. ఉదాహరణకు ప్లేగు వ్యాధి లాంటివి.

ధాన్యంలో ఉష్ణోగ్రత 30- $32^{0}$C, 12 శాతం కన్నా ఎక్కువ ఉన్నట్లైతే శిలీంధ్రాలు వృద్ధి చెంది తెగుళ్ళు సోకే అవకాశం ఎక్కువ. ఈ శిలీంద్రాల వల్ల గింజ రంగుమారి, దుర్వాసన రావడమే కాకుండా, కొన్నిసార్లు గింజలు విషపూరితమై మనుషులు, పశువులకు హానికరంగా మారుతాయి.

ఎంతో శ్రమకోర్చి పండించిన ధాన్యం ఇలా ప్రతి 100 కిలోలకి 9 నుండి 10 కిలోల చొప్పున మనం నష్టపోతున్నాము. నిల్వచేసే ముందే కొన్ని జాగ్రత్తలు పాటించి నష్టాన్ని తగ్గించుకోవచ్చు.

- నిల్వ చేయాలనుకునే ధాన్యం నుండి దుమ్ము, ధూళి, తాలు గింజలు, మట్టిగడ్డలు మొదలైనవి వేరుచేయాలి.
- ధాన్యపు నిల్వకు సరియైన నిర్మాణాలను ఎంపిక చేసుకోవాలి. తేమ, ఎలుకలు, పక్షులు ఆశించని విధంగా వాండాలి.
- ధాన్యాన్ని నింపేందుకు వాడే నిర్మాణాలను సంచులను బాగా శుభ్రం చేసుకోవాలి.
- నిర్మాణాల పగుళ్ళు లేక కంతలను మట్టితో లేక సిమెంటుతో పూడ్చాలి. అలాగే ధాన్యపు కొట్టుకు సున్నం వేయాలి.
- గోడలకు, పైకప్పుకు, బస్తాలను వుంచిన బల్లలపై 50 శాతం మలాథియాన్ మందును 10మి.లీ ఒక లీటరు నీటికి కలిపి ఆ మిశ్రమాన్ని 100 చ.మీ. కి 3 లీటర్లు మందు ద్రావణాన్ని పిచికారి చేయాలి.
- ఎలుకల కన్నాలను రాళ్ళు, మట్టితో పూడ్చి సిమెంట్‌తో దట్టించాలి. తలుపులకు లోహపు రేకులు క్రింద వరకు ఉండేటట్టు కొట్టినట్లైతే ఎలుకలు లోనికి ప్రవేశించలేవు.
- పక్షులు దూరకుండా తలుపులకు, కిటికీలకు వెంటిలేటర్లకు ఇనుప జాలీలను బిగించాలి.
- బస్తాలలో నిల్వచేయాలంటే వీలైనంత వరకు కొత్త బస్తాలు వాడాలి. చిక్కగా అల్లిన గోనెసంచులలో గాని, నైలాన్ సంచులలో గాని, ఈ మధ్య కొత్తగా వస్తున్న సూపర్ గ్రైన్ బ్యాగులలో కాని నిల్వచేసుకోవచ్చు. పాతబస్తాలనే వాడాలంటే వాటిని చిరుగులు లేకుండా చేసి డెల్టామెత్రిన్ 1.25 మి.లీ. 10 లీ. నీటిలో కలిపి లేదా 5 మి.లీ మీలాథియాన్ లీటరు నీటిలో కలిపిన ద్రావణంలో ముంచి బాగా ఆరబెట్టిన తరువాతే వీటిని వాడుకోవాలి.
- పప్పు గింజలను పొట్టు తీసి నిల్వచేస్తే మంచిది.

### ఇక నిల్వచేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలకొస్తే . . .

- ఆహార ధాన్యాలను నిల్వచేసే నిర్మాణాలను, బస్తాలను నేలకు గోడలకు తగలకుండా ఎత్తైన స్థలంలో ఉంచాలి. ఇలా బస్తాలను ఎత్తైన చెక్క దిమ్మెలపై వుంచి నట్లైతే నేల గోడల ద్వారా తేమ బస్తాలలోనికి ప్రవేశించడానికి వీలుండదు. ఎత్తులో వుంచడానికి వీలు పడక పోతే సంచుల క్రింద కనీసం పాలీథీన్ షీటైనా పరవాలి.
- గోడలకు దూరంగా బస్తాలను వుంచి, బస్తాల మధ్య తిరిగేందుకు వీలుగా ఏర్పాటు చేసుకోవాలి.
- ఆహారధాన్యాల బస్తాలకు, నిర్మాణాలకు, బస్తాల మధ్య సంచారానికి కలిసందులకు, గోడలకు పురుగు పట్టకుండా 3-4 వారాల కొకసారి డెల్టామెత్రిన్ 1 మి.లీ/10లీ నీటిలో గాని మలాథియాన్ 5 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- పాత ధాన్యంతో కొత్త ధాన్యం కలుపకూడదు.
- ధాన్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ చేయాలనుకున్నపుడు అప్పుడప్పుడు ఎండబెడితే మంచిది.
- ధాన్యం వేడెక్కినట్లు, ఉష్ణోగ్రత పెరిగినట్టు గమనిస్తే, ఆ ధాన్యాన్ని తిరగబోసి గాలికి ఆరబెట్టాలి.
- నిల్వ ధాన్యాన్ని కనీసం 15-20 రోజుల కొకసారి తనిఖీ చేస్తూ నమూనాలు తీసి పరీక్షించాలి. పురుగు పట్టినట్లు గమనిస్తే తగిన పురుగు మందులను బస్తాలపై పిచికారి చేయాలి.

- విషవాయువులు వెదజల్లే అల్యూమినియం ఫాస్పైడ్ అంతే సెల్ఫాస్ మందు బిళ్ళలను గోదాములలో ఉంచి 3-4 పర్యాయాలు పొగ బారించి పురుగులను నివారించవచ్చు. దీనికి ముందుగా గోదాముల ను పూర్తిగా 'గాలి బయటకు పోకుండా మూసి వేయాలి. గోనె సంచులపై పట్టరాని టార్పాలిన్ కాని కప్పి, దాని క్రింద టన్ను ధాన్యానికి 3-5 గ్రాముల బిళ్ళలు 2 లేక 3 వెయ్యాలి. ఈ బిళ్ళల నుండి ఫాస్ఫీన్ అనే విషవాయువులు వెలువడడం వల్ల పురుగులు చనిపోతాయి. ఈ విషవాయువులు మనకు హానికరం కాబట్టి తగిన శిక్షణ పొందిన వారే ఈ ప్రక్రియ చేపట్టాలి,. ఈ బిళ్ళలు పెట్టేటప్పుడు చేతి తొడుగులు, ముఖానికి ముసుగులు వేసుకోవాలి. గోదామును 4-5 రోజుల వరకు తెరవకూడదు. విషవాయువులు బయటకు పోకుండా జాగ్రత్త పడాలి.

## ఎలుకలను నిర్మూలించాలంటే...

- ఎలుకలు సంచరించే చోటులో ఎలుకల బోనులను పెట్టి, పడిన ఎలుకలను చంపి వేయాలి.
- ఎలుకలు తిరిగే గుర్తులు గమనించి జింకు ఫాస్ఫైడ్ లేదా బ్రోమాడయిలాన్ వంటి మందు కలిపిన ఎరలను వాడి ఎలుకలను నివారించాలి.
- మందు కలిపిన ఎరలను ఎలుకలు తినడానికి సందేహిస్తాయి కాబట్టి ముందుగా మందు కలపని ఎరలను తయారు చేసి పెట్టాలి. బియ్యపు పిండిగాని, గోధుమపిండి గాని దానికి వేరుశనగ నూనెగాని మరె వంటనూనెగాని 98:2 నిష్పత్తిలో కలిపి అక్కడక్కడ, ఎలుకలు తిరిగే ప్రదేశాలలో 2 రోజులు గాంచాలి. అవి అలవాటు పడిన తరువాత 96గ్రా పిండికి 2 గ్రాముల నూనెతో పాటు 2 గ్రాముల జింకు ఫాస్ఫైడ్ మందును కలిపి ఒక్కొక్క చోటున 20 గ్రాముల ఎర చొప్పున సాయంత్రం వేళల్లో పెట్టాలి. మిగిలిన ఎరను మరుసటి రోజు వాడాలి.
- ఇవికాక మార్కెట్‌లో దొరికే బ్రోమడైలాన్ కేకులు వాడి కూడా ఎలుకలను సమర్ధవంతంగా నివారించవచ్చు. ఎలుకల నిర్మూలనా పద్ధతులను సామూహికంగా పాటిస్తే, మంచి ఫలితాలు ఉంటాయి.
- ఈ ఎరమందులను చిన్న పిల్లలు, పెంపుడు జంతువులకు అందుబాటులో లేకుండా జాగ్రత్త పడాలి.

తక్కువ మోతాదులో కుటుంబ అవసరాల నిమిత్తం నిల్వచేసే ధాన్యాలను, పప్పుదినుసులను, సాంప్రదాయక పద్ధతుల ద్వారా నిల్వచేసుకోవచ్చు.

- గింజ ధాన్యాలను నిల్వచేస్తున్నపుడు ముడి పప్పుకు నూనె రాసి నిల్వ చేయవచ్చు. దీని కొరకు ఎక్కువ శ్రమపడాల్సిన అవసరం కూడా లేదు. ఒక కేజి ముడి పప్పుకు ఒక టీస్పూన్ నూనె కలిపితే సరిపోతుంది. మామూలుగా వాడే నూనె ఏదైన వాడవచ్చు.
- సన్నటి ఇసుక , బంకమట్టి, బూడిదవంటి జడ పదార్థాలు 1-2 శాతం మోతాదులో ధాన్యంతో కలిపినప్పుడు కొంతకాలం వరకు నష్టం కలుగకుండా కాపాడవచ్చు.
- వృక్ష సంబంధమైన పదార్థాలు అంటే వేపాకు, వేపగింజల పొడి, ఎండబెట్టిన నూరిన వెల్లుల్లి, వసపొడి లేక కొమ్మలు 10గ్రా చొప్పున ఒక కిలో విత్తనానికి కలిపి నిల్వచేసుకోవచ్చు.
- ట్రై కాల్షియం ఫాస్పేట్ అనే రసాయనం 1-2 శాతం దాకా పప్పులలో కాని పిండిలోకాని కలిపి ఆరు నెలల వరకు సురక్షితగా నిల్వచేసుకోవచ్చు. ఇది రసాయన పదార్థమైనప్పటికీ, దీని వలన మనకి హాని జరగదు.
- విత్తనం కొరకు నిల్వచేసినపుడు పప్పుధాన్యాలకు గాని, వేరుశనగకు కాని విత్తనానికి డెల్టామెత్రిన్ 40 మి.గ్రా తోపాటు థైరమ్ 2.5 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసుకోవచ్చు. లేదా 100 కేజీల విత్తనానికి స్పైనోసాడ్ 4మి.లీ చొప్పున లేదా వేప సంబంధిత మందులైనటు వంటి ఇకోనీమ్ - 5మి.లీ చొప్పున నీమజాల్ 0.75 మి.లీ కేజి విత్తనానికి కలిపి నిల్వచేసుకోవచ్చు. ఇలా నిల్వ చేసిన ధాన్యం ఆరు నెలల వరకు సురక్షితంగా వుంటుంది.

పురుగుల వల్ల గోదాములలో జరిగే నష్టంతో సమానంగా ఇళ్ళలో నిల్వచేసిన ధాన్యంలో కూడా నష్టం జరుగుతూ వుంటుంది. ధర తక్కువగా వున్న సమయంలో వివిధ ఆహార ధాన్యాలను కొని ఇండ్లలో నిల్వచేసుకోవడం పరిపాటి. ఇక్కడ సరైన పద్ధతులు పాటించకుంటే ధాన్యంలో జరిగే నష్టం, తక్కువ ధరలో కొన్న ఆదా కన్నా ఎక్కువగా వుంటుంది. ఆహారధాన్యాలను నిల్వచేసే ముందు, కొత్త ధాన్యాన్ని నిల్వచేసేముందు అందులో పాతధాన్యాన్ని పూర్తిగా తీసివేసి శుభ్రంగా కడిగి ఎండలో ఆరనివ్వాలి.

- కొద్ది మొత్తంలో బియ్యం నిలువ చేసుకున్నపుడు బియ్యానికి కొద్దిగా ఉప్పును కలపడం వలన పురుగు పట్టకుండా చూసుకోవచ్చు.
- అంతేకాక ఎండిన వేపాకును వేసి కూడా పురుగు పట్టకుండా నివారించవచ్చు.
- ధాన్యం రవ్వ ఏదైనా నిలువుంచుకొనే ముందు జల్లించుకోవడం వల్ల అందులో పురుగుకు సంబంధించిన గ్రుడ్లు, లార్వాలు వుంటే వేరుచేసే అవకాశం వుంటుంది. జల్లించిన తరువాత రవ్వను కొద్దిగా వేపి చల్చార్చి గట్టి మూతలున్న- డబ్బాలలో నిల్వవుంచుకోవాలి మైదా, గోధుమపిండి, జొన్నపిండి లాంటి అన్ని పిండ్లలోను 1-2 శాతం ట్రై కాల్షియం ఫాస్పేట్ కలపడం వలన మూడు నెలలు వరకు ఎటువంటి పురుగులు ఆశించకుండా నివారించవచ్చు.

అవకాశం వున్నవారు ఇళ్ళలోని రెఫ్రిజరేటర్లులో నిల్వవుంచుకోవడం వలన అన్ని రకాల వంట సరకులను సంరక్షించవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ప్రతి చిన్న పట్టణంలోను మార్కెట్ యార్డులలో గోదాములను నిర్మించింది. ఈ గోదాములలో రైతులు తమ ధాన్యాన్ని నిల్వచేసుకోవడం వలన అతి తక్కువ ఖర్చుతో ఎటువంటి కష్టనష్టం లేకుండా మన ధాన్యాన్ని సరైన ధర పలికేంత వరకు వారి వద్ద సురక్షితంగా ఉంచుకొనవచ్చు.

అంతేగాక మనం నిలువ వుంచిన ధాన్యం పైన రైతు బృంద పథకం ద్వారా నూటికి 75 రూపాయలు, అంటే 75 శాతం వడ్డీలేని ఋణాన్ని పొందవచ్చు. ఈ సదుపాయాన్ని రైతులందరూ వాడుకొని సరైన మద్దతు ధర పొందడమే కాకుండా పండించిన ధాన్యాన్ని మొత్తం ప్రజలందరు వినియోగించుకోనేలా చేయగలరు.

ఆఖరుగా గుర్తుంచు కోవలసినదేమిటంటే - వంటను పండించేటప్పుడు చూపే శ్రద్ధ కొంచెం వాటిని నిల్వచేసేటప్పుడు కూడా చూపితే రెట్టింపు ధాన్యాన్ని పండించిన వాళ్ళమౌతాం.

*"ధాన్యం సంరక్షిత - మానవాళి సురక్షితం!"*

*"ధాన్యం సురక్షితంగా నిల్వ చేయగల్గితే ధాన్యం పండించినట్లే!"*

*- డా॥ వి. అనిత, ఆర్. బాలాజీ నాయర్, శ్రీమతి ఎం. రాజశ్రీ*

*ఆచార్య ఎన్.జి. రంగా యూనివర్సిటి*

# మహనీయుల చతురోక్తులు

*- పోలాప్రగడ సత్యనారాయణమూర్తి*

## ముందే చెప్తే ముసుగు తప్పేది

**చెరుకువాడ వేంకట నరసింహంగారు చక్కని హాస్యప్రియులు, ఆయనో మారు ఎమ్.ఎల్.ఏ పదవికి పోటీ చేసి ఓడిపోయారు. డిపాజిట్ కూడా దక్కలేదు.**

**మర్నాడే ఆయనొక లెటర్ హెడ్ వేయించుకున్నారు - చెరుకువాడ వెంకటనరసింహం, ఎమ్.ఎల్.ఏ.డి.డి.ఎల్. అని.**

ఇదేవిటని మిత్రులు అడిగారు. ఆయన నవ్వుతూ "అవునయ్యా- నేను ఎమ్.ఎల్.ఏ. డిఫీటెడ్ డిపాజిట్ లాస్ట్ కదా.... అందుకే లెటర్ హెడ్ అలా వేయించాను" అన్నారు.

ఓ మారు ఆయనొక పేసింజరు రైల్లో విజయవాడ నుండి రాజమండ్రి వెళుతున్నారు. రైలు ప్రతి స్టేషనులోనూ ఆగుతోంది.

ఆగిన చోటల్లా, ఇద్దరో ముగ్గురో తెలిసిన వ్యక్తులు, ముఖ్యంగా ఖద్దరు ధరించిన కాంగ్రెస్ వాళ్ళు, ఆయన్ని చూసి, ప్లాట్ ఫారమ్ అంతా నడిచి వచ్చి, రైలు కిటికీ దగ్గర నిలబడి నమస్కారం పెట్టి పలకరించి వెళుతున్నారు.

ఏలూరు స్టేషన్ వచ్చే వరకూ ఆ తంతు సాగుతూనే ఉంది. నరసింహంగారి సీటుకి ఎదురు సీటులో కూర్చున్న ఆసామీ ఒకాయన ఇదంతా చూస్తూనే ఉన్నాడు.

చూసి చూసి చటుక్కున లేచి నుంచుని "నమస్కారం అండీ" అన్నాడు.

నరసింహంగారు ఉలిక్కిపడి వెంటనే చిరునవ్వు నవ్వి "అ...అ... నమస్కారం" అన్నారు.

'ఈయనెవరో పెద్ద నాయకుడే అయి ఉంటాడు. లేకపోతే ఆగిన ప్రతి స్టేషన్‌లోనూ జనం వచ్చి నమస్కారం ఎందుకు చేస్తారు' అని ఆ ఆసామీ అనుకొని ఉంటాడు. 2సరే... అడిగిచూద్దాం' అని ఆలోచించి "నాకు మీరు నమస్కారం ఎందుకు పెట్టారు? నే నెవరో మీకు తెలుసా?" అని ప్రశ్నించారు నరసింహంగారు.

దాంతో ఆ ఆసామీ తబ్బిబ్బుపడి, "అయ్యో! మీరు తెలియక పోవడం ఏమిటి? టంగుటూరి ప్రకాశపంతులుగారు" అన్నాడు.

నరసింహంగారు 'కాదు' అని తల అడ్డంగా ఊపారు.

"ఆ... ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. మీరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు" అన్నాడు.

మళ్ళీ కాదన్నారు నరసింహంగారు...

ఇంతలో భీమడోలు స్టేషన్ వచ్చింది.

"నేనెవరో తెలిసిందా?" అని నరసింహంగారు అడగడం, "మీరు ఎన్.జి రంగా" అని ఆసామీ అనడం, ఈయన మళ్ళీ తల అడ్డంగా ఊపడం, మరో స్టేషన్ రావడం, జనం వచ్చి నరసింహంగారికి నమస్కార చేసి వెళుతూ ఉండడం, "ఈ మారు తెలిసిందా నేనెవరో" అని ఈయన అడగడం, ఆయన, కళా వెంకటరావు,బులుసు సాంబమూర్తి వగైరా వగైరా పేర్లేవో చెబుతూ ఉండడం, అన్నింటికి ఈయన కాదంటూ ఉండడం, ఈ తంతు అలా సాగిపోతూనే ఉంది.

చివరికి ఆ ఆసామీ దిగి వెళ్ళిపోవలసిన కొవ్వూరు స్టేషన్ వచ్చింది. అతను దిగి వెళ్తూ వెళ్తూ "అయ్యా, మీరు అవునన్నా కాదన్నా ఇది ఖాయం. ఇంక అనుమానం లేదు. మీరు దువ్వూరి సుబ్బమ్మ గారు. ఇంక కాదనకండి శలవు" అంటూ వెళ్ళిపోయాడు.

ఇలా జరిగిన ఓనాటి సంఘటనని చెప్పి నరసింహంగారు చివరికి ఓ ముక్తాయింపు చేర్చారు. "మొదట టంగుటూరి ప్రకాశంగారన్నప్పుడు ఒప్పుకున్నా బాగుండిపోయేది. చివరిక ఆ ఆసామీ నన్ను వీరేశలింగం గారి స్వజనంలో కలిపేశాడు... ఇంక నేనేం చేసేది? ఇదిగో ఇలా ముసుగేసు కోవాలి" అంటూ భుజం మీదున్న తెల్లకండువాని తల మీదకి లాక్కున్నారు. ☆

## ఉమ్మడి కృషికి సొమ్ములు చెరిసగం

**హాస్య బ్రహ్మ శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు గారు రచనలో ఎంత హాస్యాన్ని చొప్పించేవారో నిత్య జీవితంలో అంత సీరియస్‌గా కనిపించే వారు. రాజమండ్రి వీరేశలింగం హైస్కూల్‌లో ఆయన కొన్నాళ్ళు లెక్కలూ, ఇంగ్లీషూ చెప్పే బి.ఇ.డి అసిస్టెంట్‌గానూ, తర్వాత కొన్నాళ్ళు హెడ్ మాస్టర్ గానూ పనిచేశారు.**

ఆయన హెడ్ మాస్టర్ ఆయాక సరే, చెప్పనే అక్కర్లేదు. లెక్కల టీచర్‌గా వున్నప్పుడు కూడా స్టూడెంట్స్ అందరికీ మొత్తం మేష్టర్లందరిలోనూ ఆయనంటేనే హడల్. అలాగని ఆయనెవర్నీ కొట్టేవారు కాదు. జన్మలో మరిచిపోలేనట్టుగా క్లాసులో ఓ మాట అనడమో, నోట్ బుక్ మీదా, పరీక్ష పేపర్ల మీదా ఓ చురక తగిలించడమో. అంతే.

ఓ మారు అర్ధ సంవత్సరం పరీక్షల్లో ఆయనిచ్చిన ప్రశ్నాపత్రం చాలా కఠినంగా వుంది. సాధారణంగా తొంభై పైన వచ్చే మా కెవ్వరికీ ఏభై దాటి వచ్చేలా లేవు. అలా వుంది లెక్కల పేపరు. ఆయనకి తెలిసివస్తుందా అని, బాగా మార్కులు వచ్చేవాళ్ళే ఇద్దరు, ఒకరి పేపరులో ఒకరు కాపీచేసి, మొత్తంమీద సాయంపట్టి ఇద్దరూ అన్ని లెక్కలూ అన్సర్ చేశారు. మొత్తం పది లెక్కల్లోనూ ఆరు లెక్కలు రైటు. ఒక లెక్క చెయ్యడం తప్పు, మరో మూడు లెక్కల ఆన్సర్‌లు తప్పు.

ఒకే తప్పు. అన్సర్లని బట్టి వాళ్ళిద్దరూ కాపీ చేశారని కనిపెట్టారు మేష్టారు. పేపర్లు దిద్ది తిరిగి ఇచ్చేటప్పుడు వారిద్దరి పేర్లూ ప్రత్యేకంగా చదివి, "ఈ ఇద్దరికీ కలిసి మొత్తం అరవై ఆరు మార్కులు వచ్చాయి. పరస్పర సహకారం మీద నమ్మకం వున్నవాళ్ళు వీళ్ళు. అందువల్ల ఇద్దరికీ చెరో ముప్పైమూడు మార్కులూ పంచుతున్నా" అన్నారు కామేశ్వరరావు గారు గంభీరంగా. వాళ్ళిద్దరూ తలలు దించుకున్నారు. తక్కిన మేం అందరం తలలాడించాం, మాబాగా అయిందని లోపల్లోపల సంతోషిస్తూ.

☆

**బోధన ప్రణాళిక** (Fixed Point Chart)

# గ్రామ వికాసం
# దూర విద్యా బోధన

## మన టి.వి. (సాప్ నెట్) ఛానెల్ -3 (05-08-2010 నుండి 26-08-2010)

| తేదీ/లో | అభ్యర్థులు | ప్రసార సమయం | కార్యక్రమం |
|---|---|---|---|
| 5.8.2010 | గ్రామ పంచాయితీ వార్డు మెంబర్లు | ఉ.11.00-ఉ.11.20 | అధికారం సంక్రమింపు - గ్రామీణాభివృద్ధి |
| | | ఉ.11.20-ఉ.11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | ఉ.11.40-మ.12.00 | మహిళా శిశుసంక్షేమానికై ప్రభుత్వ సంస్థల సేవలు |
| | | మ.12.00-మ.12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | మ.12.20-మ.12.40 | అధికారం సంక్రమింపు - గ్రామీణ నీటి సరఫరా |
| | | మ.12.40-మ.1.00 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | మ.1.00-మ.1.20 | వరద నిర్వహణ |
| | | మ.2.00-సా.4.40 | లైవ్ ఇంటరాక్షన్- మనTV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |
| 12.8.2010 | గ్రామ పంచాయితీ అధ్యక్షులు | ఉ.11.00-ఉ.11.20 | అధికార సంక్రమింపు - వెనుకబడిన తరగతులు, సాంఘిక సంక్షేమం |
| | | ఉ.11.20-ఉ.11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | ఉ.11.40-మ.12.00 | బాలికల విద్య పెంపొందించ టంలో పంచాయితీ రాజ్ సంస్థల పాత్ర |
| | | మ.12.00-మ.12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | మ.12.20-మ.12.40 | హానికరం, ప్రమాద భయం, దుర్భల పరిస్థితులు- పంచాయితీ సంస్థలకు స్థోమత నిర్ధారణ |
| | | మ.12.40-మ.1.00 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | మ.1.00-మ.1.20 | దేశంలోని పంచాయితీ రాజ్ సంస్థల స్థాయి |
| | | మ.1.20-మ.1.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | మ.2.00-సా.4.40 | లైవ్ ఇంటరాక్షన్- మనTV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |
| | | మ.2.00-సా.4.40 | లైవ్ ఇంటరాక్షన్- మనTV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |
| 19.8.2010 | గ్రామ పంచాయితీ అధ్యక్షులు | ఉ.11.00-ఉ.11.20 | సమాజ ఆధారిత వికలాంగుల పునరావాసం |
| | | ఉ.11.20-ఉ.11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | ఉ.11.40-మ.12.00 | పంచాయితీ రాజ్ సంస్థలలో మహిళలు |
| | | మ.12.00-మ.12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | మ.12.20-మ.12.40 | పిల్లలు, గర్భవతులు, పాలిచ్చే తల్లుల పౌష్టికాహార అవసరాలు |
| | | మ.12.40-మ.1.00 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | మ.1.00-మ.1.20 | సుపరిపాలనకు ఇ- పంచాయితీ |

| తేదీ/లో | అభ్యర్థులు | ప్రసార సమయం | కార్యక్రమం |
|---|---|---|---|
| | | మ.1.20-మ.1.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | మ.2.00-సా.4.40 | లైవ్ ఇంటరాక్షన్- మనTV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |
| 26.8.2010 | యం.పి.టి.సి. మెంబర్ | ఉ.11.00-ఉ.11.20 | బోర్ బావులు, చేతి పంపుల నిర్వహణ |
| | | ఉ.11.20-ఉ.11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | ఉ.11.40-మ.12.00 | చిన్న పిల్లలలో అంగవైకల్యం నివారణ |
| | | మ.12.00-మ.12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | మ.12.20-మ.12.40 | ప్రకృతి వైపరీత్యాలలో ప్రాథమిక చికిత్స |
| | | మ.12.40-మ.1.00 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | మ.1.00-మ.1.20 | పట్టేదార్ పాస్ బుక్కులు, యాజమాన్యపు హక్కులు జారీ చేసే విధానం |
| | | మ.1.20-మ.1.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | మ.2.00-సా.4.40 | లైవ్ ఇంటరాక్షన్- మనTV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |

# చత్తీస్‌గఢ్ మంత్రి అపార్డు సందర్శన

చత్తీస్‌గఢ్ పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, న్యాయ, శాసన సభా వ్యవహారాల మంత్రి శ్రీ రామ్‌విచార్ నేతమ్ ది.2-7-2010 శుక్రవారం అపార్డును సందర్శించారు. పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి రంగాలలో ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి శిక్షణ అందచేయటంలో అపార్డు ఇతర రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి సంస్థలన్నింటికీ ఆదర్శప్రాయంగా ఉన్నదని, అందుకే అపార్డును సందర్శించినట్లు ఈ సందర్భంగా ఆయన అన్నారు. ముందుగా అపార్డులో ప్రజాప్రతినిధులు, సిబ్బంది శిక్షణ కోసం ప్రత్యేకంగా నెలకొల్పిన వీడియో కాన్ఫరెన్సు సదుపాయం ద్వారా ఇ.టి.సి.లతో సంభాషించి, దూర ప్రాంతాలలోని వారికికూడా ఈ సౌకర్యం వల్ల శిక్షణను సులభతరంగా ఎలా అందించవచ్చునో అన్న విషయాన్ని పరిశీలించారు. అనంతరం ఇ-క్లాస్ రూమ్‌ను, కంప్యూటర్ సెంటర్‌ను, ఇతర శిక్షణా వసతులను పరిశీలించారు.

గత ఐదు దశాబ్దాలుగా గ్రామీణాభివృద్ధి - పంచాయితీరాజ్ తదితర రంగాలలో శిక్షణ ద్వారా సామర్థ్యాల పెరుగుదలకు అపార్డు ఏ విధంగా కృషి చేసింది అన్న పరిణామ క్రమాన్ని, ప్రతస్తుతం అపార్డు అందచేస్తున్న శిక్షణ వివరాలను సి.డి.పి.ఏ సెంటర్ హెడ్ శ్రీ ఆర్. సూర్యనారాయణరెడ్డి మంత్రివర్యులకు పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. శ్రీ రామ్‌విచార్ నేతమ్ అపార్డులో 12 సెంటర్ల ఫ్యాకల్టీతో సంభాషించి వారు చేస్తున్న కార్యక్రమాల గూర్చి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేసారు. అపార్డు కమీషనర్ శ్రీ ఫణికుమార్ శ్రీ రామ్‌విచార్ నేతమ్‌కు జ్ఞాపికలు అందచేశారు. ♦





వార్తల్లో 'అపార్డ్'

**“భారతీయులంతా కలసి ఒకేసారి ఉమ్మివేస్తే, మూడు లక్షల మంది ఆంగ్లేయులను ముంచి వేయగల పెద్ద మడుగు ఏర్పడుతుంది! అన్నారు గాంధీజీ ఒకసారి. కాని, ఆ ఆంగ్లేయులే దాదాపు రెండు శతాబ్దాలు భారతదేశాన్ని పాదాక్రాంతం చేసుకుని మనలను బానిస జీవితం అనుభవింపచేశారు.**

ఇండియాలో మొదట 1498 మే 22న పోర్చుగీసు వారు కళ్ళికోటలో అడుగుపెట్టారు. 16వ శతాబ్ధి చివరి భాగంలో డచ్చివారు కాలు పెట్టారు. ఆ రోజులలో ఇంగ్లాండులోని సుగంధ ద్రవ్యాల వ్యాపారమంతా డచ్చివారి చేతిలో ఉండేది. హఠాత్తుగా వారు మిరియాల ధర పేనుకు అయిదు షిల్లింగులు (సుమారు రెండు రూపాయిలు) పెంచగా కినుక వహించిన ఆంగ్లేయులు తామే ఈ వ్యాపారం నడప నిర్ణయించుకున్నారు. 125 మంది ‘ఈస్ట్ ఇండియా కంపెనీగా’ ఏర్పడి ‘హెక్టార్’ అనే నౌకలో 1608 ఆగస్టు 24న ఆంగ్లేయులు భారతావనిలో అడుగు పెట్టారు. ఆ పిదప ఫ్రెంచివారు వచ్చారు.

# ఎందరో మహానుభావుల త్యాగఫలం

## స్థిరపడిన ఆంగ్లేయుల పాలన

1757లోనే డచ్చి, ఫ్రెంచి సైన్యాలను ఓడించిన క్లైవు భారతదేశంలో బ్రిటీషు పాలనకు పునాది వేశాడు. ఈ పునాదిని మొగ్గలోనే త్రుంచివేయాలని తిరగబడిన వీరపుత్రుడు మొదటి స్వాతంత్ర్య వీరుడు సిరాజుద్దౌలా 1757 జూలై 2న ప్లాసీ యుద్ధంలో అశువులు బాశాడు.

1757లో ఆంగ్లేయులు మన దేశం నుంచి కోటి రూపాయలు పన్ను వసూలు చేస్తే 1858 నాటికి అది 270 కోట్లకు పెరిగినది. చేనేత పరిశ్రమలను విధ్వంసం చేసి వారు తమ వస్త్రాలను భారతదేశంలోకి దిగుమతి చేయసాగారు. ఫలితంగా ఢక్కా నగరవాసులు కరువు వాతపడి లక్షా ముప్పై వేల మంది చనిపోయారు.

## వివిధ ఉద్యమాలు

1757 నుంచి వంద సంవత్సరాల వరకు ఏదో ఒక చోట భారతీయులు ఆంగ్లేయులతో తీవ్రమైన పోరాటం సాగిస్తూనే ఉన్నారు. మైసూరులో హైదర్‌ఆలీ, టిప్పుసుల్తాను; తమిళనాడులో వేలుతంబి మొదలయినవారు మహారాష్ట్రలో బాజీరావు, పీష్వా ప్రభృతులు, పంజాబ్ సర్దార్ శ్యామ్‌సింగా అటారీవాలా, మంగలపాండే ఝాన్సీ లక్ష్మీబాయి, బహదూర్‌షా, తాంతియాతోపే, మహరాజా కున్‌వ్వర్‌సింగ్, నానాసాహెబ్ మొదలయిన వారి శౌర్య సాహసాలు భారత చరిత్రలో సువర్ణఘట్టాలు.

అయితే, దురదృష్టవశాత్తు వీరంతా నమైక్యంగా ఆంగ్లేయులను ప్రతిఘటించలేకపోయారు. ఒకవైపు ప్రజల పోరాటం, మరోవైపు సిపాయిల తిరుగుబాటు కలసి ఒక సాంఘిక విప్లవంగా రూపొందింది.

1857 తర్వాత భారతీయులను నిరాయుధులను చేసిన ఆంగ్లప్రభుత్వం క్రమక్రమంగా ఒక్కొక్కరిని లొంగదీసుకుంది. వైస్రాయ్ లార్డ్ డఫ్రిన్ సలహా ప్రకారం 1885లో కాంగ్రెసును స్థాపించిన ఎ.ఓ. హ్యూమ్ దొర అని బ్రిటీషు ప్రభుత్వానికి సలహా మండలిగా వుంటుందని భావించాడు. కానీ, 1886లో కలకత్తాలో జరిగిన రెండవ కాంగ్రెస్ సమావేశంలోనే జాతీయ భావాలు రెక్కలు విచ్చుకున్నాయి. భారతీయులు శాంతికాముకులయినప్పటికీ, మూగజీవులు మాత్రం కారని, కాంగ్రెసు వేదిక ద్వారా స్వాతంత్ర్య పోరాటం సాగుతుందని మదన్‌మోహన్ మాలవ్య ఆంగ్ల ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

1906లో వంగ రాష్ట్ర విభజనతో కాంగ్రెసులోని తీవ్రవాదులు రంగం మీదకు దూకారు. బిపిన్ చంద్రపాల్, సురేంద్రనాథ బెనర్జీలు స్వదేశీ ఉద్యమానికి నాయకత్వం వహించారు. “స్వాతంత్ర్యం నాజన్మహక్కు! అని గర్జించాడు తిలక్. మేడమ్‌కామా విప్లవ వీరవనితగా, సావర్కార్ టెర్రరిస్టుగా మారిపోయారు. మరోవైపు 1905 నుండి ‘వందేమాతరం’ ఉద్యమం సాగింది.

ఆ రోజులలోనే నవాబులు, జాగీరుదార్లు మొదలయిన ఆంగ్లేయుల విధేయవర్గాలతో ఢాకాలో ‘ముస్లింలీగ్’ ఏర్పడింది. కాంగ్రెస్ ఉద్యమాల ను ప్రతిఘటించడానికి దీనిని బ్రిటీషు వారు సాధనంగా వాడుకోసాగారు.

1909లో వచ్చిన మింటో-మార్లే సంస్కరణల ద్వారా ముస్లింలకు



ప్రత్యేక ఓటింగు హక్కు ఏర్పడింది. 1910లో అలహాబాదులో జరిగిన కాంగ్రెసు సమావేశంలో బ్రిటీషు వారు పరోక్షంగా ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రోత్సహించారు. కనుక ప్రతి ఉద్యమానికి హిందూ, ముస్లింల సామరస్యం అవసరమైనది.

ఆ తదుపరి కాంగ్రెసు ఒక శక్తిగా రూపొందుతూ వచ్చినప్పటికీ, అది 1920 వరకు ఆంగ్ల గవర్నరుల అడుపాజ్ఞలలోనే నడుస్తుండడం వలన విరక్తి చెందిన జతిన్, సూర్యసేన్, కర్తార్‌సింగ్, భగత్‌సింగ్ మొదలయిన అనేక యువకులు టెర్రరిస్టు ఉద్యమంలో చేరిపోయారు. 1916-1918 మధ్య కాలంలో ‘హోంరూల్’ ఉద్యమం నడిచింది. ఖిలాఫత్ ఉద్యమం, 1920-22 కాలంలో అహింసాయుత సహాయ నిరాకరణోద్యమం, 1930-34 సంవత్సరాలలో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించబడినాయి. బ్రిటీషు వారి ద్విజాతి సిద్ధాంతం కాంగ్రెసులోని అతివాదులను, మితవాదులను సమైక్యపరచింది. హిందూ ముస్లిం సమన్వయానికి దోహదపడే విధంగా కాంగ్రెసు ఆనతిపై శ్రీమోతీలాల్ రూపొందించిన భారత రాజ్యాంగ చట్టాన్ని జిన్నా తిరస్కరించాడు.

1929 డిసెంబరులో జరిగిన కాంగ్రెసు మహాసభలో సంపూర్ణ స్వాతంత్ర్యమే కాంగ్రెసు లక్ష్యమని ఉద్ఘాటించాడు. జవహర్‌లాల్ నెహ్రూ గాంధీజీ నాయకత్వంలో ఒక ఉద్యమం తర్వాత మరొక ఉద్యమం నడుపుతూ, స్వాతంత్ర్య పోరాటాన్ని కాంగ్రెసు నాయకులు తీవ్రతరం చేస్తుంటే, చేరువ కాసాగారు ముస్లింలీగు నాయకులు.

## క్విట్ ఇండియా

1936 నుంచి వివిధ దేశాల మధ్య తలెత్తిన వివాదాల కారణంగా 1939 సెప్టెంబరులో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనది. అక్టోబరు 10న జరిగిన కాంగ్రెసు సమావేశం స్వాతంత్ర్యం సిద్ధిస్తేనే, యుద్ధంలో సహాయం చేసే విషయం ఆలోచిస్తామని ప్రకటించింది. అయితే, యుద్ధం ముగిశాకనే స్వాతంత్ర్య విషయం చర్చిస్తామన్నది ఆంగ్ల ప్రభుత్వం. ఫలితంగా 1939 నవంబరు 15 లోపల కాంగ్రెసు ప్రభుత్వాలన్నీ రాజీనామా సమర్పించాయి. మరోవైపు లాహోరులో 1942లో సమావేశమయిన ముస్లింలీగా సర్వస్వతంత్ర పాకిస్తాన్ కావాలని తీర్మానించింది. 1940 ఆగస్టు 8న వైస్రాయ్ చేసిన ప్రతిపాదన కాంగ్రెస్ ద్వారా తిరస్కరించబడినది.

1942లో యుద్ధం తీవ్ర రూపం దాల్చి మన తీర ప్రాంత నగరాలయిన కాకినాడ, విశాఖపట్టణాల మీద బాంబుల వర్షం కురిపించింది జపాన్. మార్చి 23న క్రిప్స్ రాయబారం విఫలమయింది. ఫలితంగా 'సేవాగ్రామ్ ఆశ్రమంలో 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తిని గాంధీజీ స్వాతంత్ర్య సమర యోధుల మస్తిష్కాలలో నాటాడు. ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తుల యిన నాజీలతో పోరాడుతున్నామని చెప్పే ఆంగ్లేయులు వెంటనే భారత భూమిని విడిచి వెళ్ళాలని పట్టుబట్టాడు.

1942 ఆగస్టు 8న కాంగ్రెసు 'క్విట్ ఇండియా' ఉద్యమానికి పిలుపునిచ్చింది. తెల్లవారేసరికి అనేక కాంగ్రెసు కార్యకర్తలను ప్రభుత్వం అదుపులోకి తీసుకుంది. వెలుపల ఉన్న ముస్లింలీగ్ నాయకులు రహస్య సమావేశాలు జరిపి యుద్ధంలో ఆంగ్లేయులకు తమ నైతిక సహకారం అందజేశారు. తద్వారా, వారు ఆంగ్ల ప్రభుత్వానికి ఆత్మీయులు, సన్నిహితులు అయి, వారి సహానుభూతిని పొంది పాకిస్తానును సాధించుకోగలిగారు. అదే సమయంలో నేతాజీ సుభాష్ చంద్రబోసు ఏర్పరచిన ఆజాద్ హింద్‌ఫౌజ్‌లో అందరికీ మత స్వాతంత్ర్యం, సమానహక్కులు ఏర్పడినాయి.

గాంధీజీని అలవాటయిన యరవాడ జైలులో కాకుండా ఈసారి ఆగాఖాన్ భవనంలో బంధించారు. గాంధీజీ 23రోజులు నిరాహారదీక్ష ప్రారంభిస్తే, ఆంగ్ల ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఆయన మరణిస్తే కావలసిన రహస్య దహన సంస్కారాల ఏర్పాటు కూడా చేసింది ప్రభుత్వం. గాంధీజీ జీవితంలో 2338 రోజులు జైలుజీవితం అనుభవిస్తే, అందులో 249 రోజులు దక్షిణ ఆఫ్రికా జైళ్ళలో మ్రగ్గాడు. ఆయనను 'తిక్కమనిషి'గా, 'మోసగాడి'గా భావించి తీవ్రంగా ఎదుర్కొన్న వారిలో బ్రిటీషు ప్రధాని చర్చిల్ ఒకడు. గాంధీజీకి ఆయన 'అర్ధనగ్న ఫకీరు' అని పేరు పెట్టాడు.

నాయకులను అరెస్టు చేసిన మరునాడే దేశంలోని మూల మూలలకు రహస్య సమాచారం అందింది. దేశంలోని అన్ని ప్రాంతాలలో ప్రజా నిరసన పెల్లుబికింది. ఆగస్టు 9న బొంబాయిలో పోలీసులపై రాళ్ళు, సోడాలు విసరగా పోలీసు కాల్పులలో ఎనిమిది మంది కార్యకర్తలు అశువులు బాశారు. కైరా, థానా, సతారా, సూరత్ ప్రాంతాలకు ఉద్యమం బాగా వ్యాపించి ఆగస్టు 15న గాంధీజీ అనుచరుడయిన మహాదేవ దేశాయ్ ఉద్యమంలో మరణించాడు.

సెప్టెంబరు 3న సతారాలోని జడ్జికి కార్యకర్తలు బలవంతంగా 'గాంధీటోపి'ని అలంకరింపచేశారు. మిడ్నపూర్, బలియా, కాశీ, ఢాకా, ఫరీద్‌పూర్, టాటానగర్‌లలో నిరసన ఉప్పెన పెల్లుబికి రవి అస్తమించని ఆంగ్లసామ్రాజ్య పీఠం దద్దరిల్లింది. సుమారు 250 రైల్వే స్టేషన్లను ధ్వంసం చేశారు. ఆ సందర్భంగా జరిగిన కాల్పులలో ఆరుగురు మరణించారు. చీరాలలో విద్యార్థులు స్టేషన్‌ను ధ్వంసం చేసి మెజిస్ట్రేట్ కోర్టును కొంత పడగొట్టారు. ఆ మరునాడు గుంటూరు గాంధీ పార్కులో విద్యార్థులు, యువకులు, వృద్ధులు వేల సంఖ్యలో సమావేశం కాగా, పోలీసులు జరిపిన కాల్పులలో ఇద్దరు యువకులు(వారిలో ఒకరు విద్యార్థి) మరణించారు. భీమవరం కార్యకర్తలు అక్కడి రెవెన్యూ డివిజనల్ అధికారి చేత బలవంతంగా కాంగ్రెస్ జండా పట్టించారు.

అనంతపురం, కడప, గుంటూరు, కృష్ణా, నెల్లూరు మొదలయిన ప్రాంతాలలో ప్రజావిప్లవం పొంగింది. నాయకులంతా చెరసాల పాలుకాగా, యువకులు, విద్యార్థులు విప్లవరథాన్ని నడిపారు. ఎందరెందరో కొత్త పెళ్ళికొడుకులు తెల్లదొరల తుపాకి తూటాలకు బలికాగా, నవ వధువుల పసుపుకుంకుమలు గంగపాలు అయినాయి. స్వాతంత్ర్య సమర యోధులను ఉత్తేజపరుస్తూ ఆంధ్రవనితలు...

"వీరగంధము తెచ్చినారము, వీరుడెవ్వరో తెల్పుడీపూసిపోతము మెడను సైతము, పూల దండలు భక్తితో.... అంటూ ఎన్నో దేశభక్తి గేయాలు ఆలపించారు.

'దేశభక్త' కొండా వెంకటప్పయ్య, 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం, 'దేశోద్ధారక' కాశీనాధుని నాగేశ్వరరావు, డాక్టరు పట్టాభి, 'మహర్షి' బులుసు సాంబమూర్తి, తెన్నేటి విశ్వనాథం, అయ్యదేవర కాళేశ్వరరావు, డాక్టరు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, కల్లూరి సుబ్బారావు, ఆచార్య ఎన్.జి.రంగా, నీలం సంజీవరెడ్డి, మంతెన వెంకటరాజు, కల్లూరి చంద్రమౌళి, కడప కోటి రెడ్డి, అల్లూరి సత్యనారాయణరాజు, వావిలాల గోపాలకృష్ణయ్య మొదలయిన నాయకులు జైళ్ళలో నిర్బంధింపబడినారు. ఈ సందర్భంగా మన్యం విప్లవం, జమీన్ రైతుల పోరాటం కొనియాడతగినవి.

1947 జూన్‌న లార్డ్ మౌంట్ బాటెన్ ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో "స్వాతంత్ర్యదినం ఎప్పుడు?" హఠాత్తుగా ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకు మౌంట్‌బాటెన్ మనసులో ఏవో లెక్కలు కట్టి "ఆగస్టు 15" అన్నాడు. ఆరోజు 'శుక్రవారం, మకర రాశి అత్యంత అశుభం' అని భావించిన నాయకులు స్వాతంత్ర్య ప్రదానం ఆగస్టు 15 ఉదయానికి బదులుగా 14 అర్ధరాత్రి జరుపుకున్నారు. 14వ తేది ఉదయం 9 గంటలకు జిన్నా కరాచీలో స్వాతంత్ర్య పతాకాన్ని ఎగురవేశాడు.

బ్రిటీషు సామ్రాజ్యవాదులు మనలను రెండు శతాబ్దాలు మానిస బ్రతుకులకు గురిచేశారు. శ్వేత జాతి చెప్పుచేతలలో మెలగటమే ఆనాడు మన విధి, గతి అయింది. ఎందరెందరో నాయకులు, కవులు, గాయకులు, చిత్రకారులు, మేధావులు, పత్రికాసంపాదకులు, యువకులు, విద్యార్థులు, నారీమణులు, స్వరాజ్య సంగ్రామంలో తమ తమ కర్తవ్యం నిర్వహించారు. విజ్ఞాపనలు విఫలంకాగా, చైతన్యవంతులయిన ప్రజలు ఆందోళనలు సాగించి, ఉద్యమాలు నడిపారు. నలుగురిలో ఊరు పేరూ లేక అజ్ఞాతంగానే ఉండి స్వరాజ్య ఉద్యమానికి సర్వవిధముల సహాయ సహకారాలందించిన మహనీయులు ఎందరో! సంతోషంతో ఉరికంబాలెక్కిన అమర జీవులెందరో!

అలనాటి వీరందరి త్యాగనిరతి, రక్తతర్పణ ఫలమే నేడు మనం అనుభవిస్తున్న స్వరాజ్యం.

*- పెనుమాక రమేష్, ఫ్యాకల్టీ సి.యన్.ఆర్.యమ్*

# ఆంధ్ర దేశంలో మూడు ముఖ్య పోరాటాలు

### 1. చీరాల - పేరాల ఉద్యమం

స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆంధ్రదేశంలో జరిగిన మూడు ప్రధాన శాసనోల్లంఘన కార్యక్రమాలు దేశవ్యాపమైన ప్రచారంలోకి వచ్చాయి.

1919లో చీరాలలో 15 వేల జనాభా మాత్రం ఉండేది. అప్పట్లో నాలుగేండ్ల నుండి స్థానిక ప్రజలు పన్నులు ఎక్కువ కావడం తప్ప ప్రయోజనం ఉండదని అందుకు వ్యతిరేకిస్తూ వచ్చారు. 1919లో బలవంతం మీద చీరాల-పేరాల గ్రామాలను మునిసిపాలిటిగా చేశారు.

ఆ రోజుల్లో పానుగల్లు రాజా శ్రీ రామారాయణంగారు మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి, స్వపరిపాలన శాఖ కూడా ఆయనే చూసేవారు. ముఖ్యమంత్రి చీరాలను సందర్శించినప్పుడు బహిరంగసభ జరుపలేక పోయారు. ప్రజాభిప్రాయం అంత వ్యతిరేకంగా ఉంది. ప్రజలు ఎంత మొత్తుకున్న మునిసిపాలిటి రద్దు కాలేదు. ప్రజలలో అసంతృప్తి హెచ్చింది. నాయకులు, ఉద్యమాలు ప్రజల అసంతృప్తి నుంచే పుడతాయి. సహాయ నిరాకరణోద్యమాన్ని చీరాలలో ప్రారంభించా లనుకున్నాడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య. పన్నులు చెల్లించకుండా చేశాడు. పంచాయతీలు పెట్టి ప్రజల తగాదాలు పరిష్కరింపజేశారు.

చీరాల రామదాసు అని పేరు పెట్టుకున్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య రామదండును ఏర్పాటు చేశాడు. రామదండులు కొలువు చెయ్యగా, రామనగరం అనే ఓ గ్రామం నిర్మించి అక్కడికి ఇరవై వేల మంది ప్రజలను తరలించుకుపోయాడు. రామనగరంలో పన్నులు లేవు. కోర్టులు లేవు. మునిసిపాలిటీ లేదు. అది రామరాజ్యం. నేత చీరాల రామదాసు భటులు రామదండు. హరికథలతో, భజనలతో, వినోదాలతో, తన అనర్గళవ్యాఖ్యాతో, ప్రజల్ని ఉత్సాహపరిచి, దేశ సంచారం చేసి, ఉపన్యాసాలిచ్చి, ధనం ఆర్జించి ఆ ప్రజల్ని పోషించాడు గోపాలకృష్ణయ్య.





బెజవాడ ఏ.ఐ.సి.సి.కి వచ్చిన మహాత్మాగాంధీని ఆంధ్రరత్న దుగ్గిరాలకు ఆహ్వానించారు. ఊరి వెలుపల తాటియాకుల పాకలు నిర్మించిన స్థలంలో రామ్‌నగర్‌కు 1921 ఏప్రిల్ 7 న గాంధీజీ శంఖుస్థాపన చేశారు. అప్పటికే ఇటు పన్నులు చెల్లించలేదనే నేరం మోపి 13 మందిని ప్రభుత్వం అరెస్టు చేసింది. వారిలో ఒక సామాన్య మహిళ కూడా ఉంది. శాసన ధిక్కారం చేసి జైలుకెళ్ళిన మొదటి మహిళ ఆమె.

నిషేధాజ్ఞలను ఉల్లంఘించి బరంపురం ఆంధ్ర మహాసభలకు వెళ్ళిన గోపాలకృష్ణయ్యను రూథర్‌ఫర్డ్ అరెస్టు చేశాడు. రెండు సంవత్సరాల శిక్ష విధించబడింది. నాయకుని కోల్పోయిన ప్రజలు ఆర్థిక చిక్కులతో, నిరుద్యోగంతో నానాబాధలు పడసాగారు. ప్రభుత్వ దమననీతి పరాకాష్టకందుకున్నది. రౌడీలచే గుడిసెలు తగుల పెట్టించడం జరిగింది. ఒక మహాసాగరంలో చిన్న ద్వీపకల్పంగా ఉంది.

1922 ఫిబ్రవరి దాకా 11 నెలలు ఒంటరిగా ఉద్యమం కొనసాగి ంచారు. చౌరీచౌరా దురంతాలు జరిగినవి. మహాత్ముడు సహాయ నిరాకరణను ఉపసంహరించారు. ప్రజలు రామ్‌నగర్ ఖాళీ చేసి మరల చీరాల యథా స్థానాలకు చేరుకున్నారు చీరాల పుర నిర్గమన శాసనోల్లంఘన ఉదంతం స్వరాజ్యం కోరే ప్రజలనెంతో ఉత్సాహం పరిచింది. ఆంధ్రులకు నేటికి గర్వకారణంగా నిలిచింది.

### 2. పల్నాటి పుల్లెర సత్యాగ్రహం

పల్నాటిసీమ వీరులకు జన్మభూమి కారంపూడి కదనరంగంగా పల్నాటి చరిత్ర ప్రసిద్ధకెక్కినది. పల్నాటి పశువులు, ప్రజలు కూడా దృఢకాయులు. స్త్రీలు కూడా ఆజానుబాహురాండ్రు. పురుషలతో సమానంగా పనిచేస్తారు.



పల్నాటి తాలూకా చుట్టుపట్ల దట్టమైన అడవులు, చిట్టడువులు ఉండేవి. ప్రఖ్యాతిగాంచిన పల్నాటి పశువులు ఆ అడవుల్లో మేసేవి. మేసినందుకు 'పుల్లరి' అనే సుంకం చెల్లించే వారు ఆసాములు. సుంకాలు ఉన్న చోట అధికారులు తప్పరు. అధికార్లు ఉన్నచోట సర్కారు పన్నులే గాక ఉద్యోగుల మామూళ్ళు కూడా ఒక సంప్రదాయమే. ఈ మామూళ్ళతో అధికారులు, ఆసాముల మధ్య తగాదాలు వచ్చాయి. అది చిలికి చిలికి గాలి వానగా మారి ఆసాములు అసలే పన్నులు చెల్లించమన్నారు. గాంధీజీ శాసనధిక్కార కార్యక్రమం వారి చెవిలో పడింది.

రెవెన్యూ ఫారెస్టు ఉద్యోగులపై ప్రజలు సాంఘిక బహిష్కరణను విధించారు. అధికార్లకు చాకళ్ళు, మంగళ్ళు పనిచేయలేదు. దుకాణదారులు చిల్లర వెచ్చాలు యివ్వలేదు. హోటళ్ళవారు తిండి పెట్టలేదు. మకాం చేసిన జిల్లా కలెక్టరుకు, పోలీసు సూపరింటెండెంటుకు కూడా పాలు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఎక్కడవారక్కడ బంద్ చేశారు. అధికార్లపై సాంఘిక బహిష్కరణ పూర్తి విజయం సాధించారు.

పరిస్థితులను విచారించేందుకు గుంటూరు జిల్లా కాంగ్రెసు సంఘం ఉన్నవ లక్ష్మీనారాయణ, మాడభూషి నరసింహాచారిని పల్నాడు పంపింది. వారి ప్రవర్తనకు హామీ కావాలని అధికార్లు నోటీసు జారీ చేశారు. అందుకు వారు తిరస్కరించారు. నాయకులను ప్రజలు తప్పెట్లతో బ్రహ్మాండమైన ఊరేగింపు జరిపి అధికార్ల దురహంకారానికి సమాధానం ఇచ్చారు. పుల్లరిని చెల్లించక మానివేశారు. రూథర్‌ఫర్డ్ లాంటి చండశాసనుడు 'There is Swaraj in Palnad' (పల్నాడులో స్వరాజ్యం ఉంది) అనక తప్పలేదు. ఇద్దరు నాయకులకు ఒకో సంవత్సరం జైలు శిక్ష విధించి రైలులో గుంటూరుకు పంపించారు. ఈ వార్త తెలిసి గుంటూరు జనమే గాక, ప్రక్క వూళ్ళ ప్రజలు కూడా రైలు వచ్చే సమయంలో రైలు స్టేషన్ దగ్గర మూగి పోయారు. కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ భార్య లక్ష్మీబాయమ్మ, కోలపెన్న రామకోటేశ్వరరావులు స్టేషను దగ్గర కలిశారు. ఖైదీగా దిగిన భర్తను చూసి లక్ష్మీబాయమ్మ ధైర్యంగా రైలు ప్లాటుఫారం మీదికి వచ్చింది. ఒక్కసారిగా ప్రజలంతా నాయకులకు జేజేలు పలికారు. లక్ష్మీబాయమ్మ తన చేతిలో వున్న పూలదండను భర్త లక్ష్మీనారాయణ మెడలో వేసింది. ఆయనకు వీరతిలకం దిద్దింది. "మీరు నడిపించిన ఉద్యమాలను మీ భార్య నడిపించడానికి అనుమతి ఇవ్వండి" అని కోరింది.



ప్రజలు పుల్లరిని చెల్లించకనే పశువులను అడవుల్లో మేపుకొన సాగారు. గవర్నమెంట్ గార్డ్లు, వచర్లను హెచ్చరిక చేసి నిర్బంధ విధానాన్ని అమలు జరిపింది. ఇది ప్రజలను యింకా ఉద్రిక్తపరిచింది. అటవీ శాసనాలను ఉల్లఘించవద్దని కాంగ్రెసు నాయకులు విజ్ఞప్తి చేశారు. ఐనా, ప్రజలు ఘనంగా శాసనోల్లఘనం కొనసాగించారు. ప్రజలకు గార్డు వచర్ల మధ్య సంఘర్షణలు జరిగేవి. రామాపురం, జెట్టిపాలెం, మించాలపాడు మొదలగు అనేక ప్రాంతాలలో పోలీసు కేంద్రాలేర్పరచి ప్రజలపై విచ్చలవిడిగా దాడులు సాగించారు.

ఉన్నవ లక్ష్మీనారాయణ, మాడభూషి నరసింహాచార్యుల ఖైదు శిక్షతో పల్నాడు అడవి సత్యాగ్రహం ఆగిపోలేదు. మించలపాడు కాపురస్థుడైన కన్నెగంటి హనుమంతు నాయకత్వం వహించి, ప్రభుత్వాన్ని ధిక్కరించి రైతుల్ని పురికొల్పి పన్నులు కట్టకుండా పశువుల్ని అడవుల్లో మేపించాడు. సాయుధ పోలీసుదళాలు భయపెట్టిన దడిసిపోక పల్నాటి రైతులు అడవి సత్యాగ్రహం కొనసాగించారు. దీనితో వున్న - ప్రభుత్వం లేనట్లే అయినా అధికారులు ఏమీ తోచక కుట్రపన్నారు. హన్మంతుని డిప్యూటీ కలెక్టరు గారు మాట్లాడటానికి పిలుస్తున్నారని చెప్పి రప్పించారు. హనుమంతు నిజమేననుకొని మించల పాడు నుంచి డిప్యూటీ కలెక్టర్ మొకం కొల్లిగొట్లకి నడచి వెడుతున్నాడు. దారిలో ముప్పై మంది పోలీసులు వొంటరివాణ్ణి చేసి అతని మీద తుపాకులు కాల్చారు. అభిమన్యుడి వలె హనుమంతు కూలి పోయాడు. నేలమీదపడి, గాయాలలోంచి రక్తం వరదలై పారుతూ, యమయాతన పడుతూ 'దాహం, దాహం' అని అరిచినాడు. ఒక హెడ్‌కానిస్టేబుల్ తన మూత్రం ఆ



మహావీరుడి నోట్లో పోశాడు, ఆ అమానుషకృత్యం అనుభవించి 1922 ఫిబ్రవరి 6న కన్నెగంటి హనుమంతు ప్రాణాలు అర్పించాడు. ప్రజలు ఆ శవాన్ని ఊరేగించి, రోడ్డు ప్రక్కన సమాధిచేసి ఒక రాతిపలక మీద అతని పేరు చెక్కారు. ఇది ఆధునిక పల్నాటి వీరభారతం.

మరుసటిరోజు జిల్లా కలెక్టరు పోలీసు బలంతో వెళ్లి మించలపాడు చుట్టుప్రక్కల 28 మందిని అరెస్టు చేయించాడు. అందులో 9 మంది స్త్రీలను కూడా నిర్బంధించారు. అయినా ఏడాదిపాటు పర ప్రభుత్వం ఆధిపత్యాన్ని సాగించారు. ఆంధ్రదేశ స్వాతంత్ర్యోద్యమంలో పల్నాటి పుల్లరి సత్యాగ్రహం సువర్ణాక్షరాలతో లిఖించదగిన మరో ఘట్టం.

### 3. పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం

స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశవ్యాప్తంగా గొప్ప సంచలనం కలిగించింది. పర్వతనేని వీరయ్య చౌదరి నాయకత్వంలో శాంతియుతంగా జరిగిన పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం.

1921 నాటికి సహాయ నిరాకరణోద్యమం గాంధీజీ ఆదేశించిన దేశవ్యాప్తం కాలేదు. మహాత్ముడు చివరి అస్త్రం ప్రయోగించాడు. ఆ అస్త్రమే పన్నుల నిరాకరణ. ఈ కార్యక్రమాన్ని డిసెంబరులో అహ్మదాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సభ ఆమోదించింది. దీనికి గాంధీజీ కొన్ని షరతులు విధించారు.



ఉద్యమం దేశవ్యాప్తంగా జరగకూడదు. పదునైన ప్రాంతంలో ఖద్దరు కట్టిన చోట, అంటరానితనం విడనాడిన చోట, తాగుడు మానినచోట, అంతా శాంతిప్రియులే ఉన్న చోట ప్రయోగ మాత్రమే ప్రారంభించాలన్నాడు. ఏ రాష్ట్రంలో ఎక్కడ ప్రారంభించాలో ఆయా రాష్ట్ర కాంగ్రెసు కమిటీలు నిర్ణయించాలి. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ గుంటూరు జిల్లాను ప్రత్యేకించింది. గుంటూరు జిల్లాలో ఎక్కడ అమలు జరపాలో జిల్లా కమిటీకి విడిచిపెట్టారు. ఈ కమిటీ నిర్ణయం తీసుకునేందుకు పొన్నూరులో సమావేశం కావడానికి నిర్ణయించింది. పొన్నూరు సభను ప్రభుత్వం నిషేధించింది. అయినా జరిగింది. పెదనందిపాడు ఫిర్కాలో ప్రారంభించాలని తీర్మానం జరిగింది. సభ కాగానే నాయకులు



గొల్లపూడి సీతారామశాస్త్రి, మద్ది రాధాకృష్ణయ్య వంటి నాయకులను బంధించి గుంటూరుకు తీసుకుపోయి శిక్షించి, వేలూరు జైలుకు తరలించారు. రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు కొండా వెంకటప్పయ్య అప్పుడే అహ్మదాబాద్ నుంచి వచ్చి జబ్బుతో లేవలేని స్థితిలో ఉన్నారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, వేదాంతం నరసింహాచార్యులు జైల్లో ఉన్నారు.

ముందుకు వచ్చే పెద్ద నాయకులెవరూ లేదు. ఆ తరుణంలో పెదనందిపాడు ఫిర్కానాయకుడు పర్వతనేని వీరయ్య చౌదరి ఈ ఉత్క్రృష్ట కార్యక్రమం చేపట్టాడు. వీరయ్య చదువరికాదు. ఏదో గ్రామీణ విద్య నేర్చుకున్నాడు. ధైర్యం కలవాడు. ఆజానుబాహుడు.

అంతకుమునుపే మాచిరాజు రామూర్తి, వీరయ్య చౌదరి కలిసి తాలూకా అంతటా తిరిగి కరణం, మునసబు, వెట్టి, మోతాదులతో సహా వంద గ్రామాలలో గ్రామోద్యోగులు తమ పదవులకు రాజీనామా ఇచ్చేటట్టు చేశారు.

ఆ రోజుల్లో జస్టిస్ పార్టీకి వారికి సరుకులు అమ్మకూడదు. శాంతి సైనికులు వస్తేనే కాని ఏమి ఇవ్వరాదని కట్టడి చేశారు. ఇంటి నెంబర్లు అందరూ తుడిచివేశారు. ఆ ప్రకారం వంద గ్రామాల ప్రజలు చేశారు.

ఆ విధంగా గ్రామోద్యోగులు మూకుమ్మడిగా రాజీనామాలు ఇచ్చిన ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం అంతరించినట్లు కనిపించింది. అది శిస్తు వసూలు చేయవలసిన సమయం. ఏ విధంగా వసూలు అవుతుంది శిస్తు? కరణం, మునసబు, వెట్టి మోతాదు అందరూ రాజీనామా చేశారు. ఏమీ తోచక ప్రభుత్వంవారు రికార్డులను స్వాధీనపరచుకున్నారు. కొత్తవారిని నియమించారు. అయితే ఏ పట్టా ఎవరిదో, ఏ మనిషి ఎవరో తెలియదు. వూళ్ళ ఈద ప్రభుత్వం సైన్యాన్ని దింపింది. ప్రజలు శాంతి సైన్యాన్ని సమకూర్చుకున్నారు.

ఆ రోజుల్లో ఎవరు గ్రామాల పర్యటనకొచ్చిన సమాధానాలిచ్చేవారు కాదు. ఒకసారి జిల్లా కలెక్టరు రూథర్‌ఫర్డ్ గ్రామానికొచ్చాడు. 'ఇక్కడ బ్రిటిష్ సైన్యం ఉండాలి. పెదనందపాడు ఇదేనా?' అని ప్రతి వ్యక్తిని అడిగాడు. సమాధానం రాలేదు. చిన్న పిల్లలపైన



గాంధీ స్మృతి భవనం

సమాధానమివ్వకపోవడంతో కలెక్టరుకు గంగా వెర్రు వెళ్ళింది. రికవరీ చట్టం చేయించాడు. చట్టమయితే వచ్చింది. అమలుపరచడమెట్లా? కనుక కనిపించిన ఆస్తినల్లా తీసుకుపోవడం ప్రారంభించారు. అయితే స్వాధీనం చేసుకున్న వాటిని మోసుకుపోవడానికి కూలీలు దొరకరు.

ఇంత తీవ్రమైన ఉద్యమం పెదనందిపాడు ఫిర్కాలో జరుగుతుంటే కాంగ్రెసు పార్టీ వారు ఒక్కరైన ఆ ప్రాంతానికి వచ్చిన పాపానపోలేదు. ఒకసారి నడింపల్లి నరసింహారావు, మరొకసారి గొల్లపూడి సీతారామశాస్త్రి తప్ప మిగిలిన కాంగ్రెసు వారెవరూ అటు ప్రక్కకు తిరిగి చూడలేదు. కానీ ఆనాటి ఉద్యమం కాంగ్రెసు పార్టీలో పదువుల కోసమో, లేక పేరు కోసమో జరిగింది కాదు. అందులోని ప్రతివ్యక్తి నిస్వార్థబుద్ధితో పర ప్రభుత్వ ఉద్యమ రీతిని వ్యతిరేకించి ప్రజాక్షేపాన్ని సాధించడమే కనుక కాంగ్రెసు సహకరించకపోయినా ఉద్యమ తీవ్రత దినదినాభివృద్ధి పొందింది.

ఈ విధంగా ఉద్యమం జరుగుతున్న రోజుల్లో గుంటూరులో రాష్ట్ర కాంగ్రెసు కార్యవర్గ సమావేశం జరిగింది. దానికి హాజరు కావలసిందిగా ఉద్యమ నాయకులను కోరారు. వారు బైల్దేరబోతుండగా కాంగ్రెస్ వారు శిస్తూలు చెల్లించమని కోరితే ఆ తీర్మానాన్ని అంగీకరించవద్దని కట్టడి చేసి పంపేరు.

ఈ సందర్భంలోనే జరగవలసిన ముఖ్య సంఘటన జరిగింది. ఆ సమావేశానికి హాజరైన వారిలో టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య కూడా ఉన్నారు. సమావేశం ప్రారంభమైంది. అప్పుడు పట్టాభిగారు, వెంకటప్పయ్య గారితో 'పెదనందిపాడు అన్ని విధాలా తయ్యారవనిదే ఎట్లా పన్నుల నిరాకరణకు అనుమతించర'ని నిలదీశారు. దానికి వెంకటప్పయ్యనీ, వీరయ్య చౌదరినీ సమాధానం చెప్పమని అడిగారు. వెంటనే వీరయ్య చౌదరి లేచి, "అయ్యా! పట్టాభిగారు! తమరు ఏలూరులో పన్నుల నిరాకరణోద్యమంకు అనుమతించరు కదా! ఏ విధంగా ఉద్యమంగా ఉన్నదని ఏలూరుని అనుమతించారు" అని ఎదురుప్రశ్న వేయగానే గతుక్కుమన్నారు పట్టాభి.

ఆ సందర్భంలో భారత జాతీయ స్వాతంత్ర్య సమరసేనానిగా పరిగణింపబడుతుంది. మహాత్మాగాంధీ పంపిన లేఖలు చకితుల్ని చేశాయి. గాంధీజీ ఈ విధంగా రాశారా అనే సంశయం కలిగించింది.

'నా బాధ్యత ఎంత మాత్రమూ లేదు. మీ బాధ్యతతో మీరు ఉద్యమం నడిపితే సంతోషిస్తాను' అని ఆ లేఖలో మహాత్ముడు రాశాడు. దీనితో సభలో ఉన్న ఎక్కువమంది శిస్తులు చెల్లించమే తగునని అభిప్రాయానికి వచ్చారు.

ఈ విధంగా ఇక్కడ వుండగా మహాత్ముడు బార్డోలీలో పన్నుల నిరాకరణోద్యమం సాగించారు. బార్డోలీలో ఉద్యమం ప్రారంభం అయిందో లేదో చౌరాచౌరీలో దౌర్జన్యం జరిగింది. ఇరవై ఇద్దరు పోలీసువారని ప్రజలు చిత్రవధ చేశారు. దీనితో గాంధీజీ పన్నుల నిరాకారణోద్యమం ఆపివేశారు. వ్యక్తిగా, సమిష్టిగా శాసనోల్లంఘనం చేయరాదని తీర్మానించారు. ఈ వార్తలన్నీ ఒక్కొక్కటే ప్రజలకు అందుతున్నాయి. గ్రామోద్యోగులందరూ మళ్ళీ వారివారి పనులలో ప్రవేశించారు. ప్రజలు పన్నులు చెల్లించారు. ఈ విధంగా మళ్ళీ ప్రభుత్వానికి బలం చేకూరింది. వెంటనే నీతికి దూరమైన బ్రిటిషు ప్రభుత్వం ఆయా గ్రామాలలో ఉన్న నాయకులను నిర్భందించి, ప్రజలను హింసించడం ప్రారంభించింది.

పెదనందిపాడులో ఉద్యమం ఆపుచేసి పన్నులు చెల్లించబోతున్న రైతుల మీద విరుచుకపడింది ప్రభుత్వం. జప్తులతో, వారంట్లతో, శిక్షలతో వారిని యిబ్బందులలో ఇరికించాలి. వీరయ్య చౌదరిని బంధించారు. రైతులకు సలహాలివ్వడానికి వచ్చిన వెంకటప్పయ్య మీద కేసు బనాయించి, అరెస్టుచేసి, శిక్ష వేసి కడలూరు జైలుకి పంపించారు.

చీరాల-పేరాల ఉద్యమం, పల్నాడు అడవి సత్యాగ్రహం, పెదనందిపాడు పన్నుల నిరాకరణ - అన్నీ గాంధీ ఉద్యమంలోని ముఖ్యమైన భాగాలే. అన్నీ గుంటూరు జిల్లాలోనే జరిగినవి. పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమ తీవ్రతను గమనించిన మద్రాసు గవర్నరు లార్డ్ వెల్లింగ్టన్ 'That shook the British Empire in India to its very roots' అని అన్నాడు.

*- జి.వి. రామారావు*




# పర్యావరణ స్నేహితం - పగిడిపల్లి గ్రామం

ప్రగతికి సూచికలాగా పెద్దపెద్ద బంగళాలు లేకపోయినా పర్యావరణానికి, పారిశుధ్యానికి ఆ ఊరు పెట్టింది పేరు. అదే పగిడిపల్లి గ్రామ పంచాయితీ. నల్లగొండ జిల్లా భువనగిరి మండలంలోని పగిడిపల్లి గ్రామం హైద్రాబాద్ - వరంగల్ జాతీయ రహదారిలో హైద్రాబాద్‌కు 40 కి.మీ., భువనగిరికి 7 కి.మీ దూరంలోఉంది. 950 మంది జనాభాతో వ్యవసాయ ప్రధానమైన జీవనాధారం కలిగి నేటి పల్లె ప్రాంతాలకు ఆదర్శవంతమైన గ్రామంగా ఉన్నది. గ్రామ ప్రజలు ఐకమత్యంతో ఉండి 2006లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్‌ను, 7 మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇంటి పన్ను, నీటిపన్ను, విద్యుత్ బిల్లులను క్రమం తప్పకుండా చెల్లిస్తూ ప్రభుత్వం నుండి సేవలను కూడా అలాగే పొందుతున్నారు. గ్రామం మొత్తం 100% సిమెంట్ కాంక్రీట్ రోడ్లు (సి.సి. రోడ్లు). రోడ్లకు ఇరువైపులా డ్రైనేజ్ వ్యవస్థ, వీధులలో పబ్లిక్ నల్లాలను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామప్రజల సహకారంతో గ్రామపంచాయతీ పైవాటిని సక్రమంగా నిర్వహించడం జరుగుతున్నది. ప్రజల సహకారం, క్రమశిక్షణ ఉన్న గ్రామాలను మరింత అభివృద్ధి చెందించాలన్న ప్రభుత్వ సంకల్పంతో భారతదేశంలోనే మొట్టమొదటి 'లెడ్ క్యాంపెయిన్ విలేజ్' అనే పథకం ఆ గ్రామానికి ఒక వరంలాగా అందివచ్చినది.

### "లెడ్ క్యాంపెయిన్ విలేజ్" విశేషాలు

- బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ, మినిస్ట్రీ ఆఫ్ పవర్, నెడ్ క్యాప్ వారి సౌజన్యంతో.
- చిన్న తరహా సుస్థిర మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి నిర్వహణలో ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతున్నది.
- దేశంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించేందుకు LED (Light Emiting Daiode)ను దేశంలోనే ప్రథముగా ఈ గ్రామంలో ప్రారంభించారు.
- వందల సంవత్సరాల నుండి భూగర్భ వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్ వంటి వాటితో కాకుండా సోలార్ ఎనర్జీతో నడిచే వీధి దీపాలను గ్రామంలో ఏర్పాటుచేశారు.

### లెడ్ ఇంటి లైట్ల ఉపయోగాలు

- గ్రామంలో ప్రతి ఇంటికి 2 చొప్పున మొత్తం 360 ఇంటి లైట్లని ఇవ్వడం జరిగింది.
- సాధారణంగా మనం ఇంటిలో వాడే 40 వాట్స్ ఫిలమెంట్ బల్బు తీసుకొనే విద్యుత్‌లో 5 లెడ్ బల్బులు లెడ్ బల్బులు వెలుగుతాయి.
- మెరుగైన కాంతి
- విద్యుత్ బిల్లు తగ్గుదల
- కాలుష్య రహిత పరిసరాలు
- వేడిమిలేని చల్లని పరిసరాలు



- చిరకాలం మన్నే ఇంటి దీపాలు
- అత్యాధునిక పరిజ్ఞానం
- లెడ్ బల్బు యొక్క జీవితకాలం 50,000 గంటలు
- మూడు సంవత్సరాల గ్యారంటీ
- మరమత్తులతో మళ్ళీ వినియోగం

### సౌర శక్తితో నడిచే వీధి దీపాల విశేషాలు

- గ్రామంలో మొత్తం 63 సౌర శక్తితో నడిచే వీధి లైట్లని ఏర్పాటు చేశారు. ఇవి పూర్తిగా సౌరశక్తితో వెలుగుతాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు సూర్యకిరణాలను ఆస్వాదించటం ద్వారా ఈ దీపాలు విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకొంటాయి. చీకటి పడటంతో వాటి అంతట అవే ఆటోమేటిక్‌గా వెలుగుతాయి. సూర్యోదయంతో వెలుతురు రాగానే ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి.
- లెడ్ ఇంటి లైట్లు, సూర్య శక్తితో నడిచే వీధి లైట్ల ప్రాజెక్ట్ వ్యయం 15 లక్షల రూపాయలు. పూర్తిగా ప్రభుత్వమే చెల్లించింది.

### ప్రాజెక్ట్ వలన లాభాలు

1) ప్రాజెక్ట్ వలన గ్రామంలో ఒక్క సం.లో 50,000 యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుంది.
2) ఆదా చేయబడిన మొత్తం రూ. (3.5 రూ. యూనిట్‌కు) రూ. 1,70,000 రూ. సం॥రానికి.
3) కర్బన ఉద్గారాల తగ్గింపు 40,000 కేజీలు / 40 టన్నులు ప్రతి సంవత్సరానికి.

- ఎస్ క్యూబ్ ఐ.డి.ఎఫ్ అనే స్వచ్ఛంద సంస్థ, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది.
- లో వోల్టేజ్, విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలలోని ప్రజలు కోరుకుంటే 90% సబ్సిడి అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని సాంప్రదాయేతర ఇందన వనరుల మంత్రిత్వశాఖ సెక్రటరీ దీపక్ గుప్తా తెలియజేశారు.
- పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, సహజ వనరులను వినియోగిస్తూ బావితరాల మానవ మనుగడకు మన వంతు కృషి చేద్దాం.

*- బండి లింగారెడ్డి*

డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ (డి.ఆర్.పి) శిక్షణా విభాగం, జి. ప్ర. ప. నల్లగొండ



# – ఓ గొప్ప కన్నుల పండుగ







అలెప్పి చరిత్రలో భాగంగా యుద్ధం కోసం ప్రారంభమైన ఈ పాము పడవలు ఇప్పుడు పందాలలో పాలుపంచుకుంటున్నాయి. కేరళలో జరిగే పాము పడవ పందాలు ఎంత ప్రాచుర్యం పొందాయంటే, వీటిని చూడటానికి ప్రపంచం నలుమూలల నుంచి టూరిస్టులు కేరళకు క్యూ కడతారు.

400 సంవత్సరాల క్రితం పాము పడవలను యుద్ధంలో భాగంగా వాడేవారు. అలెప్పి, ఆ చుట్టు పక్కల ప్రాంతాల రాజులు పరస్పరం యుద్ధాలు, దాడులు చేసుకునేవారు, అలెప్పి ప్రాంతమంతటా, ఆ చుట్టూ పక్కల విస్తరించే ఉండే సరస్సుల్లో యుద్ధం అంటే, ఎక్కువగా పడవల్లోనే సాగేది.

ఒకసారి ఒక రాజు యుద్ధంలో తీవ్రంగా నష్టపోయాడు. తనకు మంచి పడవ తయారు చేసి ఇవ్వాలని పడవ తయారీదారులను ఆదేశించాడు. తత్ఫలితంగా పాము పడవ ఆవిర్భవించింది. యుద్ధంలో ఈ పాము పడవ ఆ రాజుకి మంచి విజయాన్నందించింది.











# పాము పడవ పందాలు -

కేరళ అనగానే కొబ్బరిచెట్లు, అందమైన సముద్రతీరం, బ్యాక్ వాటర్స్, ఎటు చూసినా తరగని పచ్చదనం గుర్తొస్తుంటాయి. వీటితో పాటే మరో గుర్తొచ్చే అంశం పాము పడవ పందాలు, వానాకాలం వచ్చిందంటే చాలు - పాము పడవ పందాలకు సిద్ధమవుతుంటారు కేరళ వాసులు. ఈ పందాలు జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జోరుగా సాగుతుంటాయి.

పాము పడవ పందాలలో నాలుగు ప్రధానమైనవి కాగా, మరో 15 వరకు సాధారణమైన పందాలు జరుగుతుంటాయి. అలెప్పి జిల్లాల్లోనూ, ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లోని సరస్సుల్లో ఈ పందాలు జరుగుతుంటాయి.





## పందాలలో మహిళల జట్టు

గత ఏడాది ఆగస్టు 8వ తేదీన జరిగిన నెహ్రూ ట్రోఫీ పాము పడవ పందెం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, యుపిఎ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ ఈ పందాలకి ఒక ప్రధాన ఆకర్షణ అయ్యారు. అమే కాక, కేంద్రమంత్రులు శ్రీమతి అంబికా సోనీ, కుమారి సెల్జా, అప్పటి కేంద్రమంత్రి శ్రీ శశిథరూర్ కూడా హాజరయ్యారు.

ఈ 57 వ నెహ్రూ ట్రోఫీ పాము పడవ పందాలలో 30 మంది సభ్యులు కలిగిన మహిళల జట్టు పాల్గొని పందాలకు వన్నె తెచ్చింది. ఈ 30 మందిలో 9 మంది విదేశీ వనితలు. పున్నమడ సరస్సులో ఈ పందాలు జరిగాయి.



వల్లమ్, వెప్పు వల్లమ్ (వైపు వల్లమ్), వడక్కనోడి వల్లమ్, కొచ్చు వల్లమ్.. అని రకరకాల పడవలు వివిధ పందాలలో దర్శనమిస్తాయి. అన్నిటిలో ఆగస్టు రెండవ శనివారం నాడు జరిగే నెహ్రూ ట్రోఫి పాము పడవ పందెం ప్రధాన టూరిస్టు ఆకర్షణ.

ఈ పందెంలో గెలిచిన వారికి ఇచ్చే రోలింగ్ ట్రోఫీ పాము పడవ ఆకారంలో వెండితో ఉంటుంది. దాన్ని ఒక్క చెక్కపై చెక్కి అందంగా తయారు చేస్తారు. దానిపై 'ట్రావెన్ కోర్- కొచ్చిన ప్రజల అద్వితీయ అలవాటు అయిన పడవ పందెంలో గెలిచిన వారికి' అనే వాక్యం చెక్కి ఉంటుంది.

'ఆంజిలి తడి' అని మళయాళీ భాషలో వ్యవహరించే అటవీ కలపతో 100-120 అడుగుల పొడవాటి పాము పడవలను తయారు చేస్తారు. 90 నుంచి 110 మంది వరకు తెడ్డు వేస్తుంటారు. ఇది కేరళ కాలువల్లో ఒక పాములాగానే కదులుతుంటుంది. ఈ 'చుందన్ వల్లమ్' (పాము పడవ)కి 'ఆటలకు వాడే అతి పెద్ద జలసాధనం' అనే ప్రపంచ రికార్డు కూడా ఉంది. ఎక్కువ మంది ఒక బృందంగా, జట్టుగా పాల్గొనే ఆటగా కూడా పాము పడవ పందాలకు రికార్డు ఉంది. సాధారణంగా, ఒక పాముపడవలోని బృందంలో నలుగురు నాయకులు, 25 మంది గాయకులు, 100 నుంచి 125 మంది తెడ్డు వేసేవారు ఉంటారు. గాయకుల పాట (వంచి పట్టు)లోని రిథమ్‌కి తగినట్టుగా, అనుగుణంగా వీరు తెడ్డు వేస్తూ ముందుకు పడవను ఉరికించటం చూపరులకు చాలా ఉత్సాహం కల్గిస్తుంది. ప్రేక్షకులు కూడా వివిధ జట్లకు ఉత్సాహం కల్గిస్తూ, అరుస్తూ ఉంటారు.

నదులు, కాలువలు, ఒడ్డు వెంబడి కొబ్బరిచెట్లు, నీళ్లలో వేగంగా, హుషారుగా పరుగెత్తే పాము పడవలు, పాటలు, సంగీతం, అరుపులు, చూసే ప్రేక్షకుల ఆనందం, కేకలు... ఈ దృశ్యాలను చూసి తరించాలే కాని, ఎంత వర్ణించినా తక్కువే.

*- టి. సురేష్ కుమార్*







ఆ రాజు ప్రత్యర్థి గూఢచారులను పంపాడు- పాము పడవను ఎలా తయారు చేశారో తెలుసుకుని రమ్మని. కాని ఎంత ప్రయత్నించినా తెలుసుకోలేక పోయారు. ఎందుకంటే పాము పడవలను తయారు చేయటం అంత తేలికేమీ కాదు మరి. తరువాత, తరువాత పాము పడవలు తయారు చేసే కళ వ్యాప్తి చెంది, ఇప్పుడు ఆ ప్రాంతంలో జోరుగా పాము పడవ పందాలు జరిగే స్థాయికి వెళ్లింది.

పాము పడవలనగానే, ఇదేదో పాముల వ్యవహారమని భయపడనక్కరలేదు. ఆ పడవల ఆకారం అచ్చం పాము రూపంలో ఉండటం వల్లనే వాటికా పేరు వచ్చింది. మళయాళీ భాషలో దీన్ని



'చుందన్ వల్లమ్' అంటారు. ఇవి 100 నుంచి 120 అడుగుల పొడవుంటాయి. 100 మంది వరకు తెడ్డు వేసే వారుంటారు. అలెప్పి ప్రాంతంలోని ప్రతి గ్రామానికీ ఇప్పుడు ఒక పాము పడవ ఉంది. తమ పాము పడవను చూసుకుని వారు గర్వపడతారు కూడా. ప్రతి ఏటా గ్రామంలోని వారంతా గుమిగూడి, కాలువలు, నదులు, సరస్సుల్లో తమ తమ పాము పడవలతో పందాల్లో పాల్గొనటానికి సిద్ధమవుతారు.

ఈ పడవ పందాలలో నెహ్రూ ట్రోఫీ పాము పడవ పందెం ముఖ్యమైంది. ప్రతిఏటా ఆగస్టు రెండవ శనివారం నాడు దీన్ని నిర్వహిస్తుంటారు. దేశ దివంగత ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్మారకార్థం ఇది జరుగుతుంటుంది.

1952లో నెహ్రూ అలెప్పిని సందర్శించినప్పుడు, ఆయనకు స్వాగతం చెప్పటంలో భాగంగా అప్పటికప్పుడు ఒక పాము పడవల పందాన్ని నిర్వహించారు. తనకు లభించిన స్వాగతానికీ, ఆ పాము పడవ పందెం జరిగిన తీరుకీ ఉప్పొంగిపోయిన నెహ్రూ ఒక రోలింగ్ ట్రోఫీని ప్రదానం చేశారు. ఇక ఆనాటి నుంచి ఆయన స్మారకార్థం నెహ్రూ ట్రోఫీ పేరిట పాము పడవ పందెం జరుగుతూనే ఉంది. ఇదొక ముఖ్యమైన 'వల్లమ్‌కలి'. 'వల్లమ్' అంటే మళయాళీ భాషలో పడవ, 'కలి' అంటే ఆట/పందెం, 'వల్లమ్‌కలి' అంటే పడవ పందెం. అన్ని 'వల్లమ్ కలీ' లలో 'చుందన్ (పాము) వల్లమ్ కలీ' లు ప్రాచుర్యం, ప్రజాదరణ పొందాయి.

వివిధ పడవ పందాలలో మరికొన్ని రకాల పడవలు కూడా పాల్గొంటుంటాయి. చురలన్ వల్లమ్, ఇరుట్టుకుటి వల్లమ్, ఆడి





## శిఖరాగ్రానికి చేరువైన

# సైనా, శరత్‌కమల్

**ఇటీవల జరిగిన రెండు పరిణామాలు దేశంలోని, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని క్రీడాభిమానులను చాలా ఆనంద పరిచాయి. బ్యాడ్మింటన్ రాణి సైనా నెహ్వాల్ మూడు సూపర్ సిరీస్ టైటిళ్లు గెలుచుకుని ప్రపంచంలోనే మూడవ స్థానానికి చేరుకుంది. చెన్నై, సింగపూర్, ఇండోనేషియా సూపర్ సిరీస్ టైటిళ్లను ఆమె గెలుచుకుంది.**

ఈ వ్యాసం ముగించే సమాయానికి మూడవ స్థానం నుంచి ప్రపంచంలోనే రెండవ స్థానానికి ఆమె చేరుకోవటం విశేషం. అతికొద్ది కాలంలోనే ఈ ఘనత సాధించిన సైనా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి కావటం మనకు గర్వకారణం. హర్యానాకు చెందిన సైనా నెహ్వాల్ హైదరాబాద్‌లోనే పెరిగింది. ఈ నగరాన్నే తన స్వస్థలంగా మార్చుకుని, ఇక్కడే స్థిరనివాసం ఏర్పరచుకుంది.





ఈ సంతోషకరమైన పరిణామం తరువాత, ఆచంట శరత్‌కమల్ మిచిగాన్‌లో జరిగిన యునైటెడ్ స్టేట్స్ ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను గెలుపొందాడు. వెనువెంటనే జూలైలోనే ఈజిప్ట్ ఓపెన్‌ను గెలుచుకున్నాడు.

చెన్నైలో జన్మించిన శరత్‌కమల్ తెలుగువాడు. తన స్వంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తో సాన్నిహిత్యం కలిగి ఉన్నాడు.

శరత్‌కమల్ సాధించిన పలు విజయాలు క్రీడాభిమానులకు ఆనందం కల్గిస్తున్నాయి. మన దేశంలో టేబుల్ టెన్నిస్ క్రీడ బాగానే ప్రజాదరణ పొందుతున్నప్పటికీ, అంతర్జాతీయంగా ఈ క్రీడలో మన దేశ ఉనికి అంతంత మాత్రంగానే ఉంది.

ఇటువంటి పరిస్థితుల్లో శరత్‌కమల్, ఇతర క్రీడాకారులు సాధించిన విజయాలు టేబుల్ టెన్నిస్ క్రీడలో అంతర్జాతీయపరంగా మన ఆశలను పెంచుతున్నాయి.

1982, జూలై 12న చెన్నైలో జన్మించిన శరత్‌కు తొలుత తన తండ్రి శ్రీనివాసరావు, అంకుల్ మురళీధరరావుల శిక్షణ లభించింది. సైనా నెహ్వాల్ మాదిరిగానే, శరత్‌కుమార్ కూడా పాదరసంలా శిఖరాగ్రానికి ఎగబాకాడు.

తమిళనాడులో అనేక టైటిళ్లు గెలుచుకున్న తరువాత, 2003లో జాతీయ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకోవటం ద్వారా జాతీయ స్థాయి క్రీడాకారుడిగా శరత్ ఆవిర్భవించాడు. ఈ ఏడాది గౌహతిలో ఐదవసారి జాతీయ ఛాంపియన్‌షిప్‌ను శరత్ గెలుచుకోబోతున్నాడు.

జాతీయ ఛాంపియన్‌షిప్‌ను వరుసగా గెలుచుకుంటూ వస్తున్న శరత్‌ను తరువాత అనేక టైటిళ్లు, విజయాలు, గౌరవాలు వరించాయి. 2004లో ప్రతిష్టాత్మకమైన అర్జున అవార్డు ఆయనకు దక్కింది.

2004లో ఏథెన్స్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో భారతదేశానికి శరత్ ప్రాతినిథ్యం వహించాడు. క్రీడలకు ఏథెన్స్ జన్మస్థలమన్న విషయం అందరికీ తెలిసిందే. 2004లో మలేసియన్ ఇంటర్నేషనల్ పోటీలు















కౌలాలంపూర్‌లో జరిగాయి. ఇందులో పాల్గొన్న శరత్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఈ పోటీల్లో జరిగిన టీమ్ ఈవెంట్‌లో భారతదేశం జట్టు ఇంగ్లాండ్‌ను ఓడించింది. ఇంగ్లాండ్ అప్పటికి 9 సార్లు ఛాంపియన్‌గా నిలిచింది. అటువంటి ఇంగ్లాండ్‌పై భారతదేశం గెలుపు సాధించటంలో శరత్ పాత్ర చాలా ఉందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

2006లో మెల్‌బోర్న్‌లో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో సింగిల్స్ టైటిల్ గెలుచుకోవటం శరత్ కెరీర్‌లో మైలురాయని చెప్పక తప్పదు. ఈ క్రీడల్లో భారతదేశం జట్టు స్వర్ణపతకాన్ని పొందటంలో కూడా శరత్ ఎంతగానో దోహదపడ్డాడు. ఆ విధంగా కామన్‌వెల్త్ క్రీడల్లో జరిగే వ్యక్తిగత పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన మొదటి క్రీడాకారుడిగా శరత్ ఆవిర్భవించాడు. స్థానిక ఫేవరెట్ అయిన విలియమ్ హెంజెల్‌ను ఆ పోటీల్లో శరత్ ఓడించాడు.

అదే సంవత్సరం ఖతర్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో శరత్ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాడు. 2007 ఆగస్టులో యోంగ్‌యాంగ్ (ఉత్తర కొరియా) ఇన్విటేషన్ టేబుల్ టెన్నిస్ క్రీడలో టైటిల్ గెలుచుకున్న మొదటి భారత క్రీడాకారుడిగా ఘనతను శరత్ స్వంతం చేసుకున్నాడు. ఈ క్రీడల్లో అత్యున్నత స్థాయి క్రీడాకారులు పాల్గొన్నారు. అంతకుముందు జపాన్‌లో ప్రో టూర్ చేసిన శరత్ దక్షిణ కొరియాకు చెందిన లీ జంగ్ వూను ఓడించి, 'టాప్ 100' లోకి చొచ్చుకుని వచ్చాడు. లీ జంగ్ వూ ప్రపంచంలో 19వ స్థానంలో ఉన్నాడు. ఆ గెలుపుతో శరత్ 73వ స్థానానికి ఎగబాకాడు. బీజింగ్‌లో 2008లో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో భారతదేశానికి శరత్ ప్రాతినిధ్యం వహించాడు.

జూన్‌లో న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ (ఐటిటిఎఫ్) ఇండియన్ ఓపెన్ టూర్‌లో శరత్ నిరాశాజనకమైన ఆటతీరు కనబరిచాడు. 2010 కామన్‌వెల్త్ క్రీడలు జరగటానికి అది కేవలం మూడు నెలల ముందు జరిగింది. కామన్‌వెల్త్ క్రీడల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి కూడా శరత్ ఎంపికయ్యాడు. అయితే, ఆ ఓటమి చేదు జ్ఞాపకాలను మిచిగాన్‌లోని గ్రాండ్ రాపిడ్స్‌లో జరిగిన యునైటెడ్ స్టేట్స్ ఓపెన్, జూలై మొదటి పక్షంలో కైరోలో జరిగిన ఈజిప్ట్ ఓపెన్ క్రీడల్లో శరత్ సాధించిన విజయాలు తుడిచిపెట్టేశాయి.

జూలై 4న జరిగిన యుఎస్ ఓపెన్ ఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. స్లోవేకియాకి చెందిన థామస్ కైనర్‌ను శరత్ ఓడించాడు. అదే రోజు శరత్ అభిమాన క్రీడాకారుడైన స్పెయిన్‌కి చెందిన రాఫెల్ నాడల్ వింబుల్డన్ టైటిల్ గెలుచుకున్నాడు. ఈ విజయం శరత్‌కు అత్యధిక మొత్తాన్ని (10,000 అమెరికన్ డాలర్లు) బహుమతిగా అందించింది.

శాన్ సెబాస్టియన్ క్లబ్‌కి ఆడుతూ, శరత్ తన ఎక్కువ సమయాన్ని స్పెయిన్‌లోనే గడుపుతాడు. బీజింగ్ ఒలింపిక్స్‌లో నాడల్‌ను కలుసుకున్న నాటి జ్ఞాపకాలను, ఆ సమావేశపు విశేషాలని హృదయంలో పదిలంగా భద్రపరచుకున్నాడు. నాడల్ మాదిరిగానే శరత్ కూడా తలకు బ్యాండ్ ధరిస్తాడు.

యుఎస్ ఓపెన్‌లో మరో ముగ్గురు భారతీయ క్రీడాకారులు టైటిళ్లు గెలుచుకున్నారు. వారు సునీల్‌శెట్టి (పురుషుల 'అండర్ 21'








విభాగం), ఉత్కర్ష్ గుప్తా (బాలుర 'అండర్ 13' విభాగం), కె. స్ఫూర్తి (బాలకల 'అండర్ 13' విభాగం). కె. స్ఫూర్తి విజయవాడకు చెందిన పాఠశాల విద్యార్థిని.

కొద్దిరోజుల తరువాత, కైరోలో జరిగిన ఈజిప్ట్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌ను శరత్ గెలుచుకున్నాడు. ఐటిటిఎఫ్ ప్రో టూర్‌లో సింగిల్స్ టైటిల్ గెలుచుకున్న మొదటి భారతీయ క్రీడాకారుడి ఘనతను శరత్ తద్వారా సొంతం చేసుకున్నాడు. నాలుగు ప్రత్యక్ష ఆటల్లో హాంగ్‌కాంగ్‌కు చెందిన లీ చింగ్‌ను శరత్ ఓడించాడు. శరత్ సాధించిన విజయాలు త్వరలో న్యూఢిల్లీలో జరగబోయే కామన్‌వెల్త్ క్రీడల్లో ఆయనకు, భారత దేశానికి స్ఫూర్తి దాయకంగా పనిచేస్తాయనటంలో ఎటువంటి సందేహం లేదు.

జర్మనీలో శిక్షణ పొందిన శరత్ తన ఎక్కువ సమయాన్ని యూరప్‌లో గడుపుతాడు. తన ఆటకు మరింత ప్రాచుర్యం సంపాదించటం అతని ధ్యేయం. న్యూఢిల్లీలో అక్టోబర్‌లో జరిగే కామన్‌వెల్త్ క్రీడల్లో కూడా 2006 నాటి కామన్‌వెల్త్ క్రీడల విజయాన్ని అతను పునరావృతం చేస్తాడని ఆశిద్దాం.

గడచిన సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనేకమంది ప్రతిభావంతులైన క్రీడాకారుల సేవలను శరత్ రికార్డులు గుర్తు చేస్తున్నాయి. ప్రత్యేకించి రెండుసార్లు జాతీయ ఛాంపియన్‌గా అవతరించిన మీర్ ఖాసిమ్ అలీ, జాతీయ మాజీ ఛాంపియన్ కె. రామకృష్ణ, జూనియన్ నేషనల్ ఛాంపియన్ మహమ్మద్ అజమ్, ఖుర్షీద్ అలీ, సయిదా సుల్తాన్, తదితరులు జ్ఞప్తికి వస్తారు. సయిదా సుల్తాన్ మాజీ మహిళా జాతీయ ఛాంపియన్.

తన 11 ఏటనే 1960లో మీర్ ఖాసిమ్ అలీ ఈ ఆటలోకి ప్రవేశించారు. 1963లో న్యూఢిల్లీలో జరిగిన నేషనల్స్ పోటీల్లో జూనియర్ సింగిల్స్ టైటిల్స్‌ను గెలుచుకున్న మీర్ ఖాసిమ్ అలీ హైదరాబాద్‌లోనే జన్మించారు.

1968, 1969 సంవత్సరాల్లో మీర్ ఖాసిమ్ అలీ సీనియర్స్ టైటిళ్లను కూడా గెలుచుకున్నారు. తదుపరి ఒకసారి రన్నరప్‌గా నిలిచారు. ఆయనను అర్జున అవార్డు కూడా వరించింది. 1973 వరకు ఇండియన్ స్క్వాడ్‌లో ఖాసిమ్ అలీ రెగ్యులర్ మెంబర్‌గా కూడా ఉన్నారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ అనేక జాతీయ టీమ్ ఈవెంట్లలో ఫైనల్స్ వరకు చేరుకుంది.

రకరకాల వైవిధ్యభరితమైన స్ట్రోక్స్‌కు పెట్టింది పేరైన ఖాసిమ్ అలీ 1966లో తూర్పు ఆఫ్రికాలో పర్యటించిన భారతీయ స్క్వాడ్‌లో సభ్యుడిగా ఉన్నారు. 1966లో శ్రీలంకలో జరిగిన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీల్లో ఆయన ఉస్మానియా యూనివర్సిటీ తరపున పాల్గొన్నారు.

చైనా ప్రధాని చో ఎన్ లై ని కూడా ఖాసిమ్ అలీ కలుసుకున్నారని, పింగ్‌పాంగ్ డిప్లొమసీకి ఆయన రింగ్‌సైడ్ అబ్జర్వర్‌గా ఉన్నారని తెలుస్తోంది. ఈ పింగ్ పాంగ్ డిప్లొమసీ చైనా, అమెరికాల మధ్య సన్నిహిత సంబంధాలకు దోహదపడింది.

1950ల దశకం తొలి భాగంలో గుంటూరు జరిగిన పోటీల్లో కె. రామకృష్ణ జాతీయ ఛాంపియన్‌షిప్‌ను సాధించారు. దక్షిణ భారతదేశానికి చెందిన సయిదా సుల్తాన్ కూడా తొట్టతొలి మహిళా ఛాంపియన్లలో ఒకరుగా ఉన్నారు.

**- దాసు కేశవరావు**

*(అనువాదం : వై . సరోజ)*



**అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన 'కొల్లేరు సరస్సును' పునరుద్ధరించి, పూర్వ వైభవాన్ని కల్పించాలన్నదే ప్రభుత్వం సంకల్పం. కొల్లేరు సరస్సు ఒకప్పుడు స్వచ్ఛమైన గాలి, నీటితో ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ఎందరో పర్యాటకులకు ఆనందం కల్గించేది. ఎన్నో వేల రకాల పక్షులు విహరించేవి. కాలక్రమేణ కొందరు స్వార్థపరుల చర్యల వల్ల, కొల్లేరు ప్రాంత పేద ప్రజల దయనీయ స్థితి వల్ల కొల్లేరు సరస్సు చేపల చెరువుల ఆక్రమణలకు గురై, స్వరూపమే మారిపోయింది. కొల్లేరు సరస్సు పరిసర ప్రాంతమంతా కలుషితమైంది. సరస్సు ఎగువ ప్రాంతాలలో వ్యవసాయభూములు తరచు ముంపునకు గురవుతున్నాయి.**

2005 ఆగష్టు సెప్టెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాల వలన గతంలో ఎన్నడులేని విధంగా లక్షకు పైగా ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. పంట పూర్తిగా నాశనమవ్వడమేకాకుండా రబీ పంట వేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితులకు ఆక్రమణలే కారణమని ప్రభుత్వం గుర్తించింది. నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించి కనీసం రబీ పంటకు వేసుకోవటానికి వీలుగా రైతులను ఆదుకోవాలి.

స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి లభించిన అనూహ్య స్పందన వలన ప్రభుత్వం కొల్లేరు ఆపరేషన్ రెండవదశ చేపట్టాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా 'కొల్లేరు అభయారణ్యంగా' ప్రకటించబడిన 5 కాంటూరులోని 77,138 ఎకరాలలోని ఆక్రమణలు అన్నీ తొలగిస్తారు. ఈ ప్రాంతంలో స్వంత భూములు కల్గి ఉండి, వాటిని చెరువుల ద్వారా చేపల పెంపకానికై వినియోగిస్తూ ఉంటే, వారికి కేవలం సాంప్రదాయ పద్ధతిలో చేపలు పెంపకం, వేటకు అనుమతిస్తారు. అదేవిధంగా 'సొంత భూములలో ఎవరైతే వ్యవసాయం చేసుకుంటారో, వారిని సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయాన్ని కొనసాగించేందుకు అనుమతిస్తారు'.

# కొల్లేరు సరస్సు పునరుద్ధరణ - ప్రత్యామ్నాయ జీవనోపాధుల కల్పన

'కొల్లేరు ఆపరేషన్' పేరిట అడ్డంకుల తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మొదటిదశను పూర్తి విజయవంతంగా పూర్తి చేసింది. తద్వారా ఎందరో రైతు సోదరులకు రబీ పంట వేసుకోవడానికి అనుకూల పరిస్థితులు కల్పించబడ్డాయి.

కొల్లేరు ప్రాంతంలోని పేద ప్రజలు, సరస్సు చుట్టు ప్రక్కల ప్రాంతాలకు చెందిన రైతులు, పర్యావరణ రక్షణ సంఘం ప్రతినిధులు,



ఈ ప్రక్రియ చేపల చెరువులపై ఆధారపడి జీవిస్తున్న సుమారు పదివేల ఆధారిత కుటుంబాలపై ప్రభావం చూపుతుందని, వారి జీవనోపాధిలో మార్పు తేవల్సి ఉన్నదని ప్రభుత్వం అంచనా. అయితే 'కొల్లేరు ఆపరేషన్'లో భాగంగా చేపట్టే చర్యల వలన ఏ ఒక్క పేద కుటుంబానికి నష్టం జరగకూడదన్నది ప్రభుత్వ ధృడ సంకల్పం. అందుకే ఆధారిత కుటుంబాలకు మెరుగైన ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలన్నది ప్రభుత్వ ఆలోచన.

### కొల్లేరు అభయారణ్యం - వివరాలు

*కొల్లేరు ప్రాంతం విస్తరించినవి*

1) పశ్చిమ గోదావరి జిల్లాలో విస్తరించిన మండలాలు (7) - ఏలూరు, టంగుటూరు, పెదపాడు, దెందులూరు, ఆకివీడు, నిడమర్రు, భీమడోలు

2) కృష్ణాజిల్లా విస్తరించిన మండలాలు : 1. కైకలూరు 2. మండవల్లి

విస్తీర్ణం : 308.55Q KMA మరియు 30.855.20 Ha

### కొల్లేరు ఆధారిత ప్రజల జీవనోపాదుల పెంపుదల - కార్యాచరణ ప్రణాళిక

కొల్లేరు సరస్సు పునరుద్దరణలో భాగంగా కొల్లేరు పై ఆధారపడ్డ 29,000 కుటుంబాల జీవనోపాధులు మెరుగుపర్చటానికి సర్వే నిర్వహించింది. దీని నిమిత్తం 35 గ్రూపులుగా ఏర్పడి 6 గురు ఏరియా కో-ఆర్డినేటర్ల పర్యవేక్షణలో, 4 గురు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ల సమన్వయంతో సర్వే జరిగింది.

పర్యవేక్షణాధికారి : సీనియర్ జిల్లా అధికారులు
సమన్వయ కర్తలు : ఏరియా కో ఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు
కమ్యూనిటీ కో ఆర్డినేటరు : ప్రతి బృందానికి ఒకరు - 35 మంది
మండల్ రిసోర్స్ పర్సన్స్ : ప్రతి బృందానికి - 2 -70 మంది

ఫిబ్రవరి 1న సర్వే టీమ్‌లు ప్రతి గ్రామంలో 3రోజుల పాటు వరుసగా సర్వే చేపట్టాయి. ఈ సర్వేలో కుటుంబాల వివరాలు, వారి ఆర్థిక స్థితిగతులు, విధమైన ప్రత్యామ్నాయ జీవన విధానం అవసరం, అందుకుకావల్సిన శిక్షణ, శిక్షణకు కావల్సిన వ్యయం (నిధులు), లబ్ధిదారుల వాటా, బ్యాంక్ వాటా మొదలగునవి సేకరించడం జరిగినది.

***సర్వే నిర్వహించిన తదుపరి ప్రత్యామ్నాయ జీవనోపాధికి గుర్తించినవి***

| | యూనిట్ విలువ |
|---|---|
| 1. ధోనిపై చేపలవేట | రూ. 5,000 (ఒకరికి) |
| 2. బోటు పై చేపల వేట | రూ. 20,000 (ఇద్దరికి) |
| 3. Low cost cold stovage | రూ. 10,000 (2583) |
| 4. కోళ్ళ దాణా తయారి | |
| 5. పాడి గేదెల పెంపకం | |
| 6. సిమెంట్ తయారీ వస్తువులు | |
| 7. సిమెంట్ ఇటుకల తయారీ | |
| 8. మినరల్ వాటర్ | |
| 9. గొర్రెల పెంపకం | |

## జీవనోపాధి లబ్ధి పొందిన వారి స్పందనలు

ప్రత్యామ్నాయ జీవనోపాధి పెంపుదల కార్యక్రమంలో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలలోని కొల్లేరు గ్రామాలలో పునరుద్ధరణ క్రమంలో 2129 మహిళా గ్రూపుల వారిని, 22, 232 వ్యక్తిగత రుణాలను SC, BC, DRDA సంస్థల ద్వారా ఇవ్వడమైనది. లబ్ధి పొందిన వారి స్పందన వారి మాటలలో వినండి.



*"కొల్లేరు సరస్సును పునరుద్ధరణ అనగానే మాకు భయం వేసింది. కానీ ప్రభుత్వం నుంచి జీవనోపాధి కొరకు మా శ్రీదేవి గ్రూప్ సభ్యులందరికి పడవలు, వల యూనిట్ రావటం మాకు చాలా ఆనందంగా వుంది. ఇప్పుడు మా గ్రూపులో అందరం మాకు వచ్చిన రుణాన్ని ఉపయోగించుకుంటున్నాం. యూనిట్ విలువ 5 లక్షలు"*

***- బెజవాడ జయభారతి,*** *శ్రీదేవి గ్రూపు, ఆగడాలలంక*

**120 జీవో అమలైతే కొల్లేరు అభయారణ్యంలో ప్రజలు పొందే హక్కులు**

- కొల్లేరు గ్రామాలలో నుంచి ప్రజలను ఖాళీ చేయించకుండా అక్కడే వారి జీవనం సాగించవచ్చును.
- సాంప్రదాయ పద్ధతిలో చేపలు పట్టుకొనే హక్కు కల్పించబడింది.
- సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం చేసుకొనవచ్చును.
- ప్రధాన గ్రామాల్ని కల్పుతూ నిర్మించిన రహదార్ల నిర్వహణ హక్కు కల్పించబడింది.



*"కొల్లేరు సరస్సు పునరుద్ధరణ అనగానే మాకు మా గ్రామంలో అందరికి చాలా భయం వేసింది. మమ్మల్ని కష్టాలు పాలు చేస్తున్నారు అని భావించాం. కాని ప్రభుత్వం మాకు, కొల్లేరుకి పరిరక్షణ కల్పిస్తున్నదని అర్థమైంది. మాకు పాల వ్యాపారం నిమిత్తం మా గ్రూపునకు 'డైరీ యూనిట్' ఇచ్చారు. ఇప్పుడు మా గ్రూపులో అందరం, మా కుటుంబాల వారు ఆనందంగా ఉన్నాం."*



***- కొత్తపల్లి విజయకుమారి,*** *గ్రూపు, చెట్టున్న పాడు*



*"మాకు వలల యూనిట్ రుణంగా ఇచ్చారు. అందువలన సాంప్రదాయ పద్ధతిలో చేపల వేటకు వెళ్తున్నాం. మా గ్రూపులో అందరం, ఆనందంగా ఉన్నాం".*

***- శనపతి అశరమ్మ,*** *శ్రీ కనకదుర్గ గ్రూప్ సభ్యురాలు*

*"జీ.వో.నెం. 120 ప్రకారం కొల్లేరు పునరుద్ధరణ అనగానే మా గ్రామంలో అందరం భయపడ్డాం. జీవనోపాధి కల్పించడం వలన మాకు ఇప్పుడు ఆరోగ్య కరమైన జీవనం సాగిస్తున్నాం".*

***- జంగంకృష్ణ, మునియ్య, ముహార రామరావు,*** *చాటపర్రు*

కొల్లేరు ఆధారిత ప్రజలు జీవనోపాధుల పెంపుదలలో ఎన్నో వేల మంది ఆరోగ్యకరమైన వ్యాపారులు నిర్వహిస్తూ ఆత్మవిశ్వాసంతో జీవనం సాగిస్తున్నారు. ప్రకృతి అందం కాపాడుతుంటున్నారు.

***- కె.కోటేశ్వరరావు,*** ఎంపిడీవో,
*భీమడోలు మండలం పశ్చిమ గోదావరి జిల్లా*

**రా**జ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్య ప్రక్రియను కొనసాగించడం, ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 స్ఫూర్తిని కాపాడడం, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఆస్తిపాస్తుల వివరాలను అఫిడవిట్ రూపంలో ముందుగానే దాఖలు చేయాలన్న సుప్రీంకోర్టు సూచన అమలుకు తోడ్పడడం, ఆ వివరాలు ఓటర్ల దృష్టికి వెళ్లేలా చూడడం లక్ష్యంగా పెట్టుకుని అనేక సంస్థలు ఆవిర్భవించాయి. వాటికి ఏ పార్టీతోను సాన్నిహిత్యం లేదు.**

ఎన్నికల నిర్వహణలో సంస్కరణలు తీసుకురావడానికి అనేక మార్గాలను అవి అనుసరించాయి. అవసరమైన సందర్భాల్లో కోర్టుల్లో ప్రజాప్రయోజన వ్యాజ్యాలను దాఖలుచేయడం, దేశంలో ప్రజాస్వామ్యం సమర్థంగా కొనసాగడానికి ఎన్నికల ప్రక్రియ ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించడానికి ప్రసార మాధ్యమాలను, రాజకీయ ప్రలోభాలకు అతీతంగా వ్యవహరించగల ఎన్నికల కమిషన్, లా కమిషన్ వంటి ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆశ్రయించడంతో పాటు, పారదర్శకంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం అసాధ్యం కాదని నిరూపించడానికి ఎన్నికల్లో పోటీ చేయడం వంటి మార్గాలను అవి చేపట్టాయి.

# రాజస్థాన్‌లో పంచాయతీ ఎన్నికల్లో సరికొత్త 'సంఘటన్'

అలా ఎన్నికల సంస్కరణల కోసం కృషి చేస్తున్న సంస్థల్లో ఒకటి - మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్. ఇది 1987లో ఏర్పడింది. అయితే, 1990 నుంచి మాత్రమే ఇది కిందిస్థాయి నుంచి పనిచేయడం ప్రారంభించింది. ఇదేమీ రిజిస్టరయిన సంస్థ కాదు. అంతర్గతంగా కాని, బయటి నుంచి కాని నిధుల సేకరణకు ప్రయత్నించదు. దీని పనితీరు పూర్తిగా ప్రాథమికంగా, చాలా నిరాడంబరంగా ఉంటుంది. నిర్దిష్టమైన, చట్టబద్ధమైన నియమనిబంధనలేవీ లేవు. ప్రధానంగా ప్రజలను చైతన్యవంతులను చేయడం, తమ హక్కుల కోసం ఉద్యమించే విధంగా పౌరులను ప్రేరేపించడం, నిర్ణయాలను తీసుకోవడంలో వారు తమ వంతు పాత్రను గుర్తించేలా చేయడం లక్ష్యంగా ఇది కృషి చేస్తున్నది. ఈ సంస్థ కార్యనిర్వాహక వ్యవస్థలో కేంద్ర స్థాయి కమిటీ ఉంటుంది. సంస్థకు సంబంధించిన నిర్ణయాలను అన్నిటినీ ఈ కమిటీయే తీసుకుంటుంది.

పదిపన్నెండు మంది పూర్తి సమయాన్ని కేటాయించగలిగే వారు సభ్యులుగా ఉంటారు. వారంతా సామాన్యుల సమస్యలపైనే తమ దృష్టిని కేంద్రీకరిస్తారు. సంస్థ ఆదాయం ప్రధానంగా దానికి అనుబంధంగా నిర్వహిస్తున్న వ్యాపార సంస్థల ద్వారానే వస్తుంది. వారు నివసించే ఇళ్లు ఆ చుట్టూ ఉండే ఇతరుల నివాసాలకన్నా ఏ విధంగానూ భిన్నంగా ఉండవు. వారి ఆహారపు అలవాట్లు స్థానికులకు ఉండేవే. తక్కువ ఖర్చుతో సమకూర్చు కొనగలిగేవే. వారి గృహ నిర్వహణ బడ్జెట్ సాధ్యమైనంత పరిమితంగానే ఉంటుంది. వారు సైకిళ్లనే వాహనాలుగా ఉపయోగిస్తుంటారు. అవి కూడా వారు సొంతంగా సమకూర్చుకున్నవే. స్థానిక ప్రజలకు లభించే కనీస వేతనాలతో సమానంగానే వారికి చెల్లిస్తారు. ఇలా సామాన్య ప్రజల జీవన విధానాన్ని అనుసరించడానికి ఉన్న ఒకే కారణం - వారు స్థానికులతో మమేకం కావాలనేదే. నిరక్షరాస్యులైన స్థానిక ప్రజలందరికీ వారు చేపట్టే కార్యకలాపాల గురించి, వారు సాధించిన విజయాల గురించి స్పష్టమైన అవగాహన ఉంది. సభ్యులను చేర్చుకునేందుకు వేరే విధివిధానాలు అంటూ ఉండవు. అయినా, పెద్ద సంఖ్యలోనే వారంతా సంస్థ చేపట్టే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు.

సంస్థకు లభించే ఆదాయం ప్రధానంగా ఆరు వనరుల నుంచి సమకూరుతుంది. 1) శ్రేయోభిలాషులు, మద్దతుదారులు అందించే విరాళాలు 2) స్థానిక గ్రామ ప్రజలు నగదు రూపంలో కాని, శ్రమ రూపంలో కాని అందించే సహకారం 3) సంస్థ ఉత్పత్తి చేసే సరుకుల విక్రయాలు 4) సంస్థ నిర్వహిస్తున్న రెండు ఎస్టీడీ బూత్‌ల ద్వారాను, చౌకదుకాణాల ద్వారాను వచ్చే రాబడి 5) సంస్థకు వచ్చిన అవార్డుల రూపంలో సమకూరిన నిధులపై వచ్చే వడ్డీ - దీనినే వారు కార్యకర్తల వేతనాలకు ఉపయోగిస్తుంటారు 6) అరుణా రాయ్ తనకు వచ్చిన మెగాసెసే అవార్డు నగదు బహుమతిని జనహిత సంస్థకు విరాళంగా ఇచ్చేశారు. ఈ సంస్థ సహాయంతో కార్యకర్తలు స్వయంసమృద్ధి సాధిస్తున్నారు.

ఇక మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ కార్యకలాపాలు పరిశీలిద్దాం. అ) కనీస వేతనాల కోసం పోరాటాలు ఆ) అవినీతిని నియంత్రించే లక్ష్యంతో బహిరంగ విచారణలను సంస్థ నిర్వహిస్తూ ఉంటుంది. ఈ విధంగా ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో పారదర్శకత, బాధ్యతాయుత సరళిని పెంపొందించేందుకు ప్రయత్నిస్తుంది. ఇ) సమాచార హక్కును ఉపయోగించుకునేలా ప్రజలను ప్రోత్సహిస్తుంది. ఈ) మార్కెట్‌లో ధరవరలను నియంత్రించే ఆలోచనతో చౌక దుకాణాలపై నిఘా వేసి ఉంచుతుంది. ఉ) ప్రజోపయోగ పనులను చేపట్టే వారిని సామాజిక ఆడిటింగ్ ద్వారా కట్టడి చేస్తుంది. ఊ) స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా పౌరులకు విశ్వసనీయమైన పాలనను అందించడానికి యత్నిస్తుంది. ఎ) ఎన్నికల సమయంలో అభ్యర్థులు అడ్డదారులు తొక్కకుండా నిఘా వ్యవస్థగా పని చేస్తుంది. ఏ) పని చేసే హక్కును శ్రామికులకు కల్పించడానికి శ్రద్ధ తీసుకుంటుంది. కింది




డయాగ్రామ్‌ను గమనిస్తే సంస్థ కార్యకలాపాల గురించిన అవగాహన ఏర్పడుతుంది.

ఎన్నికలు-రాజకీయాల విషయంలో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ రెండు విధాలుగా తన వంతు పాత్రను నిర్వహిస్తుంది. స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేయడం మొదటిది. స్థానిక, శాసనసభ, పార్లమెంటు ఎన్నికల సమయంలో వాచ్‌డాగా విధులను నిర్వహించడం రెండోది. ఎన్నికల బరిలో నిలబడడానికి ప్రధాన కారణం - ప్రస్తుత ప్రజాస్వామ్యబద్ధమైన రాజకీయ వ్యవస్థ పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, స్పందించే వైఖరితో వ్యవహరిస్తున్నదా అని గమనించడమే. ఎన్నికల్లో పోటీ చేయడానికి కారణాల గురించి అరుణా రాయ్ ఈ విధంగా వివరించారు. "మాకు గెలుపు ముఖ్యం కాదు. నైతిక విలువలు కల వారే అధిక సంఖ్యలో ఎన్నికల బరిలో ఉన్నారనే నమ్మకాన్ని కలిగించడమే. రాజకీయాల్లో నైతిక విలువలు, పారదర్శకతకు చోటు ఉండాలి అన్నదే మా లక్ష్యం. ఎంత నెమ్మదిగా మా ప్రయత్నం సాగినా తప్పకుండా అన్ని స్థాయిల్లోను రాజకీయాలను ప్రభావితం చేయగలం. అదే మా విశ్వాసం" ఈ ఆశయంతోనే 2000 సంవత్సరం నుంచి ఈ సంస్థ ఎన్నికల గోదాలోకి అడుగుపెట్టింది.

*ఎన్నికల రాజకీయాల్లో ప్రవేశించడానికి కారణాలు మరి కొన్ని ఉన్నాయి. అవి :*

- సంస్థ నిర్వహించిన బహిరంగ విచారణల్లో కొంతమంది సర్పంచ్‌లు విసిరిన సవాలును అంగీకరించడం ఒక కారణం. ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొంది మీరు ఆశిస్తున్న విధంగా అవినీతి రహితమైన, సమర్థమైన, పారదర్శకమైన పాలనను అందించి అప్పుడు మాట్లాడండి అంటూ వారు సంస్థ కార్యకర్తలను సవాలు చేశారు. ఇలా సర్పంచ్‌లతో పాటు కొందరు అధికారులు కూడా ప్రస్తుత రాజకీయ చట్రంలో నిలబడి ఆచరణసాధ్యమన్న విశ్వాసాన్ని కలిగించాలని సవాలు చేయడంతో పోటీ చేయవలసి వచ్చింది.
- రాజస్థాన్‌లో 2000 వ సంవత్సరం నుంచి సమాచార హక్కు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. దాన్ని ఉపయోగించుకోవడంలో ప్రజలకు మార్గదర్శిగా నిలబడాలని సంస్థ నిర్ణయించింది. ముఖ్యంగా గ్రామాల్లో విద్య, వైద్యం, ప్రజాపంపిణీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలలో ఈ చట్టాన్ని ఉపయోగించి పౌరులకు ఎలా లబ్ధి పొందవచ్చునో చూపించాలనుకుంది.
- ఎన్నికల్లో గెలవడానికి అడ్డదారులు తొక్కవలసిన అవసరం లేదని ఇతరులకు నిరూపించాలని సంస్థ దీక్ష పట్టింది. ధనబలం, కండబలం, మత ప్రలోభాలు, సారా తాగించడం వంటి మార్గాలు అవసరం లేదని ఆచరించి చూపించింది.
- కేరళలో గ్రామ పంచాయతీలు అనుసరిస్తున్న కొన్ని విధానాల ను పరిశీలించిన తరువాత వాటిని అమలు చేయాలని సంస్థ కృతనిశ్చయానికి వచ్చింది. అక్కడ ప్రణాళికల రూపకల్పనలో స్థానికులే కీలకపాత్ర వహిస్తారు. వార్డు, గ్రామసభల సమావేశాల తీరుతెన్నులు, పన్నుల వసూలు విధానం, దాదాపు 40 శాతం వరకు నిధులను నేరుగా గ్రామపంచాయతీలకే అందచేస్తుండడం ఈ సంస్థకు స్ఫూర్తినిచ్చాయి. వాటిని రాజస్థాన్‌లో కూడా అమలు చేయాలనే సంకల్పమే వారిని ఎన్నికల గోదాలోకి ప్రవేశించడానికి కారణమయింది.
- తమ ప్రయోజనాలను సాధించుకోవడానికి గ్రామీణ ప్రాంత ప్రజలు నిర్ణయాలు తీసుకోవడంలో అధికారాన్ని, భాగస్వామ్యాన్ని చేజిక్కించుకోవాలని 73వ రాజ్యాంగ సవరణ ఆకాంక్షించింది. గ్రామసభలు సమర్థంగా పనిచేయాలంటే ఈ విధంగా ప్రజలను నిర్ణయాధికారంవైపు నడిపించాల్సిన అవసరం ఉందని సంస్థ గుర్తించింది.

## ఎన్నికల్లో పోటీ చేయడానికి నిబంధనలు

పరిశుద్ధమైన పాలన అందించడానికి వీలుగా ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశించే వారికి ఈ సంస్థ కొన్ని నిబంధనలను విధించింది. అవి :

***1) ప్రజా సేవలో మచ్చలేని గతం:*** ప్రజాప్రయోజనాల కోసం నిస్వార్థంగా కృషి చేసిన గత చరిత్ర అభ్యర్థులకు ఉండాలి. అవినీతి, లేక నేరపూరిత ఆరోపణలు ఉండకూడదు. ఈ కారణంగానే సంస్థ అభ్యర్థులు కాని, సంస్థ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు కాని కనీస వేతనాలపై మాత్రమే ఆధారపడి, సమాచార హక్కు, పని చేసే హక్కులకు కట్టుబడిన వారై ఉంటారు. పూర్తి సమయం కాని, పార్ట్‌టైమ్ కాని వారంతా ఈ విధంగా కొన్ని ఆదర్శాలకు బద్ధులై ఉండాలి.

***2) ఘోషణ పత్ర:*** ఎన్నికల మేనిఫెస్టో అభ్యర్థి చిత్తశుద్ధికి నిదర్శనం : ఈ సంస్థ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే ముఖ్యమైన అంశం ఈ ఎన్నికల ప్రణాళిక. అడ్డదారులకు ఇదే అడ్డుకట్ట. ఎన్నికల సమయంలోను, ఆ తరువాత సర్పంచ్‌గా ఎన్నికైనప్పుడు కూడా అభ్యర్థులు ఈ మేనిఫెస్టోకు కట్టుబడి ఉండాలి.

అభ్యర్థులు ఇందులో ప్రజల సమస్యల పరిష్కారానికి తాము ఏ విధమైన పరిష్కారాలను సాధించాలని ఆశిస్తున్నారో, ఏఏ అంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారో తెలియచేయాల్సిఉంటుంది. అందులోనే అభ్యర్థి తన ఎన్నికల ప్రచారాన్ని ఏ స్థాయిలో చేపట్టగల గుతాడో సూచించవలసి ఉంటుంది. ఎన్నికల వ్యయం కింద రూ. 1000 కంటే ఎక్కువ ఖర్చు చేయరాదు. సారా పోయించడం లాంటి అక్రమాలకు పాల్పడకూడదు. మరే విధంగాను ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నం చేయకూడదు.నేరుగా డబ్బు పంపిణీ చేయడం కాని, ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటర్లకు వాహన సదుపాయం కల్పించకూడదు.

ఒకవేళ సర్పంచ్‌గా ఎన్నికైన పక్షంలో, పారదర్శకతను కాపాడతామని, పంచాయతీకి సంబంధించిన నిర్ణయాలన్నీ సమష్టిగా అందరి భాగస్వామ్యంతోనే తీసుకుంటారని మేనిఫెస్టో స్పష్టమైన హామీనిచ్చింది. అనుమతించిన పనులకు లంచాలు స్వీకరించడం గానీ, ఇవ్వచూపడం గానీ, పంచాయతి సమితి / ప్రభుత్వ అధికారులకు గానీ వారు అందచేసిన హక్కులకు గానీ, సానుకూల నిర్ణయాలకు గానీ ఏ రకంగానూ ప్రలోభపెట్టడం జరగదు. అన్నిటికన్నా ముఖ్యంగా సర్పంచ్‌గా ఎన్నికైన వారు అవినీతి కార్యకలాపాలకు పాల్పడకుండా పారదర్శకంగాను, బాధ్యతాయుతంగాను వ్యవహరిస్తూ సామాజిక ఆడిటింగుకు కట్టుబడి ఉండాలని మేనిఫెస్టోలో స్పష్టం చేసింది.

***ఘోషణా పత్రంలోని ముఖ్యాంశాలు :*** ఎన్నికల ప్రచారాల్లోను, ఆ తరువాత కూడా మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ అభ్యర్థి ఎవరైనా సరే ఘోషణా పత్రంలోని అంశాలకు కట్టుబడి ఉండాలి. అందులోని ముఖ్యమైన అంశాలు -

- ఎన్నికల ప్రచారాల్లో భాగంగా అవసరం లేని ఖర్చులు చేయడం కానీ, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సారా వంటివి పంచిపెట్టడం కానీ చేయను.
- నాకున్న ఆదాయ వనరులనన్నిటినీ ప్రజల ముందు ఉంచడానికి సిద్ధమే. ఎవరైనా సరే ఎప్పుడైనా నేను వెల్లడించిన ఆదాయ వనరుల వివరాలను పరిశీలించవచ్చును. కావాలంటే ఫోటో స్టాట్ కాపీని తీసుకోవచ్చును.
- పంచాయతీ రాజ్ సంస్థలోని పౌరులందరూ పంచాయతీకి యజమానులని భావిస్తాను. నేను ప్రజా సేవకుడిని మాత్రమే. వారి విషయంలో నేను బాధ్యతతోనే వ్యవవహరిస్తాను. అన్ని వ్యవహారాల్లోను వారి ఆమోదంతోనే నిర్వహించగలను.

- గ్రామపంచాయతీకి చెందిన రికార్డులను అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకుంటాను. ఎవరు ఎప్పుడు అడిగినా నాలుగు రోజుల్లో ఫోటోకాపీలను అందిస్తాను.
- గ్రామసభల ద్వారా, వార్డు సభల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు సామాజిక ఆడిటింగాను ఎప్పటికప్పుడు చేయిస్తాము. పనులను ఎంపిక చేసిన తరువాత వాటి జాబితాను నేనే స్వయంగా పరిశీలించి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు (బీపీఎల్) ప్రయోజనం కలిగించే వాటికే అధిక ప్రాధాన్యమిస్తాను.
- అధికారిక పత్రాల్లో (డాక్యుమెంట్లు) ఎలాంటి సర్దుబాట్లు, దిద్దుబాట్లకు పాల్పడేదిలేదు. అలా దిద్దుబాటు చేయడం అక్రమ పద్ధతిగా పరిగణిస్తాను. వాస్తవ పరిస్థితులనే ప్రతిబింబించే డాక్యుమెంట్లనే ప్రజలకు ప్రదర్శిస్తాను. ఈ విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడబోను.
- నిర్ణీత వ్యవధిలోనే వార్డు సభలు, గ్రామ సభలు జరిగేట్లుగా శ్రద్ధ తీసుకుంటాను. వీటినే వేదికలుగా చేసుకుని పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా సంక్రమించే అధికారాలను వారికి పూర్తిగా అందేలా కృషి చేస్తాను. ప్రజాభాగస్వామ్యంతోనే అన్ని నిర్ణయాలను తీసుకుంటాను.
- సామాజిక ఆడిటింగాలోను, అంచనాలు తయారుచేయడంలోను (ఎవల్యూషన్), నిధుల వినియోగం (యుటిలైజేషన్) సర్టిఫికెట్లను వార్డు, గ్రామ సభలు జారీ చేసినా, వాటికి నేనే పూర్తి బాధ్యత వహిస్తాను.
- నా పరిధిలో ఉన్న ప్రాంతాల్లో మద్యపాన నిషేధానికి శాయశక్తులా కృషి చేస్తాను.
- మహిళలు, దళితులు, వృద్ధులను కాపాడేందుకు, వారి పరిస్థితిని మెరుగుపరచేందుకు కృషిచేస్తాను. బలహీనవర్గాల ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యమిస్తాను.

ఇచ్చిన హామీలనన్నిటిని నిలబెట్టుకునేందుకు పూర్తి బాధ్యత నాదే.

***3) పారదర్శక ప్రచార సరళి :*** పారదర్శక ప్రచారాల ప్రాధాన్యం నైతిక విలువల ప్రకారం చూస్తే చాలా ఎక్కువ అని అరుణా రాయ్ భావిస్తారు. దీని వల్ల ప్రజలతో సాన్నిహిత్యం ఏర్పడడంలో ఎలాంటి జాప్యం ఉండదు. నిజాయితీగా, చిత్తశుద్ధితో ప్రచారాలను చేపడితే పారదర్శక ప్రచారాల ఫలితంగా ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థకు రాజకీయ ప్రత్యామ్నాయానికి దారి తీస్తుంది. ప్రచారాల కోసం ఇతర అభ్యర్థులెవరైనా వాహనాలను ఉపయోగిస్తుంటే మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ తరపున పోటీ చేసే అభ్యర్థులు ఒక తండా నుంచి మరో తండాకు, పేదలు పని చేసే ప్రాంతాలను ఒకటి తరువాత మరొకటిగా సందర్శించి కాలి నడకనే వెళ్లి తమ ప్రచారాలను నిర్వహిస్తారు. వాహనాలను ఉపయోగించకుండా కాలినడకనే ప్రచారాలను చేపట్టాలని వీరు నిశ్చయించుకుని ఉన్నారు. కనుక అలాగే చేస్తారు.

ఒకవేళ ఎక్కడైనా అవసరమైతే, సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న వాటినే ఉపయోగిస్తారు. పాదయాత్రలు, చౌరాస్తాల్లో సమావేశాలు, జనమంచ్ (జన సమూహాలు) కరపత్రాల పంపిణీ వంటివి మాత్రమే సంఘటన్ అభ్యర్థులు అనుసరించే ప్రచార మార్గాలు. వీటి వల్ల అట్టడుగు స్థాయి నుంచి ప్రజాస్వామ్య పంథాలో స్థానికుల సమస్యలపై సమగ్రమైన, ఆరోగ్యకరమైన చర్చకు అవకాశం లభిస్తుంది. సాధ్యమైనంతవరకు పాదయాత్రల ద్వారానే ప్రజల సమక్షంలోనే ప్రచారాలు సాగుతాయి. క్షామ ప్రాంతాల్లో రోజుకు 10 నుంచి 20 గ్రామాలను సంఘటన్ కార్యకర్తల బృందాలు సందర్శించి అక్కడి వారితో ముఖాముఖి మాట్లాడి వారికి స్పష్టమైన అవగాహన కలిగిస్తారు.

స్థానికులను ఆకట్టుకోవడానికి వారికి తేలికగా అర్థమయ్యే పద్ధతిలో స్థానిక వాయిద్యాలనే ఉపయోగించి వారికి బాగా తెలిసిన సంగీతబాణీలలోనే పాటల ద్వారా ప్రచారం చేయడానికి అధిక ప్రాధాన్యమిస్తారు. ఈ విధంగా పాటల ద్వారా సాగే ప్రచారాల్లో ఎక్కువగా మహిళలే కీలక పాత్ర వహిస్తారు. మహిళలకే నిర్దేశించిన సీటులో ప్రచారాలకు కూడా మహిళలు పాల్గొనడం వినూత్నంగానే భావించవచ్చును. చాలా సందర్భాల్లో పురుషులే ప్రచారాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. అలాంటిది ఇప్పుడు సంఘటన్ తరఫున ముసుగు లేకుండా ప్రచారాల్లో పాల్గనడానికి స్త్రీలు ఎంతో ఉత్సాహం చూపిస్తున్నారు. వారి ప్రసంగాలు స్థానికులను బాగా ఆకట్టుకున్నాయి.

## ఎన్నికల ఫలితాలు

మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ 2000 సంవత్సరంలో ముగ్గురు అభ్యర్థులను పోటీలో నిలబెట్టింది. ఈ సంస్థ ప్రకటించిన ఘోషణా పత్రంలోని అంశాలను, అభ్యర్థుల గత చరిత్ర ఆధారంగా ఇద్దరు గెలుపొందారు. 2005లో 12 మంది పోటీ చేయగా ఇద్దరు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. (వివరాలు టేబుల్ 1 గమనించాలి)

**ఎంకెఎస్ఎస్ ఎన్నికల విజయాలు**

| | ఎన్నికల సం॥రం | గ్రామ పంచాయతీ పేరు | అభ్యర్థి పేరు | ప్రచారాల ఖర్చు |
|---|---|---|---|---|
| 1. | 2000 | కుశాల్‌పురా | నారాయణ్ | రూ. 1600 |
| 2. | 2000 | తోడ్‌గడ్ | తేజు సింగ్ | రూ. 800 |
| 3. | 2005 | విజయ్‌పురా | కాలూరాం | రూ. 695 |
| 4. | 2005 | కాలేసరియా | బాబూలాల్ రావు కంటే ఎక్కువ | రూ. 1000 |
| 5. | మొత్తం | 4 | 4 | |

## ఓటమి కారణాలు

*సంఘటన్ అభ్యర్థులు ఓడిపోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. ఉదాహరణకు కొన్ని -*

- రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చాలా పటిష్టంగా ఉంది. అందువల్ల స్థానిక సంస్థల్లో ఆ పార్టీకి ఇతర రాజకీయ ప్రత్యర్థులతో పోలిస్తే గట్టి పట్టు ఉంది.
- పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులు గెలవడమే ప్రధానంగా డబ్బును, సారాను విచ్చలవిడిగా పంచిపెట్టారు. అంతర్గతంగా జరిపిన చర్చల్లో నిర్ధారణ అయిన అంశం ఏమిటంటే ఇతరులు సర్పంచ్ పదవి కోసం

రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఖర్చు చేశారని తెలిసింది. వారికి భిన్నంగా సంఘటన్ అభ్యర్థులు పాదయాత్రలను చేస్తూ ఓటర్లను ఆకట్టుకోవడం కోసం ఎలాంటి డబ్బు ప్రలోభాలకు, అడ్డదారులకు పాల్పడలేదు.

* ఓటర్ల బ్యాంకులో వచ్చిన చీలికలు కూడా సంఘటన్ అభ్యర్థుల ఓటమికి ఒక కారణం. ఈ ప్రాంతంలో విభిన్న సామాజిక వర్గాలకు చెందిన వారు నివసిస్తున్నారు. ఇతర పార్టీల వారు ఆయా వర్గాలకు చెందిన వారినే అభ్యర్థులుగా నిలబెట్టాయి. వారిలో ధనబలం ఎక్కువగా ఉండి ఖర్చు పెట్టగలిగిన వారే విజయం సాధించారు.
* సంఘటన్ తరపున బరిలో దిగిన కొందరు అభ్యర్థులు సంస్థ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గనేవారే. అయినా వారికి స్థానికులతో సన్నిహితమైన అనుబంధం లేదు. వారి రోజువారీ సమస్యల గురించిన అవగాహన కూడా లేదు.
* నామినేషన్లను ఖరారు చేయడంలో అధికారులు జాప్యం చేయడం కూడా ఒక కారణం. సంఘటన్ అభ్యర్థి నామినేషన్‌కు కేవలం 24 గంటల ముందు మాత్రమే తుది ఆమోదం లభించింది. ఇది ఓటర్లలో అయోమయానికి కారణమైంది.
* ఎన్నికల గుర్తుల కేటాయింపు కూడా ఓటర్లను గందరగోళానికి గురి చేసింది. ఎన్నికలకు 12 గంటల ముందు మాత్రమే ఎన్నికల గుర్తును కేటాయించడంతో ఓటర్లకు సంఘటన్ చిహ్నాన్ని గురించి స్పష్టంగా వివరించడం సాధ్యం కాలేదు.
* కొన్ని పంచాయతీల్లో అభ్యర్థులు దొరకలేదు. దాంతో మాజీ సర్పంచ్‌ల భార్యలనే సంఘటన్ తరపున పోటీకి నిలబెట్టాల్సి వచ్చింది. అలాంటి వారిని ఓటర్లు సరైన ప్రత్యామ్నాయంగా భావించలేకపోయారు.
* స్వేచ్ఛగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించుకోవడంపై జనాభిప్రాయాన్ని చైతన్య పరిచే ప్రయత్నం ఇంకా పూర్తి కాలేదు. అందువల్ల ప్రజలు నిష్పక్షపాతంగా అభ్యర్థుల మంచిచెడులను బేరీజు వేసుకుని, అడ్డదారులను అనుసరిస్తున్న వారిని గుర్తించి యోగ్యులను ఎన్నుకునే స్థాయికి వారు చేరలేదు.
* సంఘటన్‌కు నాయకత్వం వహిస్తున్న అరుణా రాయ్ ప్రచారాల్లో పాల్గనలేకపోయారు. ఆమె తల్లి అనారోగ్య కారణాల వల్ల ఆమె ప్రచారాలకు దూరంగా ఉండకతప్పలేదు. ఇది సంఘటన్ ప్రచారాల సరళిని బలహీనపరిచింది.

### కొన్ని ఉదాహరణలు

2005 ఎన్నికల్లో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ ఓటమికి సానుకూల, ప్రతికూల కారణాలను గుర్తించడానికి మూడు కేసులను పరిశీలనకు ఎంపిక చేసుకున్నాము. ఒకటి : కుశాల్‌పురా. ఇక్కడ నారాయణ్ సింగా సంఘటన్ తరపున అభ్యర్థిగా బరిలో దిగారు. ఈయన 2000-05 మధ్య సర్పంచ్‌గా పనిచేశారు. రెండోది విజయ్‌పురా. ఇక్కడ కాలూరాం పోటీ చేసి 2005 నుంచి సర్పంచ్‌గా ఉంటున్నారు. మూడోది కువంతాల్. ఇక్కడి అభ్యర్థి సంఘటన్‌కు చెందిన వ్యక్తి కాదు. ఇక్కడ సర్పంచ్‌గా ధకూ దేవి ఉంటున్నారు.

***మొదటి కేసు :*** కుశాల్‌పురా గ్రామ పంచాయతీ రాజ్‌సమంద్ జిల్లా భీమ్ తహశీల్ పరిధిలోకి వస్తుంది. గ్రామ విస్తీర్ణం పది కిలోమీటర్లు. తొమ్మిది వార్డులున్నాయి. ఒక్కో వార్డు పరిధిలో ఒకటి నుంచి ఆరు తండాలు (రెవెన్యూ గ్రామాలు), ఒక్కో తండాలో జనాభా 200 నుంచి 300 వరకు ఉంటుంది. భీమ్ పంచాయతీ సమితిలో రావత్ కులస్తులు (ఓబీసీలు) 65 శాతం, మేఘ్‌వాలాలు 20 శాతం (ఎస్సీ), మిగిలిన 15 శాతం ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతరులు ఉంటారు. వారిలో చాలా మంది జైనులే. కరువు కాటకాలు ఇక్కడ నిత్యం తాండవం చేస్తుంటాయి.

ఓబీసీలైన రావత్ కులాల్లోను, ఇతర అగ్రకులాల్లోను బీజేపీకి పూర్తి మద్దతు ఉంది. అందువల్లనే అన్ని కీలక పదవుల్లోను ఈ పార్టీ వారే ఉన్నారు. భీమ్ పంచాయతీ సమితి ప్రెసిడెంట్ మాన్ సింగా రావత్, రాజసమంద్ జిల్లా పరిషత్ అధ్యక్షుడు మహేంద్రసింగా సోలంకీ (ఇతర కులాలకు చెందిన వ్యక్తి), శాసనసభ్యుడు హరి సింగా రావత్, రాజసమంద్ ఎంపీ కిరణ్ మహేశ్వరి అంతా బీజేపీ వారే.

రావత్ కులాధిక్యత ఉన్న ఈ క్షామపీడిత ప్రాంతంలో సంఘటన్ వంటి రాజకీయేతర సంస్థలు నిలదొక్కుకోవడం నిజానికి ఆశ్చర్యం కలిగించే విషయమే. ఇలాంటి ప్రాంతంలో స్థానికులు సంఘటన్ పట్ల ఆకర్షితులు కావడం, మద్దతుగా నిలబడడం అంటే సంఘటన్ నియమనిబంధనలు, చిత్తశుద్ధి, నాయకత్వ సామర్థ్యం అభినందనీయం. దేవ్‌ధుంగ్రికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న భీమ్ గ్రామంలోని సంఘటన్ కార్యాలయం ఆరంభించిన నాటి నుంచి ప్రత్యామ్నాయ రాజకీయాలకు కేంద్రంగా రూపుదిద్దుకుంది.

1990 నుంచి సంఘటన్ పట్ల ఆకర్షితులైన వారిలో ఒకరు నారాయణ్ సింగ్. ఆయన విద్యాపరంగా పోస్టు గ్రాడ్యుయేట్. ఆసక్తిపరంగా సంఘటన్ కార్యకర్త. సామాజికంగా ఓబీసీ వర్గానికి చెందిన రావత్ కులస్తుడు. ఆర్థికంగా చిన్న రైతు. సంఘటన్ ఆధ్వర్యంలో సంస్థ ఆవిర్భావం నుంచి చేపట్టిన అన్ని కార్యక్రమాల్లోను - భూ పంపిణీ, కనీస వేతనాల కోసం పోరాటాలు, పని చేసే హక్కు, ఆహార హక్కు, సమాచార హక్కు,ల కోసం ఉద్యమాలు - ఆయన చురుగ్గా పాల్గొన్నాడు.

కుశాల్‌పురా గ్రామపంచాయతీకి 2000 వ సంవత్సరంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఆయన సర్పంచ్‌గా గెలుపొందాడు. పదవిలో ఉన్నంత కాలం సంఘటన్ ఆదర్శాలకు, నియమాలకు, ఘోషణ పత్రంలోని హామీలకు కట్టుబడి వ్యవహరించాడు. ప్రణాళికలను ఖరారు చేయడానికి, నిర్ణయాధికారంలో భాగస్థులను చేయడానికి, అధికార యంత్రాంగంలో స్థానికులకు సముచిత స్థానం కల్పించడానికి నిర్దేశించిన విధంగా గ్రామసభలను సమావేశపరిచేవాడు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయసహకారాలతో చేపట్టే అన్ని కార్యక్రమాలను నిజాయితీగా, చిత్తశుద్ధితో, నిష్పక్షపాతంగా అమలు చేయడమే కాక, సామాజిక ఆడిటింగాను ఏటా క్రమం తప్పకుండా సమర్థంగా నిర్వహించాడు. ఆయన పదవీ కాలంలో సమాచార హక్కు ద్వారా ఆశించిన లక్ష్యాలను - పారదర్శకత, బాధ్యతాయుత ధోరణి, జవాబుదారీతనం పాలనాతీరులో ప్రబలంగా వేళ్లూనుకున్నాయి.

ఒక రకంగా ఆయన పదవీకాలంలో సాధించిన సత్ఫలితాలే సంఘటన్ ఆ తరువాత ఎన్నికల్లో కూడా ఆత్మవిశ్వాసంతో పోటీ చేయడానికి స్ఫూర్తినిచ్చింది.

మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ 2004 ఫిబ్రవరిలో సమావేశమై పంచాయతీ ఎన్నికల్లో మరింతమంది అభ్యర్థులను పోటీకి నిలబెట్టాలని నిర్ణయించుకుంది. ఈ ఏడాది సంఘటన్ అభ్యర్థులు, సంఘటన్ మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థులు దాదాపు రాజసమంద్, అజ్మీర్, భిల్వారా, పాలీ జిల్లాల్లోని 12 సర్పంచ్ పదవులకు, అజ్మీర్ జిల్లాలో ఒక పంచాయతీ సభ్యుడి స్థానానికి పోటీ పడుతున్నారు.

వీరంతా కూడా సంఘటన్ రూపొందించిన జన ఘోషణ పత్రం (వాగ్దానాల మేనిఫెస్టో) ఆధారంగా సమష్టిగా ఓటర్లకు నిర్దిష్టమైన ఎన్నికల వాగ్దానాలను ప్రకటించారు. ఇందుకోసం వారు ఏడాది కాలంగా శ్రమించి స్థానిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఆ పత్రాన్ని రూపొందించారు. అందులో బాల్య వివాహాలు, మృత్యుభోజ్ సంప్రదాయం, సారా తాగే దురలవాటు వంటి దురాచారాలతో పాటు ఉపాధి హామీ చట్టం గురించి స్పష్టమైన అభిప్రాయాలను ప్రకటించారు. సంఘటన్ తరఫున, లేక మద్దతుతో పోటీ చేసే అభ్యర్థులెవరైనా రూ. 2000కు మించి ఎన్నికల ప్రచారాలకు ఖర్చు చేయబోరని అందులోనే నిర్ద్వంద్వంగా ప్రకటించారు.

ఇలా ప్రకటించడంలోని ముఖ్య ఉద్దేశం - అధికారికంగా రూ. 5000 వరకు ప్రచారాలకు వినియోగించుకునే సౌలభ్యం ఉన్నప్పటికీ, స్థానిక నిరుపేదలు కూడా ఉత్సాహంగా ఎన్నికల బరిలోకి దిగడాన్ని ప్రోత్సహించాలనేదే. అభివృద్ధి దిశగా సాగే పయనంలో స్థానిక పాలనా వ్యవస్థలో నిరుపేదల భాగస్వామ్యం అనివార్యమనే విషయాన్ని సంఘటన్ గుర్తించింది.

సంఘటన్ పోటీ చేయడానికి ఎంపిక చేసుకున్న 12 గ్రామ పంచాయతీల్లో ఒకటి కుశాల్‌పురా. ఇది 2005లో జనరల్ స్థానం. ఇప్పుడు రొటేషన్ పద్ధతి కారణంగా ఓబీసీ మహిళలకు రిజర్వు అయింది. దాంతో, నారాయణ్ సింగా భార్య తారాదేవిని సంఘటన్ మద్దతుతో అభ్యర్థిగా బరిలోకి దింపవలసి వచ్చింది.

**కుశాల్‌పురా స్థానంలోని మొత్తం అభ్యర్థుల సంఖ్య**

| అభ్యర్థి పేరు | పార్టీ / సంస్థ | కులం | స్వస్థలం |
|---|---|---|---|
| తారాదేవి | ఎంకెఎస్ఎస్ మద్దతు | రావత్ (బీసి) | దేవ్‌దు |
| ప్రేమిదేవి (సర్పంచి) | బీజేపీ | రావత్ | దేవ్‌దుగ్రి |
| గణపతిసింగ్ భార్య | బీజేపీ | రావత్ | పాండి |
| ప్రధాన్ సింగ్ భార్య | కాంగ్రెస్ | రావత్ | కుశాల్‌పురా |
| శ్రీమతి నిర్మలా దేవి | బీజేపీ | రావత్ | అలోక |

కుశాల్‌పురా బరిలో పోటీ పడిన అయిదుగురు ఓబీసీ మహిళల్లో సంఘటన్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఉండగా, అందరూ రావత్ కులానికి చెందిన వారే కావడం గమనార్హం. సంఘటన్ తరఫు అభ్యర్థి తారాదేవి ఘోషణపత్రంలోని వివరాలను ఓటర్లకు వినిపించారు. సర్పంచ్‌గా ఎన్నికైతే లంచాలు తీసుకోవడం గానీ, ఇవ్వడం కానీ చేయనని, ప్రచారాల కోసం రూ. 2000 కన్నా ఎక్కువ ఖర్చు చేయబోనని, ఇతర సంఘటన్ అభ్యర్థుల మాదిరిగానే ప్రకటించారు. ఈ ఎన్నికల్లో కూడా ప్రచార వ్యయం నిర్దేశించుకున్న పరిమితితోనే ముగిసింది.

మొత్తం గ్రామపంచాయతి పరిధిలో సైకిళ్ల ద్వారా మాత్రమే ప్రచారాలు చేపట్టారు. పాద యాత్రలు, ఇంటింటి ప్రచారం, వ్యక్తిగత సమావేశాలు, స్త్రీపురుషులతో, యువతను బృందాలవారీగా కలిసి తమ హామీలను వివరించి ఓటును అభ్యర్థించారు. చివరికి తారాదేవి 50 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు.

తారాదేవి ఓటమికి ధనబలం, సారా పంపిణీ, కుల ప్రాతిపదిక, అధికార పార్టీ అంగబలం ముఖ్య కారణాలని విశ్లేషించారు. వారి విశ్లేషణలో కొంత వాస్తవం ఉంది. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం ఆ విషయాన్నే ధ్రువీకరించింది. వార్డు సభ్యుల సహకారంతో ప్రతి వార్డులోను మూడు నాలుగు ఓట్లను విజేత పక్షం డబ్బుపోసి కొనుగోలు చేసినట్లు ఆయా వార్డులకు సంఘటన్ ప్రతినిధులుగా వ్యవహరించిన మహిళలు తెలిపారు. ఈ ఒక్క అంశాన్నే తారాదేవి ఓటమికి కారణంగా పరిగణించలేము. ఇతర కారణాల్లో చెప్పుకోవలసినవి - ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని ప్రోత్సహించకపోవడం కారణంగా మరో అభ్యర్థి ఎవరూ అందుబాటులో లేకపోవడంతో మాజీ సర్పంచ్ భార్యనే రంగంలోకి దించక తప్పలేదు.

ఇలా డమ్మీ అభ్యర్థులను - సర్పంచ్ పతి - స్థానిక ప్రజలే కాక సంఘటన్ కార్యకర్తలే చాలా మంది సమర్థించలేకపోయారు. విద్య, వైద్యం, తాగునీటి సదుపాయం, మౌలిక వసతుల కల్పన వంటి సామాజిక సమస్యలకు మేనిఫెస్టోలో ప్రాధాన్యమివ్వకుండా వ్యక్తిగత అంశాలను హైలైట్ చేయడం ప్రతికూల ఫలితాలకు కారణమైంది. ప్రస్తుత అంకెల గారడీలాంటి ఎన్నికల జూదంలో కులం, వర్గం, మతం వంటి అంశాలకు ఉన్న ప్రాధాన్యం మరిదేనికీ లేకుండా పోయింది. ఈ ప్రాంతంలో రావత్ కులానికి విపరీతమైన సంఖ్యాబలం ఉంది. అన్ని పార్టీల వారూ తమ అభ్యర్థులుగా ఈ వర్గానికి చెందిన వారినే ఎంపికచేశారు. ఈ కారణంగా ఓటు బ్యాంకు చీలిపోయింది. వారిలో కొందరు, రావత్-ఇతరులు సంఘటన్‌కు అండగా నిలిచారు.

ఓటమికి ఎన్నికల ప్రక్రియ కూడా తన వంతు తోడ్పడింది. ఓటింగుకు ముందు రోజు నామినేషన్ పత్రాలను భర్తీ చేయాల్సివచ్చింది. ఆ కొద్ది వ్యవధిలో అభ్యర్థుల ఆర్థిక, విద్యా, నేర చరిత్ర గురించి పరిశీలించే అవకాశం ఓటర్లకు లేకుండాపోయింది. నామినేషన్ పత్రాలను సమర్పించిన తరువాతనే ఎవరైనా అభ్యర్థిగా పరిగణించబడతారు. ఈ పరిస్థితిలో ఎన్నికల వ్యయంపై విధించిన పరిమితికి అర్థంలేకుండా పోయింది. ఎన్నికల చిహ్నాలను ముందురోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రకటించారు. ఓటు వేయడానికి నిరక్షరాస్యులైన గ్రామీణులకు ఎన్నికల చిహ్నాలు చాలా అవసరం. వాటిని ఆఖరి క్షణంలో ప్రకటించడంతో ఓటర్లలో అయోమయానికి కారణమైంది. వాటి గురించి ప్రజలకు వివరించడానికి వ్యవధి లేకపోయింది.

## విజయపురి గ్రామ పంచాయతీ

రాజసమంద్ జిల్లాలోని దేవ్‌గడ్ పంచాయతీ సమితి కార్యాలయానికి అయిదు కిలో మీటర్ల దూరంలో విజయపురి గ్రామ పంచాయతీ ఉంటుంది. దేవ్‌గఢ్ మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే కామిల్‌ఘాట్‌లో ఈ పంచాయతి కార్యాలయం ఉంది. ఇక్కడ - విజయపురి, హిరాకీ బసి, పుంకియా థాడా, సంగ్రపురా, చేతా హసన్, కిటోకిబడియా, కామ్లా, కామిలీఘాట్ - అని ఎనిమిది వార్డులున్నాయి.




పేదరికం, నిరక్షరాస్యత, కరువు పరిస్థితులు, జీవనోపాధుల లోటు, అట్టడుగు బలహీన వర్గాల ఆధిక్యత, మౌలిక వసతులు - తాగు నీటితో సహా రవాణా, విద్యా, వైద్య రంగాల్లో - లేకపోవడం ఇక్కడ ఉన్న సమస్యలు. తాగునీరే లేని ఈ ప్రాంతంలో వీరికి స్నానం చేయడం అంటే పండగ రోజులాంటిదే. కనీసం రెండు కిలోమీటర్లు, గరిష్టంగా అయిదు కిలోమీటర్ల నుంచి స్త్రీలే నీటిని తీసుకువెళ్లాల్సిన పరిస్థితి. పురుషులు నీటిని మోసుకువెళ్లడం అసలు కనపడదు. గుడ్డలు ఉతుక్కోవడం, వంట చేయడం, పిల్లల ఆలనాపాలన చూడడం, తాగునీటిని మోసుకుతెచ్చుకోవడం, ఇవికాక కూలీ పనులకు వెళ్లి ఇంటి ఆదాయానికి చేదోడుగా నిలవడం ఇలా అన్ని విషయాల్లోనూ స్త్రీలదే బాధ్యత.

వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో ప్రత్యామ్నాయ ఉపాధులు పొందడానికి అవసరమైన శిక్షణ ఇచ్చే కేంద్రాలేవీ దరిదాపుల్లో కనపించవు. మహిళలకు, శిశువులకు పోషకాహారం అనేది అందుబాటులో లేని వస్తువు. బాల కార్మికుల సంఖ్య చాలా ఎక్కువ. స్కూళ్ల నుంచి మధ్యలోనే చదువులు మానేసిన వారంతా ఎక్కడో అక్కడ చిన్న చిన్న కూలీ పనులకు వెళ్లడం సర్వసాధారణం. యువకులు దగ్గరలో ఉన్న పట్టణాలకు వలస వెళ్లి హోటళ్లలోను, దుకాణాల్లోను, ఇళ్ల నిర్మాణ రంగంలోను కాయకష్టం చేసుకుని జీవించేవారే. కొందరు డ్రైవర్లుగాను, హమాలీలుగాను గడుపుతుంటారు. ప్రతి పదిమందిలో ఒకరు చర్మ రోగాలతోను, మహిళల్లోను, పురుషుల్లోను కూడా రక్తహీనత ఎక్కువ. శారీరక శ్రమ ఎక్కువ కావడం వల్ల ప్రమాదాల ముప్పు కూడా ఎక్కువే.

పది కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న పంచాయతీలో ఒకే పోలింగ్ కేంద్రం ఉంది. అది కూడా పంచాయతీ కార్యాలయంలోనే ఉంటుంది. వారు ఓటేయ్యాలంటే ఆ రోజు కూలీ డబ్బులను కోల్పోవాల్సిందే. ఓటు వేసేందుకు కాలినడకన లేదా అభ్యర్థి ఏర్పాటు చేసే వాహనం ఉపయోగించాల్సిందే. ఓటరుకు చేరువగా పోలింగ్ కేంద్రం లేని కారణంగా వారిని తరలించడానికి అభ్యర్థి వాహన సదుపాయం ఏర్పాటు చేయకతప్పదు. అందుకు కొంత సొమ్ము ఖర్చు చేయాల్సిందే. ఇది ఎన్నికల ప్రచార ఖర్చును పెంచేస్తోంది. ఓటింగ్ రోజంతా జరుగుతుంది కనుక ఓటర్లకు భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలి. ఇది అక్కడి ప్రజలు సంపాదించే రోజు కూలీ కన్నా అధికంగా ఉంటుంది.

విజయపురి జనరల్ సీటు. వివిధ వర్గాలకు చెందిన ఏడుగురు అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో కాలూరాం సంఘటన్ తరఫు అభ్యర్థి. కాలూ రాం ఎస్‌సీ (సాల్వే) వర్గానికి చెందినవాడు. గణనీయమైన ఆధిక్యతతో కాలూ ఎన్నికయ్యాడు.

**విజయపురి గ్రామ పంచాయతీ**

| అభ్యర్థి పేరు | పార్టీ/సంస్థ | విద్యార్హత | కులం | వచ్చిన ఓట్లు |
|---|---|---|---|---|
| కాలూరాం సాల్వే | ఎంకెఎస్ఎస్ | 10వ తరగతి | ఎస్‌సీ సాల్వే | 808 |
| జయంత్‌సింగ్ | స్వతంత్ర | 10వ తరగతి | రావత్ ఓబీసీ | 411 |
| వంశీనాథ్ | | నిరక్షరాస్యుడు | జోగి ఓబీసీ | 29 |
| మహేంద్రసింగ్ | | ఓ మోస్తరు | రావత్ ఓబీసీ | 135 |
| మిట్టుసింగ్ | | 4వ తరగతి | రావత్ ఓబీసీ | 151 |
| మూల్‌శంకర్ | | ఓ మోస్తరు | తేలి ఓబీసీ | 42 |
| మేఘకరాజ్ | | 5వ తరగతి | ఎస్‌సీ (సాల్వే) | |

స్థానికులతో జరిపిన సంభాషణలను బట్టి కాలూరాం డబ్బును ఇతరులతో పోల్చినప్పుడు అంతగా ఖర్చు పెట్టలేదు. నలుగురు అభ్యర్థులు ఒక్కొక్కరు రూ. 2 లక్షల వరకు ఖర్చు చేశారని తెలిసింది. ఇలా డబ్బును విపరీతంగా ఖర్చు పెట్టిన/మద్యం పంచిన అభ్యర్థులకు ఓటెయ్యడానికి ఇక్కడి ఓటర్లు ఆసక్తి చూపించలేదు. తాగునీరు, ఆరోగ్యం, విద్యావకాశాలు, ఉపాధి, రవాణా సదుపాయాన్ని పారదర్శక పాలన వారు ఆశించారు. అందుకు వీలుగానే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కాలూరాం విజయానికి దోహదపడిన కారణాలు చాలానే ఉన్నాయి. ప్రజాప్రయోజనాలకు కట్టుబడిన ఆయన వ్యక్తిత్వం వాటిలో ఒకటి. ఆవిర్భావం నుంచి సంఘటన్ కార్యకలాపాలతో ముడిపడిన కాలూరాం కొంతకాలం (1999-2004) వార్డు సభ్యుడుగా కూడా పనిచేశారు. ఆ సమయంలో ప్రజాసేవ చేయడంలోను, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలోను ఆయన చూపిన శ్రద్ధాసక్తులు జనాభిమానాన్ని సాధించిపెట్టాయి.

లబ్ధిదారుల ఎంపికలో ఆయన అనుసరించిన పారదర్శక విధానం, కరువు పనులు, ఎన్‌జీఆర్‌పై పనుల నిర్వహణలో కనీస వేతనాలను సమకూర్చడానికి ఆయన చూపిన పోరాటపటిమ, సూక్ష్మ ప్రణాళిక తయారీలో ప్రజా భాగస్వామ్యం సాధించడానికి చేసిన కృషి, వార్డు సమస్యలను అవగాహన చేసుకోవడానికి వార్డు సభలను నిర్వహించేందుకు తీసుకున్న చర్యలు, వృద్ధాప్య పింఛన్లను సకాలంలో పంపిణీచేయడం, కుల, నివాస, ఆదాయ ధ్రువపత్రాల జారీలో జాప్యాన్ని నివారించిన తీరు ఆయనకు ప్రజల మద్దతును సాధించిపెట్టాయి. ఇక కాలూరాం ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండడం కూడా ఆయనపై విశ్వాసాన్ని సుస్థిరం చేసింది.

మరో కారణం - ఇక్కడ ఎస్‌సీ జనాభా ఎక్కువ. వారిలో సాల్వే వర్గానికి (నేతపనివారు) కాలూరాం చెందినవాడు కావడం కూడా ఆయన విజయానికి తోడ్పడింది. ఇతర ఓబీసీ వర్గాల ఓటర్లు ఇతర అభ్యర్థుల

మధ్య చీలిపోయారు. ఇది కాలూరాంకు సానుకూల అంశంగా మారింది. ఇన్ని సానుకూల అంశాలు ఉన్నా కూడా ప్రస్తుత వాతావరణంలో వార్డు సభ్యుడుగా కాని, సర్పంచ్‌గా కానీ పోటీ చేయడం చాలా కష్టమని ఆయన భావిస్తున్నారు. అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం, డబ్బు, మద్యం ప్రభావం, బూత్‌ల ఆక్రమణ వంటి అనైతిక పద్ధతుల కారణంగా రాష్ట్రపతి పదవికి పోటీ పడడం కన్నా కష్టమైన పనిగా మార్చాయని ఆయన అభిప్రాయపడుతున్నారు.

సర్పంచ్‌గా గెలుపొందినప్పటి నుంచి రూ. 400 లను సంఘటన్ ఖాతాలో జమ చేస్తున్నారు. తన అవసరాలకు గాను కనీస వేతనంతో సమానమైన మొత్తాన్ని రోజుకు రూ. 73 మాత్రమే తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. అధికారుల నుంచి కొన్ని సందర్భాలలో పారదర్శక పాలన అందించడానికి ఇతర ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వ్యతిరేకత ఎదురయిందని ఆయన అంగీకరించారు. గ్రామ కార్యదర్శులుగా ఉన్న వారు సంఘటన్ అధీనంలోని గ్రామాల్లో పనిచేయడానికి కొద్ది మంది మాత్రమే ఆసక్తి చూపిస్తున్నారు. ఇలాంటి చోట్ల పనిచేయడం శిక్షగా వారు భావిస్తుంటారు.

## కువంతాల్

ఇక్కడ సంఘటన్ ప్రభావం లేదు. అందువల్ల ఇక్కడ సర్పంచ్‌గా వేరొకరు ఎన్నికయ్యారు.

రాజసమంద్ జిల్లాలోని దేవ్‌గఢ్ పంచాయతీ సమితిలోనిదే ఈ గ్రామ పంచాయతీ కూడా.

పంచాయతీ ప్రధాన కార్యాలయం నుంచి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉంది. వాటర్‌షెడ్, చెరువు సమీపంలో ఉన్నాయి. ఈ కారణంగా ఇక్కడ కొన్ని వార్డులు ప్రగతి పథంలోనే ఉన్నాయి. మరి కొన్ని వార్డులు ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నాయి. ఇలాంటి ప్రాంతాలు మారుమూల అడవి ప్రాంతంలో ఉండడమే అందుకు కారణం. సాగుయోగ్యమైన భూములను బాగు చేసే క్రమంలో అక్కడి నుంచి సేకరించిన రాళ్లురప్పలతోనే కంచెలను ఏర్పాటుచేసుకున్నారు. ఇలా కంచె నిర్మాణం వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. వ్యక్తిగత వివాదాలకు అవకాశం ఉండదు. వర్షం వచ్చినప్పుడు వర్షపు నీరు వారి భూముల్లోకి ఇంకిపోవడానికి అవకాశం ఉంటుంది.

పాడి పశువుల పెంపకం ఎక్కువే. అందువల్ల ఇక్కడి వారికి పాడి పరిశ్రమ ద్వారా కూడా ఆదాయం సమకూరుతుంది. పరిసరాలన్నీ పచ్చటి చెట్టుచేమతో కళకళలాడుతూ ఉంటాయి. తాగునీటి అవసరాల కోసం కుళాయిలు, చేతి పంపులు, బావులు అందుబాటులో ఉన్నాయి. అన్ని వార్డుల్లోను పాఠశాలలున్నాయి. విద్యుత్, వాటర్‌షెడ్ సదుపాయం సంతృప్తికరం. ఇక్కడి పురుషులంతా హుక్కా పీల్చే అలవాటు ఉన్నవాళ్లే.

73వ రాజ్యాంగ సవరణ ఫలితంగా భూస్వాముల ఆధిపత్యంతో పాటు పురుషాధిక్యతను కూడా దెబ్బతిన్నది.2005లో కువంతాల్ గ్రామ పంచాయతీని మహిళలకు జనరల్ సీటుగా రిజర్వ్ చేశారు. దాంతో 15 ఏళ్లుగా సర్పంచ్‌గా ఉన్న భర్త స్థానంలో ఆయన భార్య ధకూ దేవి పోటీ చేశారు. 2005 ఎన్నికల్లో ముగ్గురు పోటీలో నిలబడ్డారు. వారిలో ఒకరు ఓబీసీ కాగా, మరొకరు ఓసీ అభ్యర్థి.

**కువంతాల్ గ్రామ పంచాయతీ**

| అభ్యర్థి పేరు | సామాజిక స్థాయి | వచ్చిన ఓట్లు |
|---|---|---|
| ధకూ దేవి | గుజ్జర్ (ఓబీసీ) | 860 |
| పార్సీ దేవి | గుజ్జర్ (ఓబీసీ | 540 |
| గ్యాన్ కౌర్ | రాజ్‌పుట్ (ఓసీ | 113 |

ధకూ దేవి 220 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఓసీ అభ్యర్థి 113 ఓట్లను మాత్రమే సాధించారు. అట్టడుగు రాజకీయ చదరంగంలో జనరల్‌కు రిజర్వు చేసిన సోటులో కూడా ఓసీ వర్గాల వారు గెలవడం కష్టసాధ్యంగా మారింది. అందుకు అట్టడుగు వర్గాల వారిలో వచ్చిన చైతన్యమే కారణం.

ఆమె విజయానికి తోడ్పడిన అంశాల్లో ముఖ్యమైనది ఆమె గుజ్జర్ వర్గానికి చెందిన మహిళ కావడమే. ఇక్కడ వారి సంఖ్యే ఎక్కువ. అంతకు ముందు సర్పంచ్‌గా ఉన్న ఆమె భర్తకు స్థానిక ప్రజల్లో ఉన్న సాన్నిహిత్యం మరో కారణం. మరో అభ్యర్థి పార్సీ దేవి కూడా గుజ్జర్ వర్గానికి చెందిన మహిళే. ఆమె భర్త భారీ మొత్తం ఖర్చు చేయడానికి వెనుకాడలేదు. అయినా ప్రచారాల నిర్వహణలో లోపాలు, గుజ్జర్‌లు కాని వారిని ఆకట్టుకోవడంలో విఫలమయ్యారు. ఫలితంగా ఓటమి పాలయ్యారు.

సర్పంచ్‌గా ఎన్నికల్లో గెలుపొందాలంటే కనీసం రూ. 2 లక్షల వరకు ఖర్చు చేయాల్సిఉంటుందని సర్పంచ్‌తో సహా స్థానికులంతా అభిప్రాయపడ్డారు. మందు పోయించడం, వాహనాలు సమకూర్చడం, కుల, రాజకీయ సంబంధాలను ఉపయోగించుకోవడం వంటి మార్గాలను ఆశ్రయించకతప్పదని వారి అభిప్రాయం.

## సారాంశం

అట్టడుగు ప్రజల జీవితాలను ప్రభావితం చేసే యోచనతో రాజకీయాలకతీతంగా ఏర్పడిన మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ వంటి సంస్థలు అనేక కారణాల వల్ల ఎన్నికల బరిలోకి దిగవలసి వచ్చింది. అధికారాన్ని చేజిక్కించుకోవడం కన్నా ఎన్నికల్లో సంస్కరణలకు చోటు చూపించాలన్నదే వీరి ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం గత చరిత్ర ప్రాతిపదికగా అభ్యర్థులను ఎంపికచేయాలి తప్పిస్తే, వారి నేరచరిత్ర, అవినీతి కార్యకలాపాలు కాదని నిరూపించడానికి మాత్రమే సంఘటన్ వంటి సంస్థలు ముందడుగు వేశాయి. ఘోషణపత్రాలు (మేనిఫెస్టో) పాదయాత్రలు, పారదర్శకత ప్రచారాస్త్రాలు కావాలి.

ఈ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకునే సంఘటన్ 2000, 2005 లో ఎన్నికల్లో పోటీ చేసింది. పైన గమనించిన మూడు ఉదాహరణలు పరిశీలిస్తే ఇతర పార్టీల వారు భారీ మొత్తాలను ఖర్చు చేయడమే కాక ఇతర అక్రమ మార్గాలను - మందు పంపిణీ, వంటి వాటికి - పాల్పడినట్లు స్పష్టమవుతుంది. రాజకీయేతర పార్టీలు విజయం సాధించాలంటే స్థానిక సామాజిక పునాదులు అవసరమని ఈ సంఘటనలు నిరూపిస్తాయి.

*- **డాక్టర్ ఇ. వెంకటేష్,** అసిస్టెంట్ ప్రొఫెసర్,*
*సెంటర్ ఫర్ పంచాయతీ రాజ్,*
*నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్,*
*రాజేంద్రనగర్, హైదరాబాద్*
*email: apev@yahoo.com, mobile: 09441482535*




గ్రామంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గర్తించే పటం



గ్రామ సామాజిక పటం

**మన రాష్ట్రంలో వేయి కిలోమీటర్ల కోస్తా ఉన్నది. ఈ తీరాన్ని అనుకుని తొమ్మిది జిల్లాలున్నాయి. కృష్ణా, గోదావరి నదీ తీర ప్రాంతాల్లో తుపాను సమయాల్లో భారీ వర్షాలు కురవటం, వర్షం నీరు బయటకు వెళ్ళే సదుపాయం సక్రమంగా లేకపోవటం వల్ల ఆ జిల్లాలు వరద తాకిడికి ఎక్కువగా గురవుతున్నాయి.**

**వరద యాజమాన్య పద్ధతులు అమలు చేస్తే ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, జీవనోపాధి కోల్పోవటం మొదలైన వాటిని బాగా తగ్గించవచ్చు.**

గ్రామాల్లో పంచాయితీ సభ్యులు, ముందుగా సర్పంచ్ ప్రజలకు సహకారం అందించటంలో చొరవ చూపాలి. విపత్తు యాజమాన్యం కోసం ఒక చట్టం ఉంది. అది విపత్తు నిర్వహణ చట్టం-2005. దీని ప్రకారం గ్రామ పంచాయితీ కొన్ని చర్యలను తప్పనిసరిగా చేపట్టాలని సూచిస్తుంది. గత అనుభవాలు, వరద సమయంలో గ్రామ అవసరాలు, ప్రజల్లో చోటు చేసుకొనే ఆందోళనలు అన్నీ సేకరించి అందరి సహకారంతో నాలుగు రకాల చిత్రపటాలు రూపొందించాలి. సామాజిక చిత్రపటం, గ్రామ భౌగోళిక చిత్రపటం, వనరుల చిత్రపటం, అవకాశాల చిత్ర పటం.

***సామాజిక చిత్రపటం:*** సంఘంలో గల సామాజిక వర్గాలను గుర్తించటం, దీనినే సోషల్ మ్యాపింగు అంటారు.

# వరద యాజమాన్యంలో గ్రామ పంచాయితీల పాత్ర







***భౌగోళిక చిత్రపటం:*** ఎత్తు – పల్లాల గుర్తింపు వనరుల చిత్రపటం. దిశల గుర్తింపు చెరువుల వివరాలు గ్రామంలో మౌలిక సదుపాయాలను గుర్తించటం.

***జనాభా చిత్రపటం:*** కుటుంబాల వివరాలు, కుటుంబాల సంఖ్య, స్త్రీ, పురుషుల సంఖ్య, పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, వికలాంగులు, వృద్ధులు మొదలగు జనాభా వర్గీకరణ చిత్ర పటం తయారు చేయటం

***అవకాశాల చిత్రపటం:*** ప్రాణ నష్టం, ఆస్తి నష్టం తగ్గించే అవకాశాలు గుర్తించటం.

దీనిలో చూపిన విధంగా సామాజిక, భౌగోళిక, జనాభా, అవకాశాల చిత్రపటాన్ని గుర్తించాలి.

వరద విపత్తు సూచన రావటం మొదలు గ్రామ పంచాయితీలలో సర్పంచు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ఈ క్రింద వివరించబడిన అంశాలు వెంటనే చేపట్టటం మూలంగా ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నుంచి బయట పడగలం.

★ గ్రామంలో గాలి తాకిడికి గురయ్యే ప్రాంతాలు గుర్తించాలి.

★ గ్రామ భౌగోళిక అంశాల మీద అవగాహన కల్గించాలి.

★ చెరువుల వివరాలు సేకరించాలి.

★ నివాస ప్రాంతాలు గుర్తించాలి.

★ జనాభా వివరాలు సేకరించాలి.

★ లోతట్టు ప్రాంతాలు గుర్తించాలి.

★ వరద ప్రాంతాల్లో వ్యక్తిగత ఆస్తుల వివరాలు, ప్రభుత్వ ఆస్తుల వివరాలు సేకరించాలి.

★ చెరువుగట్లను గమనించాలి.

★ వరద షెల్టర్లను గుర్తించాలి.

★ సురక్షిత ప్రాంతాలను గుర్తించాలి.

★ త్రాగునీటి సదుపాయాలు గమనించాలి.

★ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గుర్తించాలి.

★ గ్రామ రోడ్లను గుర్తించాలి.

★ వరదకు రోడ్లు మునిగితే ప్రత్యామ్నాయ మార్గాలు గుర్తించాలి.

★ పోలీస్ స్టేషను వివరాలు గుర్తించాలి.

★ విద్యుత్, టెలిఫోన్, పోస్టాఫీసు ఇతర సదుపాయాలను గమనించాలి.

★ ముంపు ప్రాంతాలను గుర్తించాలి.

★ పశువుల రక్షణ ఏర్పాట్లు చేయాలి.

★ వరద సమయంలో సురక్షిత ప్రాంతాలకు చేరే మార్గాలు అన్వేషించాలి.

★ వరద యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి.

★ 25–35 సంవత్సరాల యువకులకు ప్రాథమిక శిక్షణ ఇప్పించాలి.

★ విపత్తుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచటం కోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేసుకోవాలి.

★ గ్రామాల్లో వివిధ అంశాలను పరిశీలించి వరదకు ముందే కొన్ని పనులు చేసుకోవాలి. అవి – పల్లపు ప్రాంతాలను గుర్తించి చదును చేయటం. చెరువు గట్లను బాగు చేసుకోవటం. కోతకు గురయ్యే నేలలను గుర్తించి గట్టి పరచటం. పశువుల పాకల్ని, పొలాల్ని, ఇళ్ళను ముంచే చెరువులను, కాల్వలను గుర్తించి వాటిని ప్రమాద రహితంగా మార్చటం.

★ వరద హెచ్చరిక రాగానే సహాయ కార్యక్రమాలు, రక్షణ కోసం గ్రామాలలోని ఉత్సాహం, సమర్థత ఉన్న వాలంటీర్లను ఎంపిక చేసి బృందాలుగా ఏర్పరచటం.

★ ప్రచార, రక్షణ, షెల్టర్ ఏర్పాటు బృందాలకు ఏ ఏ కార్యక్రమాలు నిర్వహించాలో శిక్షణ ఇవ్వటం. ఆ శిక్షణా కార్యక్రమంలో వారు




**తుపానులో ఉపయోగపడే రక్షణసామాగ్రి**

## ప్రథమ చికిత్సా పరికరాలు



సరిగా అర్థం చేసుకున్నారా లేదా పరిశీలించాలి. లోటుపాట్లతో రిహార్సల్స్ చేపట్టాలి.

★ వరద హెచ్చరిక బృందం వారు రేడియో, టి.వి వైర్‌లెస్‌ల ద్వారా తమకు అందిన వరద హెచ్చరికలను, వాతావరణ వివరాలను అందరికీ తెలియ చేయాలి.

★ ప్రథమ చికిత్సపై అవగాహనను యువతీ, యువకులకు తప్పనిసరిగా కల్పించాలి. దీని వల్ల వైద్యులు వచ్చే లోపు ప్రజలకు కాపాడే వీలుంటుంది.

★ పారిశుద్ధ్య బృందాలను తయారు చేసుకోవాలి. ప్లాస్టిక్ వస్తువులు, సీసాలు అడ్డు నిలిచి వరదనీరు ఎదురు తన్నకుండా మురుగు కాల్వలను శుభ్ర పరచాలి.

★ నీళ్ళను బయటకు పంపే అలుగు, కళింగల్ని తవ్వించాలి. శుభ్రంగా ఉంచాలి.

★ షెల్టర్లలో మురుగు దొడ్లు లేనట్లయితే తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసి చిన్న, చిన్న మరమ్మత్తులు చేస్తుండాలి.

★ వరద హెచ్చరిక రాగానే మైకులు, టార్చిలైట్లు, పెట్రోమాక్స్ లాంతర్లు సిద్ధం చేసుకోవాలి.


















★ వరద రాగానే కరెంటు తీస్తారు కాబట్టి ఓవర్ హెడ్ ట్యాంకులో నీరు నింపుకోవాలి.

★ వైద్య విభాగ అధికారులతో కలిసి మందులను సిద్ధపరచుకోవాలి.

★ పౌర సరఫరాల విభాగం వారి సహకారంతో రేషన్ సరుకులు సిద్ధం చేసుకోవాలి.

★ గ్రామంలోని వాహనాలన్నింటినీ ప్రజలకు తరలించటానికి సిద్ధంగా ఉంచాలి.

★ అధికారుల సమన్వయంతో వారి సూచనల ప్రకారం అందరూ నడుచుకోవాలి.

ప్రకృతి విపత్తులను అరికట్టలేము. వాటి నియంత్రణ కొంత మేర సాధ్యం అవుతుంది కావున మానవ ప్రయత్నం అత్యవసరం.

*డా॥ ఏ. నిర్మాలా దేవి*
*ఫ్యాకల్టీ, సి.యమ్.ఇ.డి., అపార్డ్*

# ఆముక్తమాల్యద - రాయల గుండెచప్పుడు

శ్రీకృష్ణదేవరాయలు సాహితీ సమరాంగణ చక్రవర్తి. నిరంతరం ఎడతెరిపిలేని యుద్ధాలతో జీవితం గడుపుతూ ఉండి కూడా కావ్యసామ్రాజ్యాన్ని సృష్టించిన సృజనకారుడు. ఒక్క తెలుగుజాతినే కాదు యావత్భారతదేశాన్ని కొన్ని శతాబ్దాలుగా తన వైపు తిప్పుకొన్న వీరుడు. కళాపోషకుడు.

విజయనగర సామ్రాజ్యకీర్తిని విశ్వవ్యాప్తం చేసిన ఘనుడు. భువనవిజయమనే పేరుతో ఎందరో కవులను, కళాకారులను పోషించాడు. రాయల కొలువులో అనేక భాషలకు సంబంధించిన పండితులున్నారు. అనేక శాస్త్రాలకు సంబంధించిన పండితులూ ఉన్నారు.

ఆంధ్రభోజుడిగా, అపరభోజుడిగా సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా కీర్తి వహించిన వాడు. అష్టదిగ్గజాలనే పేరుతో కళల్ని ఆరాంధించిన కళాపోషకుడు. అష్టదిగ్గజాలలో పెద్దన, తిమ్మన, మాదయగారిమల్లన, ధూర్జటి మొదలయిన తెలుగు కవులు; కవిరాజు బిరుదాంచితుడైన కుమార డిండిమ కవిసార్వభౌముడు, భానుదత్తుడు మొదలయిన సంస్కృతకవులు; సంగీత సూర్యోదయకర్త బండారు లక్ష్మీనారాయణ, ఇంకా వివిధ కళాకారులు ఉన్నారని ప్రతీతి.



నిత్యం వాద ప్రతివాదనలతో, కావ్యపఠనాదులతో, వివిధ కళల ప్రదర్శనలతో భువనవిజయం అలరారేది. కవిపండితులతో పాటుగా సంగీతం, నృత్యం, శిల్పం, చిత్రలేఖనం, ఇంద్రజాలం వంటి కళాకారులూ తమ ప్రతిభాపాండిత్యాలను రాయల ఆస్థానంలో ప్రదర్శించే వారు.

పిచ్చుకగుంటులు, వీధి భాగవతులు, దాసరులు వంటి జానపద కళాకారులను సైతం రాయలనాటి సమాజంలో ఆదరించేవారు. ఈ విషయాలన్నీ ఆముక్త మాల్యదలో రాయలు ప్రదర్శించిన బహుముఖ పాండిత్యం, లోకనీతి, సామాజిక అవగాహన వంటి అంశాల ద్వారా తెలుస్తున్నాయి.

తెలుగ దేల యన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ తెలుగొకండ
ఎల్ల నృపులు కొలువ ఎరుగవే బాసాడి
దేశభాష లందు తెలుగు లెస్స

అని శ్రీకృష్ణదేవరాయలు తెలుగుభాష గొప్పదనాన్నీ కీర్తించాడు. ఎన్నో భాషలు నేర్చిన వాడు ఆ మాట చెప్పడం తెలుగు కీర్తికి కలికితురాయిగా పేర్కొనవచ్చు.

నగరజీవనంతో పాటుగా పల్లెటూళ్ళలో నివసించే సామాన్య జనుల జీవితాన్ని కూడా వర్ణించాడు. ఇది రాజుగా రాయలకి ఉన్న గొప్ప ఉత్తమ పాలకలక్షణాన్ని తెలియజేస్తుంది. దాసరి, బ్రహ్మరాక్షసుడు మొదలయిన పాత్రల నిర్వహణలో రాయల సునిశితమయిన వీక్షణం కన్పిస్తుంది. ప్రతి సామాజికాంశాన్ని తన కవితామయమయిన కల్పనలతో అద్భుతంగా అవిష్కరించడం రాయల ప్రత్యేకత.

గండాభోగములన్ ముదశ్రు లహరుల్ గప్పన్నుతుల్ పాడియా
దండన్ వ్రేగును డించి భక్తిజని తోద్య త్తాండవం బాడు నా
చండాలేతర శీలు డుత్పులికి యై చాండాలికన్మీటు చున్
గుండు ల్నీరుగ నెండగాలి పసితాకుం జూడ కాప్రాహ్ణమున్.

ఇది దాసరిలో ఉన్న భక్తికి పరాకాష్ఠ, విష్ణుచిత్తుడిపాత్ర ద్వారా కర్మనిష్ఠను ప్రదర్శించాడు. తాను నమ్మిన విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించే కావ్యంగా ఆముక్తమాలద్యను రచించాడు.

గృహ సమ్మార్జనమో జలాహరణమో శృంగారపల్యంకికా
వహనంబో వనమాలికాకరణమో వాల్లభ్య లభ్యధ్వజ
గ్రహణంబో వ్యజనాతపత్ర ధృతియో ప్రాగ్దీపికారోపమో
నృహరీ వాదములేల లేరె ఇతరుల్ నీ లీలకన్ పాత్రముల్

దేవాలయానికి సంబంధించిన ఏ పని చెప్పినా చేయగల సమర్థుడనయిన నన్ను పాండ్యరాజు సభలో వాదించమనడమేమిటని అంటున్న విష్ణుచిత్తుడి మాటలో ఈ కర్మనిష్ఠ ప్రతిఫలిస్తుంది. ఇదే దాస్య భక్తి. రాయలు రాజయినా దీనిని ప్రదర్శించాడు.

యామునాచార్యుడు చెప్పిన రాజనీతి ఏ కాలానికైనా ప్రభుత్వానికి అనుసరణీయమయినది. ఖాండిక్య కేశిధ్వజుల పాత్రలద్వారా త్యాగనిరతి, బ్రహ్మజ్ఞానోపాసన వంటి దివ్య లక్షణాలను ప్రతిపాదించాడు.

రాజనీతి, ఆర్థిక, వాణిజ్య, సామాజిక, కళా రంగాలతో ప్రత్యక్ష అనుభవం గడించిన వాడు. రాయలు ప్రజల మనిషి. ప్రజల సంక్షేమానికి ఏ ఏ నిర్ణయాలు, పథకాలు తీసుకోవాలో వాటన్నింటినీ దూరదృష్టితో తీసుకొన్న దార్శనికుడు.

ఆముక్త మాల్యద ప్రబంధం రాయల రాజనీతి విజ్ఞానానికి నిలువెత్తు నిదర్శనం. పాలకుడికి అన్ని రంగాల పైనా అనుభవం ఉండాలి. ఏ రాజుకీ ఉండనంత లోకానుభవం, సునిశిత పరిశీలన, ప్రజాజీవనం పట్ల స్పష్టమయిన అవగాహన శ్రీకృష్ణదేవరాయలకు ఉన్నాయి.

రాయలకు వ్యవసాయం, ఖర్జూరాలు, పుష్పమంజరులు, మామిడిగుత్తులు, కుసుమములు, సంపెంగలు, పచ్చగన్నేరులు, పాళెలు మొదలయిన ధాన్యవిశేషాలు తెలుసని ఆముక్తమాల్యద ద్వారా తెలుస్తోంది.

ప్రజాసంక్షేమం పట్ల రాయలకు గాఢమయిన ఆకాంక్ష ఉంది. ఈతిబాధలు రాకుండా చూసుకోవడం రాజు బాధ్యత అనీ రాయల అభిప్రాయం. విశాలమైన రహదారులు, దారిపక్కన చెట్లు, ఉండాలన్న ఆలోచనల ద్వారా రాయలు ప్రజలకు సదుపాయల్ని కలిగించటం తన బాధ్యతగా గుర్తించినట్లు తెలుస్తోంది. అలాగే ప్రజలపై పన్ను భారం వేయకూడదని, వారు పన్నును ఆనందంగా స్వచ్ఛందంగా కట్టేలా రాజు నమ్మకం కలిగించాలనే అభిప్రాయం రాయలకి ఉంది.

సత్యావధూప్రీణనం, మదాలసచరిత్ర, సకలకథాసార సంగ్రహం, జ్ఞానచింతమణి, రసమంజరి, జాంబవతీ పరిణయం రాయలు రాసిన కావ్య నాటకాలు అతడి ప్రతిభను చాటి చెప్తున్నాయి.

సంస్కృతం, ఆంధ్ర, తమిళ కన్నడాది భాషలలో పాండిత్యం, వివిధ శాస్త్రాలపై విశేష అభినివేశం, కళల్ని ఆదరించే సహృదయత, కావ్యసృష్టి కలవాడు రాయలు. అందుకే అతడు తెలుగు సాహితీలోకానికే కాక మొత్తం తెలుగు వాళ్ళందరికీ ప్రాతః స్మరణీయుడయ్యాడు. పాలన, కళారాధన, సామ్రాజ్య విస్తరణ, కావ్య సృష్టి రాయలను అందరి రాజులకంటే విశిష్టస్థానంలో నిలబెట్టాయి.

**- శ్రీనివాస్**

# తొలి తెలుగు గణిత శాస్త్రవేత్త

# పావులూరి మల్లన

**రాజ రాజ నరేంద్రుని పుణ్యమా! అని తెలుగుభాష వెలుగులోకి వచ్చింది. సంస్కృతంలో ఉన్న భారతం, నన్నయ చేతిలో రమణీయతను సంతరించుకుంది. పురాణానువాదమే కాక, శాస్త్ర గ్రంథాలు కూడా అనువాదానికి నోచుకున్నాయి. ఆ కోవలో తెలుగులో పావులూరి మల్లన గణితశాస్త్రాన్ని రచించాడు. దాని పేరు సార సంగ్రహ గణితం.**

పడగ మీద మణిఫిణికి అలంకారం
శిరసు మీద శిఖికి పింఛమలంకారం
సర్వ శాస్త్రాలకి గణితం అలంకారం

కాలాన్ని కొలిచినా, దూరాన్ని లెక్కగట్టినా, కాంతిని, ప్రవాహవేగాన్ని, అంచనా వేసినా గణితమే ఆధారం. ఇది గణితం అని తెలియకుండానే, 'బారెడు' ప్రొద్దెక్కిందని, సూర్యుడు నడినెత్తికొచ్చాడని అంటూ ఉంటాం. అమ్మ వంట చేస్తూ ఉప్పు, పులుపు, కారాలను చేతికొలతతో వేస్తుంది. ఇదంతా గణితంలో భాగమే. ఇది వ్యావహారిక గణితం.

పావులూరి మల్లన కూడా నన్నయకు సమకాలికుడే. ఈ కవి రచించిన సారసంగ్రహ గణితాన్ని గురించి సుప్రసిద్ధులైన నిడుదవోలు వెంకటరావు ఈ విధంగా వ్రాశారు.

"తెలుగు భాషలో వెలసిన శాస్త్రీయ గ్రంథాలలో పావులూరి గణితము బహుళ ప్రచారము బడసినది. ఇది ఆంధ్ర జైన వాఙ్మయానికి సంబంధించినది. ఆంధ్ర జైన వాఙ్మయం నందలి కావ్యాలు నశించినా, శాస్త్రీయ గ్రంథాలు నిత్య వ్యవహారమున కుపయుక్తము లగుటచే నిలిచినవి".

నిడుదవోలు పై విధంగా తమ అభిప్రాయాన్ని వివరించినప్పటికీ, పావులూరి మల్లన రచించిన గణిత గ్రంథానికి ఆంధ్రజైన వాఙ్మయానికి ఏ విధమైన సంబంధం లేదు.

భాష అయినా, శాస్త్రమైనా, మరేదయినా ఏదో ఒకనాడు హఠాత్తుగా పుట్టదు. దాని ఆవిర్భావానికి కొంత సమయం పడుతుంది.

నన్నయ భారతం, సంస్కృతం నుండి తెలుగులోకి రావడానిక్కూడా చాలా కాలం పట్టింది. పదాలు, వ్యాకరణం మొదలైనవి కావ్యరూపం ధరించడానికి సహకరించాయి. అదే విధంగా సంస్కృతంలో కూడా పావులూరి మల్లనకు పూర్వం కొన్ని గణిత గ్రంథాలు పుట్టాయి.

**పావులూరికి పూర్వపు గణితం**

కాలాన్ని గణిస్తూ, అత్యల్ప కాలాన్ని ఎలా గుర్తించాలి? - అని వ్యాసుల వారిని మహర్షులడిగారు. అప్పుడాయన సన్నని సూదిమొన, అతి సున్నితమైన తామరపూవు రేకు మీద గ్రుచ్చితే, ఆ మొన బయటకు రావడానికి వచ్చే సమయం 'అత్యల్పకాలం' అని సమాధానమిచ్చారు.

గ్రహగమనాలను లెక్కించారు. సూర్య, చంద్ర గ్రహణాల సమయాలను గణించారు. వరాహమిహిరుడు, ఖగోళశాస్త్రం గురించి సశాస్త్రీయ ప్రమాణాలను చూపించారు.

సంస్కృతంలో మహావీరాచార్యుడు, 'గణిత సార సంగ్రహమ్"అనే గ్రంథాన్ని రచించాడు. వేదకాలంలో అంక గణితం, బీజగణితం ప్రచారంలో ఉన్నాయి. పూర్వకాలంలో మహర్షులు యజ్ఞాలు చేశారు. మహారాజుల చేత యజ్ఞాలు చేయించారు.

యజ్ఞాలు చెయ్యడానికి హోమగుండాలు కావాలి కదా! యజ్ఞకుండాలు ఎలా నిర్మించాలి? అన్న ప్రశ్న ఉదయించినప్పుడు చతురస్రంగా, దీర్ఘచతురస్రంగా, త్రిభుజాకారంగా, గుండ్రంగా ఉంటాయి. వాటి కొలతలు కూడ ఉపనిషత్తులలో ఉన్నాయి.

## తెలుగు సాహిత్య చరిత్ర

యమధర్మరాజు, హోమగుండానికెన్ని ఇటుకలు ఏ విధంగా నిర్మించాలో కఠోపనిషత్తులో నచికేతునకు చెప్పాడు.

లోకాది మగ్నిం తమువాచ తస్మై
యా ఇష్టకా యావతీర్వా యథా వా ।
సచాపి తత్ప్రవదద్య థోక్తం
అథాస్య మృత్యుః పునరేవాహ తుష్టః ॥

గణితం ఈనాటిది కాదు. మానవ జీవనసరళిలో ఒక భాగమై ఉంది. చరిత్రకందినంత వరకు క్రీ.శ. 400వ సంవత్సరం నుండి గణితం వెలుగులోకి వచ్చింది. బ్రహ్మగుప్తుడు క్రీ.శ. 7వ శతాబ్దంలో గణితంలో అనేక కోణాల్ని వెలువరించాడు. ఈయన ఒకటి నుండి తొమ్మిది వరకు గల అంకెలను తెలియజేశాడు. ఆ తరువాత 'సున్న' (శూన్యం) కనిపెట్టారు. వేదాలలో కూడా శూన్యం (సున్న) యొక్క ప్రసక్తి ఉంది.

ఓమ్ పూర్ణమదః పూర్ణమిదం
పూర్ణాత్ పూర్ణత్వ ముచ్యతే ।
పూర్ణ స్య పూర్ణ మాదాయ
పూర్ణమేవావ శిష్యతే ॥

పూర్ణము అనగా శూన్యం. అది శూన్యం. ఇది శూన్యం. శూన్యానికి శూన్యం కలిపినా, శూన్యం నుండి శూన్యం తీసివేసినా వచ్చే సమాధానం శూన్యమే.

అంకెకు సున్న కుడి ప్రక్కనుంటే (10) విలువ పెరుగుతుంది. ఎడమ ప్రక్కన సున్న ఉంటే విలువ పెరగదు (01).

*"అంకానాం వామగతో గతిః"* - అంకెల విలువ వెనుక (కుడి నుండి ఎడమకు) నుండి పెరుగుతుంది.

*ఉదా:- 1 2 3 4 5*

మొదట్లో గణితమంతా ఒకట్లలోనే జరిగేది

**"ఆరు నొక్కట్ల నొడువుగా నమరబెట్టి**
**యం న గణకంబు చేతను నమర బెంచి**
**సోరిది వర్ణించి జనులకు చోద్యముగను**
**హిమకరోపమ లబ్ధంబు నెరయ వచ్చు"**

దీని భావం ఏమిటంటే ఆరు ఒకట్లను (1,11,111) ఆరు ఒకట్ల చేత (1,11,111) పెంచితే, అనగా హెచ్చించితే ఎంత అవుతుంది?

| | | |
|---|---|---|
| | 1,11,111 | X |
| | 1,11,111 | |
| సమాధానం: | 12345654321 | |

అంకెలు సమాధానంలో ముందు ఆరోహణ క్రమంలో ఆరు వరకు వస్తాయి. తరువాత అవరోహణ క్రమం 5తో ప్రారంభమై ఒకటి వరకు వస్తుంది.

*మల్లన కవి, మరొక పద్యంలో-*

**మొదలొకటి నిల్పి, దానిం**
**గదియగ తుదిదాక రెట్టిగా గూడినబో**
**విదితముగ పల్కు మాకుం**
**జదరంగపు టిండ్లకైన సంకలిత మొగిన్**

ఒకటి, దానికి రెట్టింపు రెండు, రెండుకి రెట్టింపు నాలుగు, దానికి రెట్టింపు ఎనిమిది, ఎనిమిదికి రెట్టింపు పదహారు - విధంగా 64 దాకా వేస్తే వచ్చే మొత్తమెంత? - అని ప్రశ్న.

*దీనికి సమాధానంగా -*

**శర శశి షట్క చంద్ర శర సాయక రంధ్ర వియన్నగాగ్ని భూ**
**ధర గగనాబ్ధి వేద గిరి తర్క పయోనిధి పద్మజాస్య కుం**
**జర తుహినాంశు సంఖ్యకు నిజంబగు తచ్ఛ తురంగ గేహ వి**
**స్తరమగు రెట్టి రెట్టికగు సంకలితంబు జగత్ప్రసిద్ధికిన్**

ఇక్కడ శర, శశి, షట్క. . . అనే వాటికన్నింటికి అంకెలున్నాయి.

| | | |
|---|---|---|
| శర | = | శరములు, పంచబాణాలు (5) |
| శశి | = | చంద్రుడు - ఒక్కడే (1) |
| షట్క | = | ఆరు (6) |
| చంద్ర | = | మళ్ళీ చంద్రుడు (1) |

ఈ విధంగా పై నున్న పద్యంలోని పదాలను అంకెలతో క్రీ గీతల క్రింద సూచిస్తారు.

దీని వలన 51615590737044764481 వస్తుంది. మన సంప్రదాయాన్ననుసరించి అంకెలను వెనుక నుండి వెయ్యాలి. అపుడు సరిఅయిన 18446 74407 37095 51615 అనే సమాధానం వస్తుంది.

## గణితంలో శృంగారం

ఒక మహారాజు ఒకనాటి రాత్రి దేవిగారి శయన మందిరానికి వచ్చాడు. పానుపెంతో రమణీయంగా అలంకరింపబడి ఉంది. మహారాణి కూడా శృంగారరసాధి దేవతలాగా, మహారాజు ఎదుట నిలబడి ఉంది. ఆమెను చూసి మహారాజు చేతులు చాచాడు. ఆమె ఆయన బాహువుల్లో ఇమిడిపోయింది. మహారాజు మహారాణి ఊహించని రీతిలో దోసెడు ముత్యాలు మహారాణి శిరసు మీద పోశాడు. కొన్ని ముత్యాలు మంచం మీదపడ్డాయి. కొన్ని చిందర వందరగా నేలమీద పడ్డాయి. ఈ ఆనందానికి స్పందిస్తూ మహారాజును ఆనందలోకాల్లో విహరింపజేసింది.




తరువాత "ఇవి నాకే కాదు. మా మరో యిద్దరు సవతులకు కూడా పంచుతా" అంది. రాజు సరేనన్నాడు. పరిచారికల చేత ముత్యాలనన్నింటిని ఏరించింది. వాటిని మూడు సమభాగాలు చేసింది. అప్పుడు ఒకటి మిగిలిపోయింది. తన భాగం తీసి కొని, మిగిలిన దానిని తన పరిచారికకు ఇచ్చింది.

మిగిలిన వాటిని రెండవ పరిచారిక తిరిగి మూడు భాగాలు చేసింది. మళ్ళీ ఒకటి మిగిలింది. దానిని తాను తీసుకుని రెండవరాణి భాగాన్ని ఆమెకు అందజేసింది.

మిగిలిన ముత్యాలను మూడవ రాణికి

పంపారు. ఆమె కూడా తన దగ్గరకు వచ్చిన వాటిని మూడు వంతులు చేసింది. మళ్ళీ ఒక ముత్యం మిగి లింది. దానినామె తన చేతికి ఇచ్చింది.

అంతలో మహారాజు మూడవ రాణి మందిరానికి వచ్చాడు. అక్కడున్న మిగిలిన ముత్యాలను చూశాడు. మూడు భాగాలు చేశాడు. ఒక్కటి కూడా మిగులకుండా అవి సరిగా మూడు భాగాలయ్యాయి. మహారాజు వాటిని ముగ్గురకు అందజేశాడు.

అయితే మహారాజు మొదటి భార్య శిరసు మీద పోసిన ముత్యాలెన్ని?

**సూచన :** లెక్క చేసి చూడండి.




**సమాధానం:** ఇరవైఅయిదు ముత్యాలు

మరొక సమస్య చూద్దాం. ఇది చిన్న పిల్లలకు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది.

రాముడు రవితో, నువ్వొక అంకె తలుచుకో అన్నాడు.

వెంటనే రవి (4) తలుచుకున్నాడు.

రాముడు - దానికి తలుచుకున్నంత అప్పు తెచ్చి కలుపు

రవి (మనసులో) 4 + 4 = 8

రాముడు ఆ మొత్తానికి 6 కలుపు

రవి - (మనసులో) 8 + 6 = 14

రాముడు ఆ మొత్తంలో సగం దేవుడికియ్యి

రవి - 14 / 2 = 7 (14 - 7 = 7)

రాముడు: తెచ్చిన అప్పు తీర్చెయ్యి

రవి 7 - 4 = 3

రాముడు రవితో నీ దగ్గరున్న మొత్త - 3 అన్నాడు

ఆ సమాధానం విని రవి ఆశ్చర్యపోయాడు.

ఇదెలా సాధ్యం?

చాలి తేలిక. ఒక్క రవితోనే కాదు. ఎంతమంది కూర్చున్నా, ఎవరే అంకె తలుచుకున్నా వచ్చే సమాధానం మనం ఇచ్చి కలుపుకొనే అంకె మీద ఆధారపడి ఉంటుంది.

మనం ఇచ్చిన అంకెలో సగం, దాని సమాధానం

మీరు కూడా ప్రయత్నించి చూడండి

ఇటువంటిదే మరోకటి చూద్దాం.

ఒకడు: నువ్వొక అంకె తలుచుకో - 7

దానిని 5 పెట్టి హెచ్చించు - 7 X 5 = 35

దానికి 5 కలుపు 35 + 5 = 40

ఆ మొత్తాన్ని 2 చే గుణించు 40 X 2 = 80

ఆ మొత్తానికి 2 కలుపు 80 + 2 = 82

ఇప్పుడా మొత్తమెంతో చెప్పు - 82

ఆ సంఖ్య విన్న తర్వాత ప్రశ్న అడిగిన వ్యక్తి 82 లోని 2 ని విడిచిపెట్టాలి. అపుడు 8 మిగులుతుంది. దానిలో నుండి 1 తీసివేస్తే 7 వస్తుంది. అతడు తలుచుకొన్న అంకె - 7. ఇది సమాధానం.

ఈ లెక్క ఎంత పెద్ద సంఖ్యతోనైనా చెయ్యవచ్చు.

సంఖ్య మొత్తం చెప్పాక చివరనున్న 2 తొలగించి, మిగిలిన దానిలో నుండి 1 తీసివెయ్యాలి. అదే అతడు తలచుకొన్న అంకె.

ఇందుకు ముందు లెక్కలో అయితే అందరికి మిగిలే సమధానం ఒకలాగే ఉంటుంది.

ఈ లెక్కలో ఎవరి సమాధానం వారిదే.

పావులూరి వారి మరో పద్యం చూద్దాం.

**"చెలికి షడంశమున్ ప్రియకు శేషము లోపల పంచమాంశమున్**
**పాలుపుగ దాని శేషమున బోదకు నాలవపాలు నిచ్చి, అం**
**దుల తనపాలు తాగొనియె, తొమ్మిది జేనలు రాజహంసమీ**
**నలిన మృణాల మెంత? సుజనస్తుత మా కిరుగంగ చెప్పమా"**

(ఈ లెక్క మీరు చేసి చూడండి)

రాజరాజ నరేంద్రుడు కవితాప్రియుడు కనుక, పావులూరి మల్లనకు పిఠాపురానికి సమీపంలో ఉన్న నవశాండవాడ అనే అగ్రహారాన్ని శాసనపరంగా దానం ఇచ్చాడు. గణితశాస్త్ర గ్రంథం వ్రాసిన కారణంగా మల్లన కవే కాక, శాస్త్రజ్ఞుడు కూడా.

*- వారణాసి వేంకటేశ్వర శాస్త్రి*

# ఊత

## చింతా అప్పలనాయుడు

**"రాములు బావో...! ఎక్కడి నుంచో నీకు ఫోనొచ్చిందట" రోడ్డు మీద నిల్చొని భోగేసు అందించిన కబురుకు గడపయ్య గొర్రెపిల్లకు రొడ్డ కొమ్మలు మేపుతున్న రాములు తుళ్ళిపడ్డాడు. మరుక్షణంలో తేరుకొని పరుగులాంటి నడకతో టెలిఫోను బూతు చేరుకున్నాడు.**

**"అలో నేను కొసింటి రాముల్ని మాట్లాడతన్ను మీరెవులు"**

**కొద్దిసేపు మాట్లాడి ఫోను పెట్టేసి మౌనంగా ఇంటి వేపు అడుగులేస్తూ వస్తున్నాడు.**

**"ఎక్కడి నుంచి ఫోను. . . ఎందలగున్నావు.. కొంపదీసి ఎవలుకయినా బాగునేదేటి?"**

**సందేహిస్తూనే అడిగింది రాములు భార్య. దిగులుగా వస్తున్న పెనిమిటికి ఎదురుపడి.**

**"అమ్మికి ఒంట్లోను బాగోలేదట. మలేరియా టైపార్టీ బుర్రకి ఎక్కి పోయిందట. ఏగారంలోన ఆటో ఎక్కించి ఏలూరు ఆస్పత్రిల పడీసినారట"**

**నిట్టూరుస్తూ నిస్సత్తువుగా కూర్చుండిపోయాడు రాములు.**

"ఓలమ్మో! నేనేటి సేసీది తల్లో... ఎల్లి ఎన్నాలూ అవ్వలేదమ్మో... నా కూతురో.. నా కూతురా"

ఏడుపురాగమందుకుంది రాములు భార్య.

"సెవ్వులిల్లు గట్టి సెప్పాను. అందరమూ ఒక దగ్గిరే ఉందుము. పనోపాటో చేసుకుందుము. గంజో, గడుగో తాగుదుము అన్నాను. నా మాట ఇనిపించుకున్నారు గాదు"

తన మాట వినకుండా కూతుర్ని వలస తీసుకుపోయిన అళ్ళుడ్ని నిందిస్తూ మొర్రోమంటున్నాడు రాములు.

"ఔనర్రా... మనోలు...అంత బాగులేదా? ఎల్లివోరమైనా అవ్వలేదు. ఏమిగాచ్చారమే తల్లీ"

ఇరుగూపొరుగూ వచ్చి పరామర్శిస్తూనే ఉన్నారు.

"బిరాల బయిల్దేరర్రా. . . అక్కడ ఎలాగుందో ఏటో! ఎంతో బాగులేప్పోతే గదా ఫోనుసేత్తారు"

ఎవరో తొందర పెడుతున్నారు.

"నాలుగ్గంటల పేసింజరు బండి ఎక్కిపోండి. రేపు డైరెట్టుగ ఆస్పత్రికి ఎలిపోవొచ్చును"

ఇంకెవరో సలహా యిస్తున్నారు.

అలా తొందర చేస్తుంటే రాములు గుండెల్లో రైలుబండి పరిగెడుతున్నట్టే ఉంది.

"ఏటి సెయ్యిడిము... ఎందల బడిపోడము. పైసా అంటే పంది మేసినట్టి గుంది. మదుపులు పెట్టేసి ఉడుపులయితే ఉడిసీసినాము. మీదికి సూత్తన్నాము. వర్సం పడినట్టిగ లేదు. వొరిదుబ్బులు ఎండకి ఎండిపోతున్నాయి. కప్పపండుగుసేసినా వానదేముడు ఎక్కడా పికర్నేదు. ఎండ మల్లీశ్వరసోమికి ఎన్ని కుండల నీలు గుమ్మరించినా ఫలితం లేకపోయింది. సెలగలు తినీసి సెయ్యి కడిగీసినట్టైపోనాము. ఎవులుకి సెయ్యి సాపినా అప్పు పుట్టడం లేదు. ఈ గండము ఎలాగ గట్టెక్కుతాదిరా దేముడా!

రాములు ఉక్కిరిబిక్కిరౌతున్నాడు.

"నిజంగా ఊష్టమే వొచ్చిందో... కోపగొట్టోడు కొట్టిసినాడో! ఇక్కడుంటే ఆటలు సాగవనీ, అన్నిటికీ మేము అడ్డు తగుల్తున్నామని దేశిమెల్లీ వరకు ఊపిరితీసినాడు కాదు".

కూతుర్ని వలస తీసుకుపోయిన అల్లుడ్ని నిందిస్తూనే ఉంది రాములు భార్య.



గ్రామీణ కథల పోటీ విభాగంలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

"అమ్మా తురకల పోలమ్మ తల్లీ! నా కూతురు ఊష్టం తగ్గిపోయి సల్లగుంతే... నీకు కోడి కోక మరిసిపోను. సల్లని తల్లివి గదా? కాపాడుతల్లీ... కాపాడు"

తలపుకొచ్చిన దేవతల్ని మొక్కుతూనే ఉంది రాములు భార్య.

"ఎలాగైనా నాలుగ్గంటల బండెక్కిపోదాల. రేపు కూతుర్ని సూడాల. సేతిలసిల్లి గవ్వలేదు. చార్జీలమాటేటి? పిల్లసేటిల ఏటుంచుతాము. తిరిగి అట్నుంచి ఎలాగొత్తాము?

ఆలుమగలు యిద్దరిదీ ఒకటే ఆలోచన!

'ఏదో ఒకటి సెయ్యాల. ఎలాగైనా ఎల్లాల. పిల్లకంటున్నా'

ఇద్దరిదీ ఒకటే వేదన! ఆ మధ్యాహ్నానికి రాములు భార్యే అంది.

"ఔనో! అలాగ కాలట్ల బుర్రబెట్టేసి గడపలకూకుంటే. . . బండి మన దగ్గిరికొత్తాది.. ముండ్రాల మొగోడివి"

సాధ్యమైనంత వేగం డబ్బులు బెత్తాయించమని భర్తను తొందర పెడుతోంది.

"నీకు తెలీంది ఏటుంది. నేను మాత్రము ఏటిసెయ్యిగలను" దిగులుగా అన్నాడు రాములు.

"ఏదో ఒకదారి. అన్నీ దార్లూ మూసుకుపోతాయా? ఏదో ఒక పక్క తెరిసుండదా"

ఎక్కడో ఏదో అవకాశం ఉన్నట్లే మాట్లాడుతుంది రాములు భార్య.

అవేమిటో రాములకీ తెలుసు. భార్య ముందు పడలేదని గ్రహించాడు. లోలోపల మనసు కొంత తేలికపడినట్టయ్యింది.

రాములే అన్నాడు.

ఎటుసూసినా అదే కనబడుతుంది. అమ్మిద్దమైతే. . . గొర్రి పిల్లవంక చూస్తూ అన్నాడు రాములు.

"నీ మాట ఎప్పుడయినా కాదన్నానేటి?" అంటూనే నీళ్ళకుండ పట్టుకొని ఊరచెరువులేపు అడుగువేసింది.

గభీమని లేచాడు రాములు. తువ్వాలు పై మీద వేసుకొని ఊర్లోకి వెళ్లాడు.

వెళ్ళీ వెళ్ళీ దలారి గంగులు ఇంటి ముందాగాడు.

"ఏటి మామా? ఏటి సంగతి" అన్నాడు గంగులు.

"గొర్రెపిల్ల గురించి" బదులిచ్చాడు రాములు.

రేటు చెప్పమన్నాడు గంగులు. ఇంటికొచ్చి గొర్రెని చూడమన్నాడు రాములు. రోజూ చూసిందే గదా ఫరవాలేదు చెప్పమన్నాడు గంగులు.

"వెయ్యి రూపాయలు" చెప్పాడు రాములు. మరొక మాటాడమన్నాడు గంగులు.

"తొమ్మిదొందలు" అన్నాడు రాములు.

"అంతకయితే గిట్ట"దన్నాడు రాములు. మౌనం వహించాడు రాములు.

"ఎనిమిదొందలు యిత్తాను. అంతకంటే అదెల్దు. ఇంక నాలుగు రోజులు నేను దాన్ని మేపాల. ఇదే ఆఖరిమాట. ఖరాఖండిగా అన్నాడు గంగులు.

చేసిందిలేక.. ఆసుపత్రిలో కూతురి గుర్తుకొచ్చి అప్రయత్నంగానే తలూపాడు రాములు. గంగులిచ్చిన ఏభై రూపాయిల బయానా తీసుకొని ఇంటికొచ్చాడు.

"ఎల్లినపని ఏటయ్యింది పండా కాయ" నీళ్ళకుండ దించుతూనే అడిగింది రాములు భార్య.

"నువ్వు బేగి సంచి సర్దు. నాలుగ్గంటల బండెక్కిపోదుము" తొందర చేశాడు రాములు.

"బయల్దేరతాను గానీ.. ఎంతకొచ్చిసినావు గొర్రిని" ఆత్రంగా అడిగింది.

"ఎనిమిదొందలికీ" అన్నాడు రాములు.

"ఎనిమిదొందలా. . ఎనుబోతులాంటి గొర్రి. . . ఎనిమిదొందలా! నీకు లేప్పాతే కొన్నోడికయినా ఉండాలా!" నిలదీసింది.

గొర్రెను తక్కువ ధరకు అమ్మాడనీ, తెచ్చిన బయానా తిరిగి యిచ్చీమని. . యివ్వకపోతే. . ఒప్పీదిలేదనీ. . . తేల్చి చెప్పేసింది రాములు భార్య.

మాటయిపోయిందనీ . . . ఆపద సమయమనీ, చేసేదేమీ లేదని నిశ్చయించుకున్నాడు రాములు.

మధ్యాహ్నం మూడుగంటలు కావస్తోంది. దళారి గంగులు రానే వచ్చాడు. బయానాపోగా మిగతా సొమ్ము తీసుకొని గొర్రెను యిమ్మన్నాడు.

అడ్డుపడబోయింది రాములు భార్య.

"ఒలే. . . నువ్విటురాయ్" కళ్ళెర్రగించి కసిరాడు రాములు. రాములు చేతిలో డబ్బులుంచి గొర్రెను కన్నెతో లాక్కుపోతున్నాడు గంగులు.

"నా పేనాలు తీసేసి. . నాకట్టి మీద రెల్లి తోలికెలిపో గొర్రిని" వందో రెండొందలో కలిస్తే బాగని అడ్డుపడి గొర్రిని తోలుకుపోనివ్వ లేదు రాములు భార్య.

పదిమందిలో రాములుకి తల తీసేసినట్టయ్యింది. మాటపోయినా, ప్రాణం పోయినా ఒకటే. తన మాటకు అడ్డు తగిలినందుకు కోపం, పిల్లకు బాగోలేనందుకు చిరాకు, ఆకలి కలగలిసి. .

"ఒలే. . నా మాటొకటీ, నీ మాటొకటా? ఎవులు మాటపోయినా వొకటే గదా"

కళ్ళెర్రగించి నాలుక అడ్డంగా కరిచి భార్య చేయి పట్టుకొని లాగి గిరాటేశాడు. గడపలో రాయిమీద బోర్లాపడింది. తలకు దెబ్బ తగిలి రక్తం కారుతుంటే. . . కాళ్ళుచేతులు తన్నుకుంటుంది రాములు భార్య.

"ఓలమ్మో... సంపీసినాడమ్మో! కోపగొట్టోడు. సచ్చిపోయిందమ్మో! కూతుర్ని సూడ్డానికెల్తానని. . . తల్లిని కొట్టేసినాడమ్మో! పొరుగింటి ముసిల్ది లబోదిబోమంటుంది.

నిశ్చేష్టుడై కొట్టినచోటే కూర్చుండిపోయాడు రాములు. అప్పటికే అక్కడ గుమిగూడిన జనం మధ్య. . .

"108కి ఫోను చెయ్యర్రా" కేకేశారు ఎవరో!

"పెద్ద చెరువు 'ఈత' పేదోడి బతుకు. పాపం ఎంతని ఈదుతాడు కొడుకు. ఎంత ఈదినా కాలూ అందవు. సేతులూ అందవు. వొడ్డూ దొరకదు. సచ్చీ వరకు ఈ 'ఈత' తప్పదు గావాల.

108 హారన్‌లో ముసిల్దాని మాటలు కలిసిపోయాయి.

☆

# ఆగస్టు నెలలో చేయాల్సిన పొలం పనులు



## వరి

ముందుగా నాట్లు వేసుకున్న ప్రాంతాల్లో పైపాటు ఎరువులు వేసుకోవాలి. సిఫారసు చేసిన నత్రజనిలో మూడింట ఒకవంతు (1/3) నాటేందుకు ముందు, దమ్ములో వేసుకుంటారు. పైరు దుబ్బు చేసే దశలో 1/3 వంతు నత్రజనిని పైపాటు ఎరువుగా వేసుకోవాలి. యూరియాని పైపాటు ఎరువుగా వేసేటపుడు పొలంలో వున్న నీటిని తీసివేయాలి. బురద పదునులో యూరియా వేసుకొని తిరిగి 36-48 గంటల తర్వాత నీరు పలుచగా పెట్టాలి.

నత్రజని సమర్ధవంతంగా ఉపయోగపడాలంటే యూరియాను, వేపపిండిని, 5:1 నిష్పత్తిలో కలిపి 1-2 రోజులు నిల్వవుంచి, ఆ తరువాత వేసుకుంటే మంచిది. వేపపిండి లేనట్లయితే ఒండ్రుమట్టిని 1:5 నిష్పత్తిలో కలిపి వేసుకోవచ్చు. జింకు లోపం వచ్చే అవకాశం వుంది కాబట్టి, జింకు లోప లక్షణాల కోసం గమనించాలి. వరి పైరులో జింకు లోపం వున్నప్పుడు పై నుంచి 3 లేదా 4 ఆకుల్లో మధ్య ఈనె పాలిపోతుంది. ముదురాకు చివర్లో, మధ్య ఈనెకు ఇరువైపుల తుప్పు రంగు లేదా ఇటుక రంగు మచ్చలు కనిపిస్తాయి. ఆకులు చిన్నవిగా, పెళుసుగా వుండి వంచగానే శబ్దం చేస్తూ విరిగి పోతాయి. నత్రజని ఎరువులు వాడినా పైరు పచ్చబడదు. మొక్కలు గిడసబారి సరిగా దుబ్బుచేయదు.




వరి పైరులో జింకు లోప లక్షణాలు కనిపిస్తే లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి. 5 రోజుల వ్యవధి ఇచ్చి మరోసారి పిచికారీ చేసుకోవాలి.

పొలం గట్ల మీద ఉండే గడ్డి/కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసి శుభ్రం చేసుకోవాలి. నాటిన 30-45 రోజులలో 3 దశలుగా ఎకరాకు 20,000 చొప్పున ట్రైకోగ్రామా పరాన్న జీవులను వదలాలి. లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి మొగిపురుగు/ ఆకు ముడత పురుగుల ఉధృతిని గమనించాలి. తప్పనిసరి పరిస్థితులలో, సూచించిన మోతాదులో క్రిమి సంహారక / శిలీంధ్రనాశునులకు పిచికారీ చేసుకోవాలి.



## మొక్కజొన్న

మొక్కజొన్న విత్తుకొని 25-30 రోజులవుతున్న ప్రాంతాల్లో అంతర కృషి చేసి పైపాటు ఎరువుగా ఎకరాకు 50 కిలోల యూరియా వేసుకోవాలి. నేలలో తేమ వున్నప్పుడు మాత్రమే పైపాటు ఎరువులు వేసుకోవాలి. జింకు లోపం నివారణకు లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి.

## ప్రత్తి

మొక్క 30 రోజుల దశకు చేరుకున్నట్లయితే ఎకరాకు 16 కిలోల నత్రజని 8 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులను వేసుకోవచ్చు.



ప్రత్తి తొలిదశలో వున్నప్పుడు అధిక వర్షాలు కురిస్తే వేరుకుళ్ళు తెగులు వచ్చే అవకాశం వుంది. తెగులు ఆశించిన మొక్కలకు, దాని చుట్టూత వున్న మొక్కలకు 3% కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణంతో పూర్తిగా తడపాలి. స్ప్రేయర్ నాజిల్ తీసివేసి మొక్కలను పూర్తిగా తడపవచ్చు.



## సోయా చిక్కుడు

విత్తిన 20 - 25 రోజులకు గొర్రుతో అంతర కృషి చేయాలి. పొగాకు లద్దె పురుగుల ఉనికి ఉధృతి గమనించటానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. ప్రతి బుట్టలో 20 వరకు రెక్కల పురుగులు పడితే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

## చెఱకు

జనవరి - ఫిబ్రవరిలో నాటిన చెఱకు తోటల్లో జడ చుట్లు వేసుకోవాలి. జడచుట్లు వేసేటపుడు మొవ్వలో ఆరు నుండి ఎనిమిది పచ్చని ఆకులు వుండేటట్లు చూడాలి. లోతట్టు ప్రాంతాల్లో చెఱకు తోటలు ముంపునకు గురైతే నత్త/గుల్లలుగాని లిఫ్ట్ పంపులుగాని ఉపయోగించి ముంపునీటిని తీసివేయాలి. ముంపు తగ్గిన తర్వాత దగ్గర దగ్గరగా నీటి తడులు ఇస్తే కొత్త వేరు తొడిగి పంట ఎదుగుదలకు తోడ్పడుతుంది. ముంపు పరిస్థితులలో తెల్ల ఈగ ఎక్కువగా ఆశించే అవకాశం వుంది. తెల్ల ఈగ



నివారణకు లీటరు నీటికి 2 మి.లీ ఎండో సల్ఫాన్ కలిపి ఆకులు అడుగు భాగం తడిచేలా పిచికారీ చేయాలి.

## మినుము, పెసర

జూన్, జూలై మాసాల్లో వేసుకున్న పంటకు అంతర కృషి చేయాలి. వర్షాలు ఎక్కువైనా, నీరు ఎక్కువ నిలిచినా ఇనుము ధాతులోపం వచ్చే అవకాశం వుంది. ఇనుము ధాతు లోపం వుంటే ఆకులు లేత పసుపు రంగు నుండి తెలుపు రంగుకి మారతాయి. ఒక్కోసారి తుప్పు మరకలు కూడా గమనించవచ్చు. ఈ లోపాన్ని సరిదిద్దటానికి 50 గ్రాముల అన్న భేదికి 5 గ్రాముల నిమ్మ ఉప్పు, 150 గ్రాముల యూరియా ఒక స్ప్రేట్యాంకుకి కలిపి పిచికారి చేయాలి. వారం రోజుల వ్యవధి యిచ్చి మరోసారి పిచికారీ చేయాలి.

## వేరుశెనగ

విత్తిన 45 రోజుల వరకు కలుపులేకుండా చూడాలి. 45 రోజుల తర్వాత ఎలాంటి అంతరకృషి చేయకూడదు. 45 రోజుల తర్వాత కూడా అంతర కృషి చేస్తే ఊడలు దెబ్బతిని దిగుబడి తగ్గుతుంది. పైరు మొలచిన మూడు వారాల వరకు నీరు పెట్టకూడదు. పూత దశ, ఊడలు దిగు దశ, కాయా ఊరే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి.



నీటి పారుదల కింద వేరుశనగ సాగు చేస్తున్నట్లయితే, తొలి పూత దశలో ఎకరానికి 200 కిలోల జిప్సంను మొక్కల మొదళ్ళ దగ్గర చాళ్ళలో వేయాలి. వర్షాధారంగా సాగు చేస్తూంటే, ఊడలు దిగు సమయంలో అంటే రెండవ కలుపు తీసే సమయంలో జిప్సంను వేసుకోవాలి.

## ప్రొద్దు తిరుగుడు

వర్షాధారంగా ప్రొద్దుతిరుగుడు సెప్టెంబర్ ఆఖరు వరకు వేసుకోవచ్చు. డి.ఆర్.ఎస్.ఎఫ్. 108, కె.బి.ఎస్.హెచ్ 1, కె.బి.యస్.హెచ్ -44, డి.ఆర్.ఎస్. హెచ్ -1 ఎన్.ఒ.ఎస్. హెచ్ -1 రకాలు స్వల్పకాలిక రకాలు ఎకరాకు 500 -600 కిలోల దిగుబడి నిస్తాయి. తేలిక నేలల్లో వరుసల మధ్య 45 సెం.మీ మొక్కల మధ్య 20 సెం.మీ. బరువు నేలల్లో వరుసల మధ్య 60 సెం.మీ. మొక్కల మధ్య 30 సెం.మీ దూరం వుండేలా విత్తుకోవాలి.

ప్రొద్దు తిరుగుడు విత్తిన 10-15 రోజుల తర్వాత కుదురుకు ఒక్క ఆరోగ్యవంతమైన మొక్కను వుంచి మిగిలిన వాటిని తీసివేయాలి.

## పసుపు

తేలిక నేలల్లో నాటిన 30 రోజుల నుండి ప్రతినెల వ్యవధితో 5 నెలల వరకు కలుపుతీసి మట్టిని ఎగదోయాలి. బరువునేలల్లో చాళ్ళ మధ్య ఎడం ఎక్కువగా వున్నప్పుడు నాగలితో అంతరకృషి చేయాలి. ఆగస్టు -సెప్టెంబరు మాసాల్లో పసుపు తోటల్లో ఎక్కువగా ఇనుము ధాతులోపం

కనిపిస్తుంది. ఆకులు తెలుపు రంగుకు మారి ఆకుల చివర్ల నుండి ఎండిపోతాయి. ఈ లోపం వల్ల మొక్కలు ఎదగక గిడసబారిపోతాయి. 10 గ్రాముల అన్నభేది, 1 గ్రాము నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలి. 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

## క్యాబేజి

క్యాబేజ్‌లో స్వల్పకాలిక, మధ్యకాలిక రకాలను ఆగస్టు -సెప్టెంబర్ మాసాల్లో నాటుకోవచ్చు. గోల్డన్ఎకర్, ఎర్లీ డ్రమ్‌హెడ్, ప్రైడ్ ఆఫ్ ఇండియా , పూసముక్త, పరిరాణి గోల్, పూసాడ్రమ్ హెడ్ లాంటి రకాలు ఎంపిక చేసుకోవాలి. నార్లు పోసుకొని, 25-30 రోజుల వయస్సున్న నారును నాటేందుకు ఎంపిక చేసుకోవాలి.

## మామిడి

కాపుకి వచ్చిన మామిడిచెట్టుకి, ప్రతిచెట్టుకి 2.2 కిలోల యూరియా, 6 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, 1.6 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను 100 కిలోల పశువుల ఎరువుతోగాని, 10 కిలోల వర్మి కంపోస్టుతో గాని కలిపి చెట్టు మొదలు నుండి 1.5 మీటర్ల నుండి 2 మీటర్ల దూరంలో వేసుకోవాలి.

## గొర్రెలలో నీలి నాలుక వ్యాధి

వర్షాకాలంలో ఆగస్టు నుండి నవంబరు వరకు గొర్రెలలో నీలి నాలుక వ్యాధి వచ్చే అవకాశం వుంది. మన దేశంలో తొలిసారిగా 1964వ సంవత్సరంలో మహారాష్ట్రలో కనుగొన్నారు. మన రాష్ట్రంలో 1981వ సంవత్సరంలో మహబూబ్‌నగర్ జిల్లాలో గమనించటం జరిగింది. గొర్రెలకు అతి సూక్ష్మక్రిముల (వైరస్) వలన ఈ వ్యాధి వస్తుంది. ఈ వైరస్ వ్యాప్తికి 'క్యూలికాయిడ్' అనే దోమ సహాయ పడుతుంది.

వ్యాధిసోకిన మొదట్లో 104 నుండి 107 డిగ్రీల ఫారన్‌హీట్ జ్వరం వుంటుంది. నోటి లోపల, ముక్కులోపలి భాగాలు ఎర్రబడి చొంగకారుతుంది. చిగుళ్ళవాపు, నోటి లోపల, నాలుక మీద కురుపులు - నాలుక నీలిరంగు లోనికి మారటం- ఈ వ్యాధి లక్షణాలు.

వారం రోజుల తర్వాత నోటిలో కురుపులు మానిపోయి, కాళ్ళగిట్టల పై భాగంలో ఎర్రటి నెత్తురు చార కనబడి గొర్రె కుంటుతుంది. నీలి నాలుక వ్యాధి బారిన పడిన గొర్రెలు ఆహారం తీసుకోలేవు. సకాలంలో చికిత్స చేయించకపోతే గొర్రెలు క్రమేణా క్షీణించి 10 రోజులలో చనిపోవచ్చు.



వ్యాధి సోకిన గొర్రెలను మంద నుండి వేరుచేసి పరిశుభ్రమైన చోట వుంచాలి. నోటి పుండ్ల నుండి ఉపశమనం కలిగించటానికి పొటాషియం పెర్మాంగనేట్ ద్రావణంతో నోటిని శుభ్రం చేయాలి. 2 శాతం బోరో గ్లిసరిన్‌ను నోటి పుండ్ల మీద పూయాలి. గొర్రెలు ఆహారం తీసుకోలేవు కాబట్టి జావలో కొద్దిగా ఉప్పు కలిపి త్రాగించాలి. సకాలంలో పశువైద్యుని చేత సరైన చికిత్స చేయించాలి.

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి. గొర్రెల షెడ్డులలో నీరు నిలువ ఉండకుండా చూడాలి. దోమల నివారణకు సాయంత్రం వేళ గొర్రెలను కట్టేసే ప్రదేశంలో వేపాకు పొగవేయాలి. గాలికుంటు వ్యాధి లక్షణాలు, నీలి నాలుక వ్యాధి లక్షణాలు ఒకేలా వుంటాయి. కాబట్టి లక్షణాలను జాగ్రత్తగా గమనించి సకాలంలో చికిత్స చేయించాలి.

## సేంద్రీయ వ్యవసాయానికి సర్టిఫికేషన్

ఈ మధ్యకాలంలో సేంద్రీయ వ్యవసాయం పట్ల రైతులతో పాటు వినియోగదారులలో కూడా ఆసక్తి పెరిగింది. పూర్తిగా సేంద్రీయ పద్ధతులతో వ్యవసాయం చేసే రైతులకు సర్టిఫికేషన్ ఇచ్చేందుకు మన రాష్ట్రంలో "మంచి వ్యవసాయ పద్ధతులు మరియు సేంద్రియ వ్యవసాయ సర్టిఫికేషన్" ఒక ప్రత్యేక కార్యక్రమం 2006 -07 సంవత్సరం నుండి అమలులో వుంది. ప్రతి జిల్లాలోనూ రైతులకి, సర్టిఫికేషన్ ఏజన్సీకి మధ్య అనుసంధాన కర్తలు వుంటారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల పై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తారు. రైతుల పొలాలను తనిఖీ చేసి అవసరమైన సర్టిఫికెట్ ఇస్తారు. దీని కోసం రిజిస్టర్ చేసుకున్న రైతులకు, సర్టిఫికెషన్ ఛార్జీలను రాష్ట్రప్రభుత్వం భరిస్తుంది. రైతులు వ్యవసాయశాఖ అధికారులను కలిసి ఈ పథకం పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

## పొలం బడి

రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించేందుకు మన రాష్ట్ర వ్యవసాయ శాఖ 'పొలంబడి' అనే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్రసస్యరక్షణ, యాంత్రీకరణతో కూడిన సేద్య పద్ధతులను రైతులకు వివరిస్తారు. 30 మంది రైతులు ఒక బృందంగా ఏర్పడి ఈ అంశాల గురించి చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. పొలంబడి కార్యక్రమాన్ని పంటపొలాల్లోనే నిర్వహిస్తారు. మిత్ర పురుగులను సంరక్షించటం, రైతులను సమగ్ర పంటల యాజమాన్యంలో ప్రావీణ్యులను చేయటం, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ వ్యవసాయం చేయటం పొలంబడి ముఖ్య ఉద్దేశ్యం. మండల వ్యవసాయ అధికారి సహాయంతో గ్రామ సర్పంచ్ తమ గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం తప్పక అమలు జరిగేలా చూడాలి. పొలంబడి కార్యక్రమాన్ని సమర్ధవంతంగా ఉపయోగించుకుంటే ప్రతి గ్రామంలో మంచి పంట దిగుబడులు పొందవచ్చు.

*- జి. విజయకుమార్, ఆకాశవాణి*

**ఎప్పుడో ఈ పచ్చని పైరు పొలాల మధ్య విహరించినట్టు అనిపిస్తోంది. నిజానికి పట్నంవాసంలో తరాలుగా స్థిరపడిపోయిన మా వంశీకుల్లో చాలా మంది ఇంతవరకూ పల్లెటూరి మొహమైనా చూడలేదు. అత్యాధునిక విలాసాల్లో మునిగి తేలే వారికి ఇలా పల్లె జీవనం గురించి అంతగా తెలీనుకూడా లేదు. నేను ఇక్కడికి రావడం కూడా ఇంట్లో వాళ్లకు సుతరామూ ఇష్టంలేదు. అయినా ఒక్కదాన్నీ రావడం లేదు గనుక, హరిణి పెళ్ళికి మా కాలేజ్ నించి దాదాపు వందమంది పైగా బయల్దేరారు గనుక అయిష్టంగానే ఒప్పకున్నారు.**

# అమ్మ

## స్వాతి శ్రీపాద



అయితే వారం రోజుల ముందుగానే నేనూ, సీతా, హరిణితో ఇక్కడకు రావడం మాత్రం ఓ చిన్న అబద్ధం చెప్పాకే సాధ్యమయింది. కాలేజ్ నించి బొటానికల్ టూర్‌కి వెళ్తున్నామని చెప్పి ఇటు వచ్చాం. వచ్చింది మొదలు ఎన్ని సరదాలు. ఎన్ని సంబరాలు.

పెద్ద చావిడితో ఇంటి ముందు వెనుక విశాలమైన స్థలం. ముందర రకరకాల పూల మొక్కలు, పెరట్లో కూరగాయల పాదుల మడులు... ఇంటి ముందు పూల మొక్కలు మడులు, గులాబీలు, ముళ్ళ గోరింట, డిశంబర్ పూలతో పాటు కనకాంబరాలు చూడగానే మనసుకు ఆహ్లాదంగా అనిపించింది.

ఎప్పుడో పండుగ రోజుల్లో ఓ పది రూపాయలిచ్చి ద్వారానికో, పూజకో పూలు కొనుక్కోడం తప్ప ఇన్ని పూలెప్పుడూ, అదీ ఇంత ఫ్రెష్‌గా చూసిందేలేదు. హరిణి నాన్న గారు పొద్దున్నే లేచి పెరట్లో పాదుల దగ్గర పిచ్చి మొక్కలు పీకెయ్యడం, పురుగుబారిన ఆకులను తొలగించడం వంటిది చేస్తే వాళ్ళమ్మ దొడ్లో పాలు పితకడం చాలా అబ్బురమనిపించింది. గేదెలను, వాటి పాలు తియ్యడం చూడటం ఇదే మొదటిసారి. నాకూ పాలు పితుకుదామన్న సరదా కలిగింది.

“అమ్మా, రమ్య ఓ సారి పాలు పితుకుతాననంటోంది” నా కోరిక విన్న హరిణి వాళ్ళమ్మకు విన్నవించింది.

“కొత్త స్పర్శ తగిలితే ఇది ఊరుకుంటుందో లేదో, అసలే మీ నాన్న చెయ్యి తగిలినా కాలు విసురుతుంది...” సంశయంగా అంది హరిణి అమ్మగారు.

గేదెలు స్పర్శ పోల్చుకోవడమా? అంతా ట్రాష్... అందుకే పల్లెటూరి మొహాలు అన్నది.. మనసులోనే అనుకుని ఏదేమైనా అంతా ఒట్టి నమ్మకమేనని నిరూపించదలుచుకుని, ఆవిడను బ్రతిమాలాను.

“ఆంటీ, ఒక్కసారి కనీసం మీ పక్క నుంచి ప్రయత్నిస్తాను...”

ఆవిడ ఏమనుకున్నారో . . .

“సరే, కాస్త వెనక్కి వుండు. ఎందుకైనా మంచిది... అంటూ పక్కకు తప్పుకుని నాకు చోటిచ్చారు. కాస్త ఉత్సాహంగా మరింత కుతూహలంగా ఆంటీలా కూర్చోవాలని ఎంత ప్రయత్నించినా కుదిరితేనా? మోకాళ్ళ మధ్య పాలచెంబును ఇరికించుకుని పాదాల మీద ఎలా గొంతుక్కూచోగలిగారో! సోఫాలు, కుర్చీలకు అలవాటు పడి ఇలా ప్రయత్నించడం కష్టంగానే తోచింది.

చివరికి ఎలాగైతేనేం కష్టపడి సాధించి చెయ్యి ముందుకు చాపాను.

కాళ్ళు ఓ పక్కన వణుకుతున్నాయి. చెంబు జారి పోతుందేమోనన్న ఆదుర్దా ఓ పక్క, మరో పక్క నిజంగా గేదె తంతుందేమోనన్న భయం. నా వేళ్ళు పూర్తిగా పొదుగును నిమరనన్నా లేదు గేదె తల ఓ విసురు విసిరి వెనక్కాలు ఒకటి ముందుకు తెచ్చింది. హడలి పోతూ వెనక్కు జరిగాను. ఆంటీ గేదెను అదలించారు.

“ఆగు ఆగు.. నేనే” ఆ మాటలు వింటున్నట్టుగా అది ఆవిడ వంక తలతిప్పి చూసింది. ఎన్ని సార్లు ప్రయత్నించినా ఇదే వరుస, ఇక లాభం లేదని చెంబు ఆవిడకందించి లేచాను.

జంతువులకు కూడా ఇంత సునిశిత స్పర్శ, జ్ఞానమా అని నివ్వెరపడ్డాను. మోకాళ్ళు పట్టుకు పోయాయి.

ప్రతీ పనీ కొత్తగానే అనిపిస్తోంది. ఆవిడ పాలు పితికి దూడను వదలడం, అది ఆర్తిగా తల్లి పొదుగు కుమ్ముతూ పాలు తాగడం.

మొహాలు కడుక్కునే సరికి, చిక్కటి కాఫీ అందించారు ఆంటీ. అలాంటి రుచి జన్మలో చూడలేదు.

పనిమనిషి వచ్చి పెరట్లోనే గిన్నెలను తోమి బోర్లించి వెళ్ళాక ఆవిడ మళ్ళీ వాటిని నీళ్ళతో తొలుచుకుని లోపల పెట్టుకున్నాక గాని స్నానానికి వెళ్ళలేదు. ఎక్కడైనా అంటో మసో మిగిలిపోతే తీరిగ్గా వాటిని శుభ్రం చేసుకున్నారు.




చాదస్తం మాట వదిలేస్తే ఇత్తడి గిన్నెలు పుత్తడిలా మెరిసి పోవడం... ఎంత పరిశుభ్రత. అందుకే పల్లె జనాలు ఆరోగ్యంగా వుంటున్నారేమోననిపించింది. ఆంటీ స్నానం చేస్తూనే సూర్యాష్టకం చదివారు.

"ఆది దేవ నమస్తుభ్యం" అంటూ ఎంత పవిత్రంగా అనిపించింది.

తడిబట్ట చుట్టుకునే మడిగా నీళ్ళు తెచ్చుకుని వంట ఆరంభించారావిడ.

ఆవిడ వంట చేస్తూ గజేంద్రమోక్షం, రుక్మిణీ కళ్యాణం అలా పద్యాలు పద్యాలు చదువుకుంటూ పోతూనేవున్నారు. ఆయన కూరలు తెంపుకొచ్చి కడిగి ఆవిడకు సాయంగా కోసి ఇవ్వడం, మధ్య మధ్యలో ఆవిడ చదివే వాటిలో తప్పులు సవరించడం... నేను చదివిన ఫెమినిజమ్, అణగద్రొక్కబడటం గుర్తుకు వచ్చి నవ్వొచ్చింది.

అయితే పనివాళ్ళని ఇంట్లోకి రానివ్వకపోవడం, మడి మడి అంటూ వాళ్ళను దూరంగా వుంచటం కాస్త ఇబ్బందిగానే అనిపించింది.

హరిణి ముందే చెప్పింది - మా అమ్మ కాస్త చాదస్తం ఎక్కువ, ఆవిడను మార్చడం ఆవిడను పుట్టించిన బ్రహ్మ తరం కూడా కాదు. అది భరించగలమనుకుంటేనే రండి. ఎంత చాదస్తం వున్నా అమ్మలో మానవనైజం మమ్మలను ఆవిడమాటకు కట్టుబడి వుండేలా చేస్తుంది.. అందుకే ఎదురు చెప్పలేం" అంటూ.

వంట పూర్తవుతూనే వండిన ప్రతి వస్తువూ నైవేద్యం పెట్టాకే వడ్డించటం మొదలెట్టారు. సరిగ్గా మా భోజనాలు సగం వరకు వచ్చాయో లేదో "పిన్ని గారూ పిన్ని గారూ" అంటూ హడావిడిగా పిలుపు వినిపించింది.

"వెనకింటి విరజాక్షి గొంతది.. ఏం అవసరం వచ్చిందో.." మా వెనగ్గా వెళ్ళి, ఆవిడను పరామర్శించింది. పెరట్లో మాట్లాడుతున్నా వాళ్ళ మాటలు వినిపిస్తూనేఉన్నాయి.

"రాధారాణికి హఠాత్తుగా నొప్పులు మొదలయాయండి... ఇంకా నెలలు నిండలేదుగదా జాగ్రత్తగా వుండు తమ్ముడి దగ్గరకు వెళ్ళిన అమ్మను తీసుకు వస్తానని అతను రాత్రనగా వెళ్ళిన వాడు అజా పజా లేడు.. ఏం చెయ్యాలో పాలు పోవడం లేదు"

"అయ్యో అల్లాగా, పిల్లను ఒక్కదాన్నీ వదిలేసి వచ్చావా? అది బెంబేలెత్తి పోదూ... ఇదిగో క్షణంలో వస్తా... నువ్వు పద" ఆవిడ వంటింటికి తిరిగి వచ్చినా అన్య మనస్కంగానే ఒకటి అడిగితే ఒకటి వడ్డించారు. ఇలా అందరికి మజ్జిగ పోస్తూనే గిన్నెలు సర్దుకుని వెళ్ళడానికి తయారయారు.

"అన్నం తిని వెళ్ళరాదూ..." ఆ ఒక్క మాట చాలు ఆయన కన్సర్న్ గురించి చెప్పేందుకు.

"ఆ పిల్ల అక్కడా ఒక్కత్తీ కష్టపడుతుంటే.. ముద్ద దిగ వద్దూ" అంటూ అని ఏమనుకున్నారో గబగబా కంచంలో నాలుగు మెతుకులు వడ్డించుకుని హడావిడిగా ఏదో తిన్నాననిపించి వెళ్ళారు.

వెళ్తూ వెళ్తూ "ఇదిగో నేను రావడం ఆలస్యమైతే మధ్యాహ్నం కాస్త అన్నమే పెట్టుకు తినేయండి.. నాన్నకు కొంచం కారప్పూస, ఓ కప్పు టీ ఇవ్వు" అని హరిణికి సూచనలిచ్చి కదిలారు.

ఇక్కడ ఎవరికి ఏ కష్టం వచ్చినా అమ్మే ఆపద్భందువు అని చెప్పింది హరిణి. పొట్టపగలా తిని కబుర్లు చెప్పుకుంటూ హాయిగా నిద్రపోయాం. హరిణి నాన్నగారు లేపితే గాని మెళుకువ రాలేదు మాకు. సాయంత్రం పొలం గట్ల వెంటా షికారుకి వెళ్ళీ ఊరి చివర మందిరానికి వెళ్ళి మసక చీకట్లు కమ్ముకునే వేళ ఇంటికి తిరిగి వచ్చాము.

ఇంకా హరిణి అమ్మగారు రానేలేదు. మేమందరం కలిసి ఎల్లాగో చేతులూ కాల్చుకుని. కొంచం మాడిన బంగాళదుంపల వేపుడు, కాస్త చారు కాచుకుని భోజనాలు కానిచ్చాం. రాత్రి పది దాటాక వచ్చిందావిడ.

"మగ పిల్లవాడు. తల్లీ బిడ్డా క్షేమం.. ఇలా పిల్లాడూ పుట్టాక దిగారు తల్లీ కొడుకులు.. హరిణీ కొంచెం వేణ్ణీళ్ళు పెట్టు తల్లీ. స్నానం చెయ్యాలి.. ముసల్ది కొడుకు కులంగాని పిల్లను చేసుకున్నాడని రుస రుస లాడేది. ఇప్పుడు నా మనవడూ నా మనవడూ అంటూ పొంగిపోతోంది.."

నీళ్ళు కాగే వరకూ ఏదో ఒకటి మాట్లాడుతూనే వుంది.

ఓ పక్క మడీ ఆచారాలు. మరో పక్క పరోపకారం.

రెండు విభిన్న లక్షణాలు :

ఐదారు రోజులు ఎంత తొందరగా గడచిపోయాయో..

నిన్నటికి నిన్న చీకటి పడి రాత్రి పనులు ముగిసే వేళకు పనిమనిషి ఆండాళ్ళు గొడ్డును బాదినట్టు చావబాదిన మొగుడి బారినుంచి తప్పించుకుని పరుగెత్తుకు వచ్చింది. తల పగిలి నుదుటి మీదుగా కారుతున్న రక్తం. వెనకా ముందూ ఆలోచించకుండా ఆండాళ్ళుని దగ్గరకు తీసుకుని గాయానికి కట్టుకట్టి ఒళ్ళంతా కాపడం పెడుతుంటే ఆవిడలో నాకు ఓ మనిషి కనిపించింది. తెలిసిన పసరు వైద్యంతో ఆమెకు కాస్త ఉపశమనాన్నీ చేకూర్చాక..

అతగాణ్ణి పిలిపించి ఇంకోసారి ఇలా జరిగితే తనే స్వయంగా పట్టణం నుంచి పోలీసులను పిలిపిస్తాననీ జైల్లో చిప్పకూడు తింటూ పడివుండాల్సి వస్తుందనీ హెచ్చరించి, మందలించి ఆండాళ్ళు నాలుగు రోజులిక్కడే వుంటుందనీ పంపించి వేశారు.

పట్నంలో అదో పోటీ ప్రపంచం. ఎలా పక్క వాడి నెత్తినెక్కి పైకి వద్దామా అని మధన పడే వాళ్ళే ఎక్కువ. పక్కవాడు బాగుపడినా ఏడుపే. అలాంటిది.. ఇబ్బందులున్నా పల్లె జీవనంలో తృప్తి ఎన్ని వరహాలిచ్చినా కొనుక్కోగలమా అనిపించింది.

ఇదివరలో హరిణి పల్లెలో ప్రాక్టీస్ పెడతానంటే మేమంతా వేళా కోళం చేసేవాళ్ళం. ఇప్పుడు మా ఆలోచనా ధోరణి మార్చుకోవాలేమో అనిపిస్తోంది. నిజానికి డాక్టర్ల అవసరం పల్లెలకే వుంది... బలిసి రోగాలు కొని తెచ్చుకుంటున్న పట్నవాసులకు, అక్కడి జనాలకూ కాదనిపించింది.

పెళ్ళి పనులకు శ్రీకారం చుట్టేముందు ఆ వూరి అమ్మవారు గౌరి దేవికి ఒడిబియ్యం పోసిరావడం ఆనవాయతీ అట. అది ముఖ్యంగా ఆడవాళ్ళ ఆచారం కావడంతో వుదయం చీకట్లు ఒదలకముందే అప్పటికే దిగిన కొంతమంది బంధువులు ఇరుగు పొరుగు ఆడవారితో మేమంతా గుడికి బయల్దేరాం. దాదాపు రెండు కిలో మీటర్ల దూరంలో ఊరికి ఎడంగా ఏరు పక్కనవున్న గుడి చిన్న మందిరం. చుట్టూ పచ్చని పూలతోట. దాన్ని ఆనుకుని నది.

ముందే చెప్పి పెట్టడంతో పూజారి వచ్చి ఉన్నాడు యధావిధిగా పూజ మంత్రాలు జరుగుతున్నాయి. మంత్రాల మధ్య హఠాత్తుగా ఆగి ఆగి వినిపిస్తోంది కేర్ కేర్ మంటూ పసి కూన ఏడుపు. అందరం విన్నాం... ఎక్కడినించబ్బా ఏడుపు అనుకున్నాం గాని వెంటనే ప్రతిస్పందించ లేకపోయాం. చేతిలో పూలు చటుక్కున వదిలి లేచి నించున్నారు హరిణి అమ్మగారు.

హరిణి తెల్లబోయి చూస్తోంది.

''పూజ మధ్యలో ఉంది. పిల్లతో చేయించవయ్యా.. చంటి కూన ఏడుపు విన్నాక ఇంకా పూజ అంటూ కూచుంటే..'' మాట పూర్తి చెయ్యకుండానే ఏడుపు వచ్చిన దిక్కుగా కదిలిందావిడ. పది గజాల దూరంలో ఇంకా బొడ్డు కూడా కొయ్యని ఆడపిల్లను ఎవరో పొదల్లో వదిలేసి వెళ్ళినట్టున్నారు.

అప్పటికే రెండు మూడు కుక్కలు ఏడుపు విని అక్కడకు చేరుకున్నాయి. వాటిని అదలిస్తూనే ముందుకు వెళ్ళి పిల్లను చేతుల్లోకి తీసుకుంటూ ఆండాళ్ళను కేకేసి మంత్రసాని కోసం కబురంపారు. హరిణి పూజ ముగిసేసరికి పిల్లబొడ్డు కోసేందుకు మంత్రసాని రావడం పిల్లను గుండెకు హత్తుకుని ఆవిడా పిల్లదాన్ని సముదాయించడం జరిగింది.

ఇంటికి ఎలా వచ్చామో మాకే తెలీదు.

ఊరు ఊరంతా పిల్లను చూసేందుకు తరలి వచ్చింది.

కాని బాధ్యత తీసుకునేందుకు అందరికీ తటపటాయింపే.

"అమ్మ వారి దయ. మనమే పెంచుకుందాం."

"ఏ పాపపు ఫలమో.. ఏం కులమో మనకెందుకు." హరిణి నాన్నగారి మాటలు పూర్తి కాకముందే గయ్ మని లేచింది ఆవిడ.




"కులం ఫలం మనం రాసుకున్నవే... పుట్టిన పిల్లకేం తెలుసు.. ఆరు నూరైనా పిల్లను గాలికి వదిలేదే లేదు. నా చేతుల్లోకి వచ్చినప్పుడే అది నా పిల్లయిపోయింది. మరో మాటకు తావులేదు.." తన నిర్ణయం చెప్పి మీరేదైనా తన్నుకు చావండి అన్నట్టు పిల్లతో లోపలకు వెళ్ళి పోయిందావిడ.

శుష్క వచనాలతో ఉపన్యాసాలిచ్చి ఆచరణకు పది ఆమడల దూరంలో మిగిలిపోయే ఆధునిక నాగరీకులు ఈ పల్లె ఒడిలో పెరిగి అమ్మ మనసుకు అద్దం పట్టిన ఆవిడముందు ధూళీ రేణువులా కూడా తోచలేదు. పిల్లని కంటేనే అమ్మవుతారా, ఆదరించే ప్రేమ లేకపోయాక.. అందుకే ఆమె అందరికి అమ్మే. ☆

Printed & Published by: Dr Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Dr. Phani Kumar**

# వార్తల్లో 'అపార్డ్'

(పూర్తి వివరాలు 24వ పేజీలో)







RNI No. APTEL / 2009/27888



# సోదరీ సోదరుల అనురాగ బంధం
# రాఖీ పౌర్ణమి





Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.